


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




మంగళవారం | 11-2-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 297 | శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 2.54 తదుపరి చవితి; నక్షత్రం: పుబ్బ మ. 2.24 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 8.48 -10.14; దుర్ముహూర్తం: ఉ. 9.05-9.50, రా. 10.20-11.09; అమృతఘడియలు: ఉ. 8.43-10.08, తె. 5.22-6.47; రాహుకాలం: మ. 3.00-4.30 వరకు; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 6.12 | విజయవాడ సిటీ

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

# చార్జీల షాక్!



## విద్యుత్ వినియోగదారులపై కొత్తగా 1300 కోట్ల భారం

- 500 యూనిట్ల వినియోగంపై యూనిట్‌కు 90 పైసల పెంపు
- లక్షన్నరమందికి నేరుగా దెబ్బ
- మున్సిపల్,పంచాయతీకి వాతే
- వెయ్యికోట్లు పిండేలా అడుగు
- ఇకపై ప్రతినెలా శ్లాబ్ నిర్ధారణ
- రైల్వే వినియోగంపై 200 కోట్లు
- పెంపుపై సర్కార్ ప్రతిపాదనకు రెగ్యులేటరీ కమిషన్ ఆమోదం

"అటు సంస్థలను కాపాడుతూనే, ఇటు వినియోగదారులపై భారం పడకుండా జాగ్రత్త వహిస్తూ నిర్ణయాలు తీసుకొంటున్నాం. ప్రభుత్వంపై సబ్సిడీ భారం పడకుండా ఎంతోకొంత చార్జీల పెరుగుదలను ప్రజలు కూడా అంగీకరించాలి"
- జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం చార్జీల భారం మోపనుంది. కరెంటు చార్జీల పెంపునకు సంబంధించి జగన్ సర్కారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఆమోదముద్ర వేసింది. దీనివల్ల కొత్తగా రూ. పదమూడు వందల కోట్ల భారం ప్రజలు, ప్రభుత్వ సంస్థలపై పడనుంది. పంచాయతీలు, పురపాలక సంఘాలకయితే ఏకంగా వాతే పెట్టారు. వచ్చిన తొమ్మిది నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై వైసీపీ ప్రభుత్వం పెడుతున్న రెండో బరువు ఇది. ఇప్పటికే ఆర్టీసీ చార్జీల మోత మోగించిన ప్రభుత్వం.. ఇప్పుడు కరెంటు చార్జీలను పెంచేందుకూ సిద్ధమయిపోయింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే పెరిగిన చార్జీలు అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు విద్యుత్ చార్జీల విధానాన్ని (టారిఫ్ ఆర్డర్) కమిషన్ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విడుదల చేశారు. నెలకు ఐదు వందల యూనిట్లకు పైబడి విద్యుత్ వినియోగిస్తున్న వారికి ఒక యూనిట్‌కు రూ.90 పైసలు పెంచారు. వారికి అంతకు ముందు యూనిట్‌కు రూ. 9.05 చార్జి విధించేవారు. వారికి ఇకపై ఒక యూనిట్‌కు రూ.9.95 విధిస్తారు. రాష్ట్రంలో మొత్తం గృహ వినియోగదారుల సంఖ్య ఒక కోటీ నలభై ఐదు లక్షలు. ఇందులో ఈ శ్లాబ్ పరిధిలోకి ఒక లక్షా ముప్పై ఐదు వేల మంది దాకా ఉంటారు. వీరికి తప్ప

మిగతా 10వ పేజీలో...


విద్యుత్ చార్జీల కొత్త టారిఫ్‌ను విడుదల చేస్తున్న ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగార్జున రెడ్డి, సభ్యులు రఘు, రామ్మోహన్

### ప్రజలపై భారం దుర్మార్గం

మేం మాట నిలబెట్టుకున్నాం

వైసీపీ నమ్మించి మోసం చేసింది: బాబు

11


సీఎం జగన్ సమక్షంలో ఒప్పందం చేసుకుంటున్న చెన్నైకి చెందిన ఎంఎస్ఎస్ఆర్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరిహరన్, ఏపీ వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ అరుణ్‌కుమార్

# రైతుకు సాంకేతిక దన్ను

11 అగ్రి సంస్థలతో ప్రభుత్వం ఒప్పందం

సేంద్రియ, సహజ వ్యవసాయంలో అన్నదాతలకు సంపూర్ణ శిక్షణ

సంస్థల్లో స్వామినాథన్ ఫౌండేషన్ కూడా

సాంకేతిక విప్లవంతో రైతు తలరాత మార్పు

ముఖ్యమంత్రి జగన్ ఆశాభావం

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో మార్పులు తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. సేంద్రియ, సహజ వ్యవసాయంలో రాష్ట్ర రైతులకు సాంకేతిక, విజ్ఞాన బదలాయింపు జరగడం వీటిలో కీలకాంశం. రైతులకు తగిన సూచనలు, సలహాలు, శిక్షణ ఇచ్చేందుకు 11 ప్రఖ్యాత వ్యవసాయ సంస్థలతో ఈ ఒప్పందాలు జరిగాయి. ఆయా సంస్థలు మన అన్నదాతలకు సాంకేతికంగా సంపూర్ణ విజ్ఞానం

మిగతా 2వ పేజీలో...

# 'సెలెక్ట్'కు సర్కార్ బ్రేక్..!

చైర్మన్ ఆదేశాలకు మండలి కార్యదర్శి నో

కమిటీపై నోటిఫికేషన్‌ను కోరిన షరీఫ్

నిబంధనల ప్రకారం లేదంటూ వెనక్కి

ప్రకటించి 14రోజులు దాటిపోయినందున రూల్స్ అనుమతించవని కార్యదర్శి వెల్లడి

మా బిల్లులు పాసయినట్టే: మంత్రులు


శాసన మండలి కార్యదర్శి బాలకృష్ణమాచార్యులను కలిసిన టీడీపీ ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, అశోక్‌బాబు తదితరులు

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 'అటాక్.. అటాక్.. ఎలుక పిల్లి మీదకే.. జింక పులి మీదకే..' ఈ పాట వింటున్నప్పుడు కొంచెం కొత్తగా అనిపిస్తుంది. కానీ రాష్ట్ర శాసనమండలిలో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తుంటే, ఇది నిజమేననిపిస్తోంది. మండలి ఇప్పటికే తిరస్కరించిన సీఆర్డీఏ రద్దు, పాలనా వికేంద్రీకరణ

మిగతా 11వ పేజీలో...

### చైర్మన్ చెబితే కోర్టులే కాదనవు

ప్రభుత్వానికేమి అధికారం ఉంటుంది?

కార్యదర్శిపై హక్కుల నోటీస్ ఇస్తాం: టీడీపీ

# నిన్న జాస్తి, నేడు ఏబీ.. రేపెవరో?

- 'టార్గెట్'లపై అసంబద్ధ ఆరోపణలు
- తీవ్ర ఆందోళనలో ఐపీఎస్ వర్గాలు




సీనియర్ ఐపీఎస్‌పై దేశద్రోహమా!

నిఘా అధిపతి ఆ పని చేయగలరా?

బీఎస్ఎఫ్ బహిరంగంగా వాడుతున్న పరికరాలెలా దేశ రహస్యాలవుతాయి?

గాజా బోర్డర్‌లో వాడేవి నాసిరకానివా?

అసలు కొనుగోలే చేయని ప్రక్రియలో వెంకటేశ్వరరావు కుమారుడికి లబ్ధా?

ప్రభుత్వాలు మారగానే కక్ష సాధింపా?

ఇలాగైతే పని చేయలేమని స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిన్న ఐఆర్ఎస్ జాస్తి కృష్ణకిశోర్, నేడు ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, మరి రేపు..? అఖిల భారత సర్వీసు అధికారులను ఇప్పుడు నిద్రకు దూరం చేస్తున్న ప్రశ్న ఇదే! ప్రభుత్వం మారిన తొమ్మిది నెలల్లో 'టార్గెట్' చేసినట్టు కొందరు సీనియర్ అధికారులపై పనిగట్టుకొని కేసులు పెట్టి వేధింపులు, సస్పెన్షన్ వేట్ల తీరు, అందుకు కారణాలుగా చెబుతున్న ఆరోపణలను చూస్తే వీరి భయాలను పూర్తిగా కొట్టివేయడానికి లేదనిపిస్తోంది. 'ముప్పై సంవత్సరాల సర్వీసు చేసిన ఒక డీజీపీ ర్యాంకు అధికారి దేశ ద్రోహానికి పాల్పడతారా? ప్రభుత్వాలు మారినప్పుడు తమిళనాడు లాంటి చోట్ల ప్రతీకారాలు ఉంటాయని

మిగతా 10వ పేజీలో...


హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాన్వాయ్ వెళుతుండగా.. మోకాళ్లపై కూర్చుని జెండాలు, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రాజధాని రైతులు

# సీజే అయినా వింటారని..!

రాజధాని విషయంలో న్యాయం కోసం సీడ్ యాక్సెస్ రోడ్డులో మోకాళ్లపై రైతులు

హైకోర్టు సీజే, జడ్జిలు వచ్చే సమయంలో దణ్ణం పెట్టి మరీ వేడుకున్న మహిళలు

తమ గోడును ఆలకించాలని వినతి

'అమరావతి' కోసం 55వ రోజూ దీక్షలు

'మా భూముల్ని అభివృద్ధి చేసివ్వండి'

హైకోర్టును ఆశ్రయించిన రైతులు

తుళ్లూరు, ఫిబ్రవరి 10: "మాకు మీరే న్యాయం చేయాలి" అంటూ రాజధాని గ్రామాలకు చెందిన రైతులు, మహిళలు హైకోర్టు న్యాయమూర్తులను వేడుకున్నారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా న్యాయమూర్తులు హైకోర్టుకు వెళ్లే సమయంలో దారికి ఇరువైపులా చేతులు జోడించి కొందరు, మోకాళ్లపై కూర్చుని మరికొందరు రైతులు, మహిళలు న్యాయమూర్తులకు తన గోడును మౌనంగానే విన్నవించుకున్నారు. ప్రధాన న్యాయమూర్తి(సీజే) సహా ఇతర న్యాయమూర్తుల వాహనాలు వెళ్లే సమయంలో చేతులు జోడించి దణ్ణం పెడుతూ

మిగతా 11వ పేజీలో...

## సైకోలా జగన్

రాయిటర్స్‌లోనూ మేమే రాయించామంటారా!

ఇది చేతగాని దద్దమ్మ, విధ్వంసకర పరిపాలన

అమరావతికి అనుకూలంగా మాట్లాడిన విద్యార్థులను చితకబాదుతారా?

వీసీ సమక్షంలోనే జరగడం బాధాకరం

ఆయన తన బాధ్యతలను విస్మరించారు

సీఎం, ఏఎన్‌యూ వీసీపై చంద్రబాబు ఆగ్రహం

తీవ్రంగా గాయపడిన విద్యార్థులకు పరామర్శ



9

# 'పారాసైట్'కు ఆస్కార్

ఉత్తమ చిత్రంగా పురస్కారం

అవార్డు దక్కిన తొలి ఆంగ్లేతర సినిమా!

ఉత్తమ నటుడు.. జోక్విన్ ఫీనిక్స్.. నటి రెనీ జెల్వెగర్

## చైనా 'జీవాయుధం' వెనక అమెరికన్ శాస్త్రవేత్త!



వెలికి వస్తున్న కరోనా వైరస్ రహస్యాలు

నానో సైంటిస్టు లీబర్ అరెస్టు.. పూచీకత్తుపై బెయిల్

హార్వర్డ్ వర్సిటీలో పనిచేస్తున్న లీబర్.. ఎఫ్‌బీఐ చార్జిషీటు

9

# రిజర్వేషన్లపై ఆత్మరక్షణలో మోదీ సర్కార్

## దద్దరిల్లిన పార్లమెంట్

కోటా పరిరక్షణలో కేంద్రం విఫలం: ప్రతిపక్షం

ఆ కేసులో మా అభిప్రాయం కోరలేదు: కేంద్రం

స్వపక్షాల్లోనూ అభ్యంతరాలు.. విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. ఏడాదిన్నర కిందట- ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల మీద సుప్రీంకోర్టు తీర్పు దరిమిలా జరిగిన అనుభవాలు, దేశవ్యాప్త నిరసనలతో ఇబ్బందుల్లో పడ్డ కేంద్రం... మళ్లీ అలాంటి స్థితి తలెత్తకుండా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఉద్యోగ నియామకాలు, పదోన్నతుల్లో

మిగతా 9వ పేజీలో...


'సున్నితమైన ఈ అంశాన్ని కాంగ్రెస్, ఇతర విపక్షాలు రాజకీయం చేస్తున్నాయి'
-రాజ్‌నాథ్ సింగ్



## అట్రాసిటీస్ చట్టం ఓకే

'నాన్ బెయిలబుల్'పైనే షరతులు!

ఎస్సీ, ఎస్టీ చట్టం రాజ్యాంగబద్ధమే

ప్రాథమిక సాక్ష్యాధారాలు కీలకం

అవి లేకపోతే 'నాన్ బెయిలబుల్' కాదు

దుర్వినియోగమైందని భావిస్తే కోర్టు కొట్టేయొచ్చు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధక చట్టాన్ని సవరిస్తూ పార్లమెంటు నిరుడు చేసిన చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో ముందస్తు బెయిల్ మంజూరుపై మాత్రం కొన్ని షరతులు విధించింది. దీని ప్రకారం.. 'ఒక ఫిర్యాదు

మిగతా 9వ పేజీలో...



10

# ఆడిట్ అయ్యాకే నిధులు

పోలవరంపై కేంద్రం స్పష్టీకరణ.. ఇప్పటికి 8614 కోట్లు

పీపీఏ, జలసంఘం సిఫారసుల మేరకు నిధులిస్తున్నాం

కాంట్రాక్టు నిర్వహణ సమస్య వల్లే నిర్మాణ జాప్యం: కేంద్రం




## 20న ఎంసెట్ నోటిఫికేషన్

3

26 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఏప్రిల్ 20-24 వరకు పరీక్షలు

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు

నేడు ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలు

9



పరంజ్యోతి

# పరిప్రశ్న



పూర్వం రైవతక పర్వత ప్రాంతంలో మహాసాత్వతమనే నగరంలో విద్యాపతి అనే పండితుడు ఉండేవాడు. అతనికి తెలియని విద్య లేదని అందరి నమ్మకం. అతని కుమారుడు కుతూహలుడు. పేరుకు తగినట్లు ఆ పిల్లవాడికి అన్నీ సందేహాలే. కనబడినవారినందరినీ.. 'అదేమిటి? ఇదేమిటి?' అని అడుగుతూ ఉండేవాడు. అతని స్వభావం అందరికీ నచ్చేది. తండ్రికీ ముద్దుగా ఉండేది. కానీ కాలం గడిచేకొద్దీ అతని ప్రశ్నలను తట్టుకోగలిగిన స్థితి ఎవరికీ లేకపోయింది. కుతూహలుణ్ణి చూసి అందరూ దూరం నుంచే తప్పుకోవడం మొదలు పెట్టారు. విద్యాపతి.. రాజుగారి ఆస్థానంలో పండితుడు కావడంవల్ల తన కుమారుని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వగలిగిన వెసులుబాటు లేక చిన్నతనంలోనే గురుకులంలో విద్యాభ్యాసానికి పంపాడు. చేరిన కొద్దిరోజులకే ఆ బాలుడి ప్రశ్నల ధాటికి గురువులు ఆశ్చర్యపోయారు. అతనిలో ఎంత వెతికినా ఏ లోపం లేదు.. ఒక్క ప్రశ్నలడగడం తప్ప. దీంతో వారు ఈ విషయాన్ని ఆశ్రమ కులపతి యుక్తినాథ మహర్షికి నివేదించారు. మహర్షి కుతూహలుణ్ని తన పర్ణశాలకు పిలిచి ఇలా చెప్పాడు. 'నాయనా! నీవడిగే ప్రశ్నలకు అన్నింటికీ సమాధానాలు వస్తున్నాయా?' అని అడిగాడు. 'లేదు గురువర్యా' అని అతడు నిరుత్సాహంగా చెప్పాడు. 'సరే మన ఆశ్రమానికి తూర్పు దిక్కున ఒక గవ్యూతి దూరంలో ఒక మందిరం ఉన్నది. ఆ మందిరంలో సరస్వతీ దేవి ఉన్నది. ఆమెను చప్పట్లు కొట్టి ప్రశ్నించు. నీకు సమాధానం వస్తుంది' అని చెప్పాడు గురువు. బాలుడు సరేనని అక్కడికి వెళ్లాడు. ఆలయంలోకి వెళ్లాక గట్టిగా చప్పట్లు కొట్టాడు. అటు నుంచి కూడా ఎవరో చప్పట్లు కొట్టారు. 'ఎవరు చప్పట్లు కొట్టారు?' అని అడిగాడు. అటు నుంచి కూడా అదే ప్రశ్న వినిపించింది. 'నాపేరు కుతూహలుడు. నేనే చప్పట్లు కొట్టాను' అన్నాడు. అటు నుంచి కూడా అదే సమాధానం వచ్చింది. 'ఓహో నాలాగే మరొక కుతూహలుడున్నాడు' అనుకున్నాడతడు. తరువాత ఎన్నో ప్రశ్నలు అడిగాడు. అటు నుంచి కూడా అవే ప్రశ్నలు. జీవితంలో మొదటిసారి ప్రశ్నలడగడం ఆపి సమాధానాల గురించి ఆలోచించడం మొదలు పెట్టాడు. ఆలోచించి సమాధానమివ్వడం ప్రారంభించాడు. అటు నుంచి కూడా అవే సమాధానాలు. కాసేపటికి ఉత్సాహంగా ఆశ్రమానికి వచ్చి మహర్షికి జరిగిందంతా వివరించాడు. ఇలా నెల రోజులు గడిచాయి. ఈ నెల రోజులలో ఆ కనబడని కుతూహలుడు అడిగే ప్రశ్నలకు సమాధానాలను చెప్పేందుకు.. తాను ఎన్నో విషయాలను తెలుసుకోవడానికి కష్టపడ్డాడా బాలుడు. ఆ తరువాత మహర్షి కుతూహలుణ్ని మందిరానికి వెళ్లమని చెప్పడం తగ్గించాడు. ఆ బాలుడూ ఆశ్రమంలో పనులకు అలవాటు పడ్డాడు. గురువుల దగ్గర నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. అతడికి ప్రశ్న విలువ తెలిసింది. ఇతరులను ప్రశ్నలడిగే ముందు తానుగా సమాధానాలను అన్వేషించాలని అర్థమైంది. లక్ష్య శుద్ధి ఏర్పడింది. తాను చిన్నతనంలో వెళ్లిన మందిరం కొండగుహలో ఉందని, తాను మాట్లాడిన మాటలే ప్రతిధ్వనించి ఎవరో మాట్లాడినట్టు తోచాయన్న విషయం తెలిసింది. యుక్తవయస్సు వచ్చేసరికి ఎన్నో విద్యలలో పండితుడయ్యాడు. ప్రయోజకుడయ్యాడు. ఇలా మనం కూడా ప్రశ్న విలువ తెలిసి మరీ ప్రశ్నిస్తే నిత్యజీవితంలోనూ, ఆధ్యాత్మికంగానూ విజయాన్ని సాధించగలుగుతాం.

- ఆచార్య రాణి సదాశివ మూర్తి



# స్కూటర్ ఢీకొని బస్సు దగ్ధం

▸▸ స్కూటరిస్టు అక్కడికక్కడే మృతి.. మరొకరి సజీవదహనం

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 10: కడప జిల్లా రైల్వేకోడూరు సమీపంలో సో మవారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సును స్కూ టర్ ఢీకొనడంతో మంటలు చెలరేగి బస్సు దగ్ధమైంది. అందులోని ఓ వ్యక్తి సజీవదహనమయ్యాడు. స్కూటరిస్టు అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం రాత్రి కడప ఆర్టీసీ డిపో నుంచి తిరుపతికి 23 మంది ప్రయాణికులతో నాన్‌స్టాప్ బస్సు బయలుదేరింది. బస్సు రైల్వేకోడూరు దాటి చింతగుంట వద్ద వెళుతుండగా ఎదురుగా ఓ స్కూటర్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో స్కూటర్ ట్యాంకర్ పేలడంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులను కిందకు దించేశాడు. ఓ వ్యక్తికి గుండెపోటు రావడంతో అగ్నికీలల్లో చిక్కుకుని సజీవదహనమయ్యాడు.

## లోకం తీరు




## ఉష్ణోగ్రతలు

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 09.0 | 29.2 |
| రాజమండ్రి | 18.0 | 29.0 |
| కడప | 20.0 | 34.1 |
| గుంటూరు | 21.2 | 25.9 |
| విశాఖపట్నం | 22.2 | 28.0 |
| నెల్లూరు | 23.3 | 31.5 |

## కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం: దక్షిణ ఒడిశా పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. బంగాళాఖాతం నుంచి తేమగాలులు, ఉత్తరాది నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో నెలకొన్న వాతావరణ అనిశ్చితితో కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల మేఘాలు ఆవరించాయి. కోస్తాలో పలుచోట్ల ఈదురుగాలులు, ఉరుములతో వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం వరకు రెండు సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో అక్కడక్కడా ఉరుములతో వర్షాలు కురుస్తాయి.

# అంతా.. మా ఇష్టం!

▸▸ ఏపీఎంఎస్ఐడీసీలో ఇష్టారాజ్యంగా పోస్టింగులు

▸▸ కొత్త పోస్టులు సృష్టిస్తున్న కార్పొరేషన్ అధికారులు

▸▸ ఎండీ అనుంగులకు అందలం.. నిబంధనలకు నీళ్లు

▸▸ మార్క్‌ఫెడ్‌లో రిటైర్డ్ ఉద్యోగికి రూ.95 వేలు జీతం

▸▸ అర్హత లేకపోయినా జీఎం పోస్టు.. కారు సౌకర్యం

▸▸ కార్పొరేషన్ చరిత్రలో తొలిసారి ఎక్విప్‌మెంట్‌కు ఈడీ

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు వేలకు వేలు జీతాలిస్తారు. అర్హత లేకపోయినా ప్రధాన పోస్టుల్లో కూర్చోపెడతారు. పోస్టులు లేకపోయినా నచ్చినవారి కోసం ప్రత్యేకంగా సృష్టిస్తారు. ప్రభుత్వంతో సంబంధం లేదు.. ప్రిన్సిపల్ సెక్రటరీ అనుమతి అవసరం లేదు. మా కార్పొరేషన్.. మా ఇష్టం అన్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) అధికారులు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పోస్టింగ్‌ల విషయంలో అధికారుల ఇష్టారాజ్యమైపోయింది. కార్పొరేషన్‌లో మేనేజింగ్ డైరెక్టర్ పోస్టు తప్ప మిగిలిన అన్నిటినీ పూర్తిగా మార్చేశారు. కొన్ని కీలకమైన పోస్టుల్లో అర్హతలేని వారిని కూర్చోపెట్టారు. కార్పొరేషన్‌లో మందులు కొనుగోలు అనేది కీలక అంశం. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రులకు కొరత లేకుండా నాణ్యమైన మందులు సరఫరా చేయాల్సిన బాధ్యత ఏపీఎంఎస్ఐడీసీదే. మందులు, సర్జికల్ ఐటమ్స్ కొనుగోలు, నాణ్యత పరిశీలన, సకాలంలో ఆస్పత్రులకు చేర్చడం వంటి విధులు కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్ (డ్రగ్స్) పరిధిలో ఉంటాయి. ఈ పోస్టుల్లో బీఫార్మ్, ఎండీ ఫార్మకాలజీ అర్హత కలిగిన వారిని నియమించాలి. కార్పొరేషన్ నిబంధనల ప్రకారం డ్రగ్స్ కంట్రోల్ విభాగంలో ఉన్న జాయింట్ డైరెక్టర్ కేడర్ అధికారిని జీఎంగా నియమించాలి. కానీ అధికారులు ఆ నిబంధనలేమీ పాటించకుండా అర్హత లేని వ్యక్తిని జనరల్ మేనేజర్‌గా నియమించారు. అదనంగా కారు, ఇతర సౌకర్యాలు కల్పించారు. మార్క్‌ఫెడ్‌లో రిటైర్ అయిన వ్యక్తిని కన్సల్టెంట్‌గా నియమించుకుని అత్యధికంగా రూ.95 వేల జీతం చెల్లిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవద్దని స్పష్టంగా చెప్పింది. ఒకవేళ తీసుకోవాల్సి వచ్చినా రూ.40 వేలకు మించి జీతం చెల్లించవద్దని పేర్కొంది. అవేమీ పట్టించుకోవడం లేదు. మరోవైపు టెండర్ డాక్యుమెంట్లలో ప్రైవేటు వ్యక్తులు, కాంట్రాక్టు ఉద్యోగులు, కన్సల్టెంట్ ఉద్యోగుల పేర్లను కానీ, వారి ఫోన్ నంబర్లు కానీ ఎక్కడా పొందుపరచకూడదు. కానీ జనరల్ మేనేజర్ పేర్లను, ఫోన్ నెంబర్లను టెండర్ డాక్యుమెంట్లలో పొందుపరుస్తున్నారు. దీని వెనుక భారీ అవకతవకలకు జరుగుతున్నట్టు సమాచారం.

### కొత్తగా మేనేజర్లు..

కార్పొరేషన్‌లో కొత్తగా మేనేజర్ పోస్టులను సృష్టించారు. మేనేజింగ్ కమిటీ అనుమతి లేకుండా ఎలాంటి నిర్ణయాలూ తీసుకోకూడదు. నిబంధనల ప్రకారం డ్రగ్స్ విభాగానికి ఒక్క జనరల్ మేనేజర్ మాత్రమే ఉంటారు. ఆయన కింద ఫార్మసిస్టులు వివిధ స్థాయిల్లో విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు మెచ్చి తెచ్చుకున్న వ్యక్తి కోసం గతంలో జనరల్ మేనేజర్ స్థాయిలో విధులు నిర్వహించిన వ్యక్తిని మేనేజర్‌ని చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇచ్చిన జీవోలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. జీవోలో జనరల్ మేనేజర్ అని ఉంటుంది. కానీ కార్పొరేషన్‌లో మాత్రం మేనేజర్‌గానే విధులు నిర్వహించాలి. మరోవైపు జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ (జేఎస్‌వో) స్థాయి ఉద్యోగిని జనరల్ మేనేజర్ చేయాలని భావించారు. ఇప్పటికే రాష్ట్రంలో జేఎస్‌వోల కొరత తీవ్రంగా ఉంది. ఇలాంటి కీలకమైన విభాగం నుంచి తీసుకొచ్చి అవసరంలేకున్నా మేనేజర్‌గా కొనసాగిస్తున్నారు.

### ఈడీ పోస్టునూ చీల్చారు..

కార్పొరేషన్‌లో మేనేజింగ్ డైరెక్టర్ పోస్టు తర్వాత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పోస్టు చాలా కీలకమైంది. ఈ పోస్టు కోసం అప్పట్లో పది మంది వరకూ పోటీ పడ్డారు. చివరగా వాణిజ్య పన్నుల విభాగానికి చెందిన వ్యక్తిని ప్రభుత్వం ఈడీగా నియమిస్తూ జీవో విడుదల చేసింది. ఈ జీవోను కూడా కాదని అధికారులు అతన్ని కొన్ని రోజులు పక్కన పెట్టారు. చివరికి కొన్ని రోజుల క్రితం ఈడీని ఎక్విప్‌మెంట్‌కు పరిమితం చేశారు. నిబంధనల ప్రకారం కార్పొరేషన్‌లో ఈడీ అడ్మినిస్ట్రేషన్, ఈడీ ఎక్విప్‌మెంట్ అని రెండు పోస్టుల్లేవు. కానీ కార్పొరేషన్ ఎండీ తనకు నచ్చిన వ్యక్తిని ఈడీగా కొనసాగించేందుకు ఒక పోస్టుని రెండు ముక్కలు చేశారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపించడంతో కార్పొరేషన్‌లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### మందగమనం ఉంటే కుర్తా, పైజామాలే వేసేవారు



ప్రజలు ప్యాంట్లు, జాకెట్లు కొనేస్తున్నారు. ఇక మందగమనం ఎక్కడ? అదే ఉంటే మనం ప్యాంట్లు, జాకెట్లు వేయకూడదు. కుర్తా, పైజామాలే వేసేవారు. మన దేశం గ్రామాల సమాహారం. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా మెట్రోలే కాదు.. 6.5 లక్షల గ్రామాలు ఉన్నాయి. బ్యాంకుల్లో డిపాజిట్లు ఎక్కువగా గ్రామస్తుల నుంచేనని నివేదికలు చెబుతున్నాయి.

- వీరేంద్రసింగ్, బీజేపీ ఎంపీ

### బురఖాను నిషేధించాలి



పలు దేశాలు బురఖాను నిషేధించాయి. శ్రీలంక, చైనా, అమెరికా, కెనడా తదితర దేశాల్లో ఎక్కడా బురఖా అనేదే కనపడదు. భద్రతా కారణాల రీత్యా దేశంలోనూ దానిని నిషేధించాలి. ఉగ్రవాదులు, దొంగలు, సంఘ వ్యతిరేక శక్తుల వల్ల బురఖా దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. ముక్కు, చెవులు కోల్పోయిన శూర్పణఖ అరబ్ దేశాలకు పారిపోయింది. కోసేసిన అవయవాలు కనిపించకూడదనే ఉద్దేశంతో శూర్పణఖ బురఖా ధరించింది.

- రఘురాజ్ సింగ్, యూపీ బీజేపీ నేత

### విమానాశ్రయాల్లో చేతులు కడుక్కుంటే వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట

బోస్టన్, ఫిబ్రవరి 10: విమాన ప్రయాణికులు విమానాశ్రయాల్లో చేతులను శుభ్రంగా కడుక్కుంటే వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట పడుతుందని అమెరికాలోని మసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ప్రపంచంలోని 10 అతిపెద్ద విమానాశ్రయాల్లో జరిపిన అధ్యయనంలో ఈవిషయం వెల్లడైందన్నారు. విమానం, విమానాశ్రయ లాంజీలోని కుర్చీలు, చెక్ ఇన్ కియోస్కులు, సెక్యూరిటీ చెక్‌పాయింట్ ట్రేలు, విశ్రాంతి గదుల తలుపులు, మరుగుదొడ్లలోని వాష్‌బేసిన్లు, నల్లాలను ప్రయాణికులు తాకిన సందర్భాల్లో వైరస్‌ల వ్యాప్తి జరిగే అవకాశాలు ఉంటాయన్నారు.

### చర్మ కేన్సర్‌ను గుర్తించే సరికొత్త పద్ధతి

మెల్‌బోర్న్, ఫిబ్రవరి 10: చర్మ కేన్సర్‌ను గుర్తించే సరికొత్త పద్ధతిని ఆస్ట్రేలియాలోని ఎడిత్ కోవాన్ వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. చర్మం లోపలి పొరల్లో ఉండే 'మెలానోసైట్' అనే వర్ణద్రవ్య కణాల కారణంగా కొంతమందికి మెలనోమా కేన్సర్ వస్తుంటుంది. దీని బారినపడిన వారిలో చర్మంలో పెద్ద పెద్ద కేన్సర్ వ్రణాలు ఏర్పడతాయి. అవి విచ్ఛిన్నమై వాటి నుంచి అతిసూక్ష్మమైన కేన్సర్ వ్రణ కణాలు(సీటీసీ) వెలువడి రక్తంలో కలిసిపోయి ప్రవహిస్తూ శరీరంలోని ఇతర భాగాల్లో కేన్సర్ వ్రణాలు ఏర్పడేందుకు కారణమవుతుంటాయి. తొలిసారిగా ఈ సూక్ష్మ కేన్సర్ వ్రణ కణాల ఆచూకీని గుర్తించేందుకు దోహదపడే పద్ధతిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, రక్తంలోని ఇతరత్రా కణాల విశ్లేషణ పరీక్షలతో సీటీసీల ఆనుపానులను పసిగట్టవచ్చన్నారు.



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు

## రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

▸▸ సచివాలయం వద్ద ఏపీజేఎంఏ ఆందోళన

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ అఫిలియేటెడ్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.గుండారెడ్డి డిమాండ్ చేశారు. సంఘం సభ్యులు సోమవారం అమరావతి సచివాలయం గేటు బయట బైఠాయించి ఆందోళన చేశారు. బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ కళాశాలల యజమానులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.

## మున్సిపల్ ఉపాధ్యాయుల ఆందోళనలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పట్టణ స్థానిక సంస్థల పాఠశాల ల ఉపాధ్యాయులకు కేంద్రీకృత సర్వీస్ నిబంధనలను వర్తింపజేయాలన్న యోచనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు సోమవారం కూడా కొనసాగాయి.

## బాబు మాజీ పీఎస్ ఇంట ముగిసిన ఐటీ దాడులు

మాజీ సీఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాసరావుపై ఐటీదాడులు సోమవారంతో ముగిశాయి. దాదాపు నాలుగురోజుల పాటు విజయవాడలోని ఆయన నివాస గృహంలో సోదాలు, విచారణ కొనసాగింది. ఈడీ కూడా ఈ దాడుల్లో పాలుపంచుకుంది.

## 5న 'ఫిషరీస్' సర్టిఫికెట్ల పరిశీలన

అమరావతి: అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ పోస్టులకు ప్రొవిజినల్‌గా ఎంపికైన 546 మంది అభ్యర్థులకు మార్చి 5న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని ఏపీపీఎస్సీ సెక్రెటరీ పి.ఎస్.ఆర్.ఆంజనేయులు తెలిపారు.

# కాళ్లు మొక్కుతా.. పింఛన్లు తొలగించకండి సార్!

▸▸ మున్సిపల్ కమిషనర్ కాళ్లపై పడిన ఎమ్మెల్యే

▸▸ పశ్చిమలో పింఛను, రేషన్ కార్డుల కోసం నిరసనలు



పాలకొల్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ పాదాలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల

ఏలూరు, కాకినాడ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పింఛన్లు, రేషన్ కార్డుల తొలగింపును నిరసిస్తూ పశ్చిమ గోదావరి జిల్లా అంతటా తెలుగుదేశం పార్టీ నిరసన వ్యక్తం చేసింది. పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు బాధితులందరితో కలిసి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ కాళ్లు మొక్కి మరీ పేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో అధికారులు సహా.. అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. పాలకొల్లు, చింతలపూడి, పోలవరం, గోపాలపురం, తణుకు, ఉంగుటూరు నియోజక వర్గాల పరిధిలోవున్న దాదాపు 13 మండలాల్లో మండల అధికారులకు టీడీపీ ఆ ధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా టీడీపీ ఆందోళనలు నిర్వహించింది. కాకినాడ సిటీ నియోజకవర్గంలో రద్దయిన పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ సో మవారం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్-2 రాజకుమారికి మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు వినతిపత్రం అందించారు. పెద్దాపురంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. నవరత్నాలు అమలుకు ఖజానాలో డబ్బులు లేనందునే పింఛన్లు, రేషన్‌కార్డులు రద్దు చేస్తున్నారని రాజప్ప ఆక్షేపించారు. విజయనగరం జిల్లా అంతటా టీడీపీ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. అన్ని మండల కార్యాలయాల వద్ద పేదలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పూసపాటి అదితి ఆధ్వర్యంలో విజయనగరంలో ర్యాలీ జరిగింది.

### పింఛన్లు తొలగించడం దుర్మార్గం: వర్ల

మంగళగిరి, ఫిబ్రవరి 10: నిరాదరణకు గురైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్లను తొలగించడం దుర్మార్గమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారంఆయన విలేకరులతో మాట్లాడారు. కోట్లకు పడగలెత్తిన ముఖ్యమంత్రి జగన్.. పేదల నోటికాడ కూడు లాగేయడం దుర్మార్గమన్నారు. పింఛన్ల తొలగింపుపై ఎవరిని ప్రశ్నించాలో తెలియక వృద్ధులు, దివ్యాంగులు మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్లు తొలగించిన వృద్ధులను చూసి ఓ మహిళా తహసీల్దారు.. తానేమీ చేయలేనంటూ కంటతడి పెట్టడం చూస్తుంటే ప్రభుత్వం పనితీరు అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో సుమారు ఏడు లక్షల పింఛన్లు అన్యాయంగా తొలగించారని, తక్షణమే వాటిని తిరిగి కొనసాగించాలని వర్ల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పింఛను ఆపారు.. ఊపిరి తీశారు!

▸▸ కర్నూలులో ఇద్దరు వృద్ధుల మృతి



చిన్న బతకమ్మ(ఫైల్)

గోనెగండ్ల/గూడూరు, ఫిబ్రవరి 10: ఏళ్లతరబడి వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు అందుతుండగా, వైసీపీ ప్రభుత్వం వచ్చి అకారణంగా వాటిని రద్దు చేసిందటూ బాధితులు గగ్గోలు పెడుతున్నారు. కొంతమంది మనస్తాపంతో గుండె ఆగి మరణిస్తున్నారు. తాజాగా.. కర్నూలు జిల్లాలో వృద్ధాప్య పింఛన్లను రద్దుచేశారన్న మనోవేదనతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడులో చిన్న బతకమ్మ(65) ఒంటరి మహిళ. కొన్నేళ్లుగా తన అక్క పెద్ద బతకమ్మ వద్ద ఉంటోంది. ఆమెకు పదేళ్లుగా పింఛన్ వస్తోంది. తాజాగా చిన్న బతకమ్మ(వితంతు పింఛన్), అక్క భర్త(బావ) బాబయ్య(చేనేత పింఛన్)కు ఒకే రేషన్‌కార్డు ఆధారంగా పింఛన్లు అందుతున్నట్లు అధికారులు గుర్తించి నిలిపి వేశారు. దీంతో తనకు ఉన్న ఆధారం పోయిందని చిన్న బతకమ్మ తీవ్ర మనోవేదనతో నాలుగు రోజులుగా భోజనం మానేసింది. సోమవారం అకస్మాత్తుగా మృతి చెందింది. ఈ విషయమై చిన్న బతకమ్మ అక్క కుమారుడు సుబాను, కోడలు కాజాబీ మాట్లాడుతూ.. రెండు నెలల క్రితం చిన్నబతకమ్మకు కాలు విరిగిందని, పింఛన్ డబ్బులతో మందులు తెచ్చుకునేదని తెలిపారు. ఈ నెల పింఛన్ ఇవ్వకపోవడంతో భోజనం కూడా మానేసిందన్నారు. అలాగే, కర్నూలు జిల్లా గూడూరు పంచాయతీ కాపవీధిలో మహాదేవమ్మ (82) అనే వృద్ధురాలు ప్రతి నెలా వచ్చే పింఛన్‌తో కాలం నెట్టుకొస్తోంది. మహాదేవమ్మ ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగస్థులు ఉన్నారని, దీని వల్ల పింఛన్ నిలిపివేసినట్లు వలంటీర్లు చెప్పారు. మహాదేవమ్మ మనుమరాలైన దివ్యాంగురాలు కావ్య (మూగ, చెవిటి) పింఛన్ కూడా నిలిచిపోయింది. దీంతో మహాదేవమ్మ తీవ్ర మనస్తాపంతో శనివారం తీవ్ర అస్వస్థతకు గురైంది. ఆమెను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, సోమవారం మృతి చెందినట్లు కుమారుడు రాఘవేంద్రాచారి తెలిపారు.

# రైతుకు సాంకేతిక దన్ను

(మొదటి పేజీ తరువాయి)

పంచడంతోపాటు ఆదాయం పెంపు, సుస్థిర వ్యవసాయ అభివృద్ధికి దోహదపడే అన్ని అంశాల్లోనూ శిక్షణ అందించనున్నాయి. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు, పశుసంవర్ధక శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ, పౌరసరఫరాల మంత్రి కొడాలి నానిల సమక్షంలో సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు కీలక ఒప్పందాలను చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ, "జూన్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 11,158 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. ఆయా కేంద్రాల్లో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖలకు సంబంధించిన సహాయకులను ఏర్పాటు చేస్తాం. వీరు రైతులకు ఆయా అంశాల్లో దిశానిర్దేశం చేస్తారు. తద్వారా రైతులు వ్యవసాయంలో మరింత పురోభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా ప్రముఖ సంస్థల సూచనలు, శిక్షణను కూడా రైతులకు అందించనున్నాం" అని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను కూడా అందుబాటులో ఉంచనున్నట్టు సీఎం తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో రైతు భరోసా కేంద్రాలు విప్లవానికి దోహదపడతాయన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ సంస్థల సహకారం వ్యవసాయ రంగానికి ఎంతో కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.

### ఆకాశమే హద్దుగా రైతుకు సాయం

ఏ సీజన్‌లో అయినా పంటలు వేసే ముందే కనీస మద్దతు ధరలు ప్రకటించనున్నట్టు సీఎం జగన్ తెలిపారు. దీనివల్ల మార్కెట్‌లో పోటీ ఏర్పడి మంచి ధర వస్తుందన్నారు. అప్పటికీ రైతుకు నష్టం వస్తే ప్రభుత్వమే రైతుభరోసా కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేస్తుందని సీఎం చెప్పారు. అన్నదాతకు సాయం చేయడంలో ఆకాశమే హద్దుగా ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ఇక, వ్యవసాయ మార్కెటింగ్ రంగంలోనూ కీలక సంస్థలతో భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. మంత్రి కన్నబాబు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో రైతు భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషించనున్నాయని చెప్పారు. కాగా, ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకునేందుకు వచ్చిన ఆయా సంస్థల ప్రతినిధులకు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న రైతు భరోసా కేంద్రాల గురించి అధికారులు వివరించారు. ప్రతినిధులు మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు మంచి నిర్ణయమని, దీనివల్ల రైతులకు క్షేత్రస్థాయిలో మేలు జరుగుతుందని కొనియాడారు.

### ఒప్పందాలు చేసుకున్న సంస్థలు ఇవే..

స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రి కల్చర్ రిసెర్చ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్‌మేనేజ్‌మెంట్, సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ పర్ డ్రైలాండ్ అగ్రికల్చర్, సెంట్రల్ ఫెర్టిలైజర్ క్వాలిటీ అండ్ ట్రైనింగ్ సెంటర్, నేషనల్ సీడ్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఇండియన్ వెటర్నరీ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్, సదరన్ రీజినల్ యానిమల్ డీసీజెస్ ఇనిస్టిట్యూట్, యానిమల్ హెల్త్ అండ్ వెటర్నరీ బయోలాజికల్, ఐసీఏఆర్-సీఏఎఫ్‌ఏ.

# భార్య, భర్త.. ఓ ప్రియురాలు

▸▸ వివాహేతర బంధం మిగిల్చిన విషాదం

అద్దంకి, ఫిబ్రవరి 10: వివాహేతర సంబం ధం పచ్చని కుటుంబంలో చిచ్చురేపి ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. గుండ్లకమ్మలోకి దూకిన ప్రియురాలిని రక్షించే ప్రయత్నంలో ప్రియుడు మృతి చెందాడు. ఈ ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం గురించి తెలిసి అతని భార్య పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పంగులూరు మండలం చందలూరుకు చెందిన గుంజి వేణు(45), ధనలక్ష్మి దంపతులు పదేళ్లుగా అద్దంకిలో నివాసం ఉంటున్నారు. వేణు ఆరేళ్ల క్రితం హైదరాబాద్ బేల్దారి పనులకు వెళ్లినప్పుడు అ క్కడ అద్దంకి మండలం నాగులపాడుకు చెందిన మల్లేశ్వరితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఆ తర్వాత వేణు హైదరాబాద్ నుంచి వచ్చేసినా ఈ సంబంధం కొనసాగుతూనే ఉం ది. మల్లేశ్వరి 3 రోజుల క్రితం అద్దంకి వచ్చి వే ణును కలిసి వెళ్లింది. ఆ విషయం ధనలక్ష్మికి తెలియడంతో కలహం మొ దలైంది. ఈ నేపథ్యంలో సోమవారం మల్లేశ్వరి కోసం వేణు నాయుడుపాలెం వెళ్లా డు. విషయం తెలుసుకున్న భార్య ధనలక్ష్మి పురుగుమందు తాగింది. స్థానికులు ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం త ప్పింది. బంధువులు వేణుకు ఫోన్‌చేసి విషయం చెప్పా రు. అతను మల్లీశ్వరిని బైక్‌పై ఎక్కించుకొని అద్దంకి బయల్దేరాడు. గుండ్లకమ్మ బ్రిడ్జి వద్దకు వచ్చిన తర్వాత ఇద్దరూ గొడవ పడినట్టు తెలుస్తోంది. దీంతో మల్లేశ్వరి బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మలోకి దూకింది. ఆమె కోసం వేణు కూడా దూకాడు. అటుగా వెళ్తున్న వ్యక్తి నది ఒడ్డు నుంచి తాడు విసిరాడు. మల్లేశ్వరి ఒడ్డుకు చేరుకోగా.. వేణు నదిలో పడి చనిపోయాడు.



డీఎస్పీకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భవాని

## స్పీకర్‌కు ఫిర్యాదిచ్చినా చర్యల్లేవు

- 2 నెలల క్రితం అసభ్యకరమైన కామెంట్లపై కంప్లైంట్
- దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): "సోషల్ మీడియాలో నాపై కొందరు అసభ్యకరంగా కామెంట్లు చేశారు. వారిపై చర్య తీసుకోమని అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసి రెండు నెలలైంది. ఇంతవరకు పట్టించుకోలేదు. దిశ చట్టంద్వారానైనా న్యాయం చేయండి" అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆమె టీడీపీ నేతలతో కలిసి దిశ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు అందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో మద్యం బ్రాండ్‌ల కుంభకోణంపై మాట్లాడిన సమయంలో తన గురించి సోషల్ మీడియాలో పలువురు అసభ్యకరంగా కామెంట్లు చేశారన్నారు. దీనిపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. చివరికి ఇక్కడ పోలీసులుకు ఫిర్యాదు చేస్తే దిశ చట్టం రాలేదని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారన్నారు. చట్టం రాకుండానే సీఎం జగన్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసి అబద్ధాలు ఆడుతున్నారన్నారు. జగన్ సోదరి షర్మిలారెడ్డి కూడా ఒకనొక సమయంలో సోషల్ మీడియాలో ఆమెపై వచ్చిన కామెంట్‌లకు బాధపడుతూ హైదరాబాద్‌లో ఫిర్యాదు చేసిన విషయాన్ని భవాని గుర్తు చేశారు. సీఎం జగన్ తన చెల్లెలితో పాటు మహిళలందరికీ న్యాయం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, పెందుర్తి వెంకటేశ్, వేగుళ్ల జోగేశ్వర రావు, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విశాఖలోనే 2021 డైరీ ఆవిష్కరణ: అనిల్

విజయవాడ, అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): "2021లో డైరీని వైజాగ్‌లో ఆవిష్కరించుకుందాం. విశాఖలో ఏర్పాటు చేయబోయే కేంద్ర కార్యాలయంలోనే అన్ని విభాగాలు ఉండేలా చర్యలు తీసుకుంటాం" అని మంత్రి అనిల్‌కుమార్ అన్నారు. జలవనరుల శాఖ ఉద్యోగుల సంక్షేమ సంఘం ముద్రించిన 2020 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం విజయవాడలోని రైతు శిక్షణ కేంద్రంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అనిల్ మాట్లాడారు. ఉభయ గోదావరి, కృష్ణా, నెల్లూరు జిల్లాల్లో ఉన్న కార్యాలయాలు మాత్రం ఆయా ప్రాంతాల్లోనే కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలో త్వరలో 6 వేల లస్కర్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి బండి శ్రీనివాసరావు, ఈఎన్‌సీలు కె.శ్రీనివాసరావు, సి.నారాయణరెడ్డి, ఇరిగేషన్ ఉద్యోగ సంఘాల రాష్ట్ర కార్యదర్శి శేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

### బంధువులకు కాంట్రాక్టు రాలేదని అక్కసు

"పోలవరం సాగు నీటి పనులు నిలిచిపోయాయంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. తమ బంధువులకు కాంట్రాక్టు పనులు దక్కలేదన్న అక్కసుతోనే తప్పుడు ప్రచారానికి ఒడిగట్టారు" అని మంత్రి అనిల్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం సాగు నీటి ప్రాజెక్టుకు రివర్స్ టెండరింగ్‌కు వెళ్లడం ద్వారా రూ.850 కోట్లు మిగిల్చామన్నారు. నిర్ణీత సమయానికి పోలవరం సాగు నీటి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.

## రివర్స్ గేర్‌లో రాష్ట్రం : కన్నా

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రివర్స్‌గేర్‌లో వెళ్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. కరెంట్ చార్జీల పెంపు అంశంపై సోమవారం ట్విటర్ వేదికగా ఆయన స్పందించారు. మొన్న ఆర్టీసీ చార్జీలు, నిన్న పెట్రో చార్జీలు, ఈ రోజు కరెంట్ చార్జీలు పెంచిన ఏపీ ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ వ్యతిరేకిస్తోందన్నారు. మధ్య తరగతి వారికి ఈ నిర్ణయం పెనుభారం అవుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థికస్థితిని ఎలా మెరుగుపరచాలో తెలియక తుగ్లక్ పన్నులతో ప్రజల నడ్డి విరుస్తోందన్నారు.

## తిరుమలలో నకిలీ టిక్కెట్ల కలకలం

తిరుమల, ఫిబ్రవరి 10: తిరుమలలో మరోమారు నకిలీ టికెట్ల వ్యవహారం కలకలం రేపింది. 18 అభిషేకం, 10 సుప్రభాతం నకిలీ టికెట్లను విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గతేడాది డిసెంబరు నెలలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి తిరుమల టూ టౌన్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. చెన్నైకి చెందిన రవినారాయణన్ అనే భక్తుడు శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల కోసం బెంగుళూరుకు చెందిన భరత్ అనే వ్యక్తి ద్వారా రాహుల్ అనే దళారీని సంప్రతించాడు. రాహుల్ రూ.73 వేల నగదు ఆన్‌లైన్ ద్వారా తీసుకుని డిసెంబరు 13వ తేదీకి 18 అభిషేకం టికెట్లు, 2020 జనవరి 13వ తేదీకి 10 సుప్రభాత సేవాటికెట్లను వారికి విక్రయించాడు. అవన్నీ పాత టికెట్లపై వివరాలు మార్పుచేసి సృష్టించిన నకిలీ టికెట్లే. ఆ విషయం తెలియని భక్తులు 18 అభిషేకం టికెట్లతో డిసెంబరు 13న వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. అయితే విజిలెన్స్ అధికారుల పరిశీలనలో అవి నకిలీ టికెట్లుగా తేలాయి. దీంతో రవినారాయణన్‌ను విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా జరిగిన విషయాన్ని వివరించాడు. అవి నకిలీ టికెట్లని తెలుసుకుని తనకు దళారీ అంటగట్టిన సుప్రభాత సేవాటికెట్లను కూడా విజిలెన్స్ అధికారులకు అందజేసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీనిపై విజిలెన్స్ అధికారుల నివేదిక మేరకు ఫిబ్రవరి 5వ తేదీన టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. త్వరలోనే ఆ ముఠాను పట్టుకుంటామన్నారు.

## రైతు ఆత్మహత్య

గోనెగండ్ల, ఫిబ్రవరి 10: అప్పుల బాధకు మరో రైతు బలయ్యాడు. కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం పెద్దనూలటూరుకు చెందిన గొల్ల రామాంజినేయులు(50)కు 1.40 ఎకరాలు భూమి ఉంది. మూడేళ్లుగా పత్తి, వేరుశనగ, మొక్కజొన్న సాగు చేశాడు. పంటలు సరిగా పండక, గిట్టుబాటు ధర లభించకపోవడంలో అప్పులు చేయాల్సి వచ్చింది. ఆరు బోర్లు వేయించినా చుక్కనీరు పడలేదు. రూ.3లక్షల అప్పుతీర్చే మార్గం కనిపించక ఆదివారం రాత్రి పురుగుల మందు తాగాడు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

## జెన్‌కో భూములు ధారాదత్తం

- పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 101 ఎకరాలు బదలాయింపు
- విశాఖ,నెల్లూరులో మంజూరు
- వాటిని తనఖాపెట్టి రుణాలు తీసుకొనేందుకు సంస్థకు వీలు
- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జెన్‌కోకు సంబంధించిన భూములను ఆంధ్రప్రదేశ్ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు (ఏపీపీఎఫ్‌సీఎల్) ధారాదత్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. విద్యుత్ రంగంలో అవసరమైన నిధుల సమీకరణ కోసమంటూ కొత్తగా ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. దానికి ఎలాంటి కేటాయింపులు లేకపోవడంతో ట్రాన్స్‌కో, జెన్‌కోలకు సంబంధించిన ఆస్తులపైనే కార్పొరేషన్ ఆధారపడాల్సి వస్తోంది. దీంతో విశాఖ, నెల్లూరుల్లోని 101.31 ఎకరాల జెన్‌కో భూమిని కార్పొరేషన్‌కు బుక్ వాల్యూ ప్రకారం ఇవ్వాలని నిర్దేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు (జీవో నం. 39) జారీచేసింది. ఇందులో విశాఖలో 66.43 ఎకరాలు, నెల్లూరులో 34.8 ఎకరాలను కేటాయించింది. ఆ భూములను తనఖా పెట్టి మార్కెట్‌లో కార్పొరేషన్.. రుణాలు తీసుకోవచ్చు. అయితే, జెన్‌కో భూములను బదలాయించడం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారుతోంది.

# వర్సిటీలకు ఐఐటీల దెబ్బ!

### ఇంజనీరింగ్ కాలేజీల్లో భర్తీకాని 750 సీట్లు

- సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లోనూ ఇదే పరిస్థితి
- సీటొచ్చినా.. చేరని బెస్ట్ ర్యాంకర్లు
- ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లోకి జంప్
- వర్సిటీలకు రిపోర్టు కూడా చేయని వైనం
- అవకాశం కోల్పోతున్న సెకండ్ గ్రేడ్ విద్యార్థులు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో సీటొస్తే అదృష్టంగా భావిస్తుంటారు. కౌన్సెలింగ్‌లో సీటు కేటాయించగానే విద్యార్థులు ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా అడ్మిషన్ తీసుకుంటారు. అయితే, ఇదంతా గతం! ఇప్పుడు పరిస్థితి మారింది. అది వర్సిటీ సీటైనా సరే తమకు నచ్చకుంటే అడ్మిషన్ తీసుకోవడం లేదు. 2019-20 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు, అడ్మిషన్ల తీరును పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. సెల్ఫ్ ఫైనాన్స్‌తో కలిపి రాష్ట్రంలో 24 వర్సిటీ కాలేజీల్లో 6,022 సీట్లు ఉండగా.. 5,272 సీట్లు భర్తీ అయ్యాయి. తుది దశ అడ్మిషన్ల కౌన్సెలింగ్ అనంతరం మరో 750 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రతిష్ఠాత్మకమైన ఆంధ్రా వర్సిటీ(విశాఖ)లో 17 సీట్లు, యోగి వేమన(ప్రొద్దుటూరు) వర్సిటీలో 115 సీట్లు, జేఎన్‌టీయూ-కలికిరిలో 41 సీట్లు , జేఎన్‌టీయూ-నరసరావుపేటలో 37 సీట్లు భర్తీకి నోచుకోలేదు. అంతేకాదు అన్ని వర్సిటీలు, వాటి నిర్వహణలోని కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఎంసెట్-2019 అడ్మిషన్ల తొలిదశ కౌన్సెలింగ్‌లో అభ్యర్థులకు 100% సీట్లు కేటాయించారు. అంతవరకు బాగానే ఉంది. కానీ, వర్సిటీ కాలేజీల్లో సీటొచ్చినా ఎంసెట్ ర్యాంకర్లు అక్కడ అడ్మిషన్ తీసుకోలేదని తేలింది. మెరిట్ విద్యార్థులకే సాధారణంగా వర్సిటీ కాలేజీల్లో సీట్లు వస్తాయి. మరి సీటొచ్చిన వారందరూ అడ్మిషన్ తీసుకోకపోవడానికి కారణం ఏమిటనేది ఆసక్తిగా మారింది. మరోపక్క, వీరి కారణంగా సెకండ్ గ్రేడ్ విద్యార్థులు నష్టపోతున్నారు.




### వాటి కోసం వీటిని వదిలి!

రాష్ట్ర వర్సిటీల్లో సీటొచ్చిన విద్యార్థుల్లో సింహభాగం జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌కు హాజరై ర్యాంకులు సాధించడంతో పాటు ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, కేంద్రప్రభుత్వ నిధులతో నడుస్తున్న ప్రముఖ విద్యాసంస్థల్లో చేరుతున్నారు. రాష్ట్రంలో జూన్-ఆగస్టు నెలల్లో ఇంజనీరింగ్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ఎంసెట్‌లో బెస్ట్ ర్యాంకర్లకు తొలిదశలోనే వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీటు అలాట్ అవుతుంది. ఎంసెట్ అడ్మిషన్లు పూర్తయిన తర్వాత.. జేఈఈ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తుండడం వల్ల.. వర్సిటీ కాలేజీల్లో సీటొచ్చినా చేరకుండా ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీల్లో ఎక్కడ సీటొచ్చినా అడ్మిషన్ తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో చేరేకన్నా.. జాతీయ స్థాయి కాలేజీల్లో అడ్మిషన్ తీసుకోడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

**ప్రైవేట్ కాలేజీల్లో పరిస్థితి ఇదీ**

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో పరిస్థితి ఎలా ఉందంటే.. ఎంసెట్-2019 తొలిదశ కౌన్సెలింగ్‌పరిశీలిస్తే.. సీటొచ్చినా దాదాపు 10 వేల మంది అభ్యర్థులు సంబంధిత కాలేజీల్లో కనీసం జాయినింగ్ రిపోర్టు ఇచ్చేందుకు కూడా ఇష్టపడలేదు. అభ్యర్థులు అందరూ కూడా తాము వెబ్‌లో ఆప్షన్ ఇచ్చుకున్న కాలేజీ, బ్రాంచ్‌లో సీట్ అలాట్ అయిన వారే కావడం గమనార్హం. అయినా సరే తమ ప్రాధామ్యాల్లో కాలేజీ, సీటు రాలేదంటూ వారు అడ్మిషన్ తీసుకునేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీటొచ్చిన వారిలో.. కొందరు ఆ కాలేజీలో వద్దని, మరి కొందరు ఆ బ్రాంచ్‌లో ఇష్టం లేదని కారణాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. రెండో విడతలో ఎంసెట్(ఇంజనీరింగ్)కు సంబంధించి కన్వీనర్ కోటాలో మొత్తం 1,01,585 సీట్లు ఉన్నాయి. ఎంసెట్-2019లో మొత్తం 1,32,983 మంది అర్హత సాధించారు. వెబ్ కౌన్సెలింగ్‌లో 60,637 మందికి సీట్లు కేటాయించారు. రాష్ట్రంలో 30 ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో పాటు బీ.ఫార్మసీ బ్రాంచ్, ఫార్మా-డీ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

### వర్సిటీలకు, విద్యార్థులకూ నష్టమే!

వర్సిటీ కాలేజీల్లో సీట్లన్నీ సాధారణంగా హాట్‌కేకుల్లా భర్తీ అవుతుంటాయి. అయితే, జాతీయ విద్యా సంస్థల్లో సీటు రావడం వల్ల ఇక్కడి వర్సిటీల్లో సీట్లు ఖాళీ అవుతున్నాయి. ఫలితంగా వర్సిటీలో సీట్లు కోరుకునే విద్యార్థులకు, అటు వర్సిటీలకు కూడా నష్టమే జరుగుతోందని అంటున్నారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకర్లకు ఏడు ఫేజ్‌లలో దాదాపు సెప్టెంబరు-అక్టోబరు వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో మాత్రం జూన్-జులై నెలల్లోనే కౌన్సెలింగ్ పూర్తిచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల ఇక్కడి వర్సిటీల్లో సీటు అలాట్ అయిన వారిలో అడ్మిషన్ తీసుకోకుండా.. జాతీయ సంస్థల్లో చేరిన విషయాన్ని రిపోర్టు చేయడం లేదు. ఎంతో డిమాండ్ ఉన్న వర్సిటీ సీట్లు భర్తీ కాకపోవడానికి కారణాలు ఎలా ఉన్నప్పటికీ.. ఇదంతా ఫస్టియర్ అడ్మిషన్లలోనే జరుగుతోందని, సెకండియర్‌లో ఆయా ఖాళీలన్నీ లేటరల్ ఎంట్రీ అభ్యర్థులతో భర్తీ అవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

## రిజర్వేషన్లపై సుప్రీంతీర్పు సరికాదు

**15, 16 తేదీల్లో నిరసనలు : శైలజానాథ్**

అమరావతి, గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగ పదోన్నతుల్లో రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తున్నామని పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ చెప్పారు. సోమవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదోన్నతులపై రిజర్వేషన్లు ప్రాథమిక హక్కు కాదని, వాటి అమలు కేవలం రాష్ట్రాల విచక్షణ మేరకు ఉంటుందని పేర్కొనడం శోచనీయమన్నారు. ఈ తీర్పును నిరసిస్తూ ఈ నెల 15, 16 తేదీల్లో విజయవాడలో కాంగ్రెస్ కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. సుప్రీం తీర్పు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు, లక్ష్యాలకు, స్ఫూర్తికి కూడా విరుద్ధమన్నారు.

### లోక్‌సభను స్తంభింపచేయాలి

సీఎం జగన్‌కు దమ్ము, ధైర్యం ఉంటే ప్రత్యేక హోదా కోసం వైసీపీ ఎంపీలతో లోక్‌సభను స్తంభింపచేయాలని శైలజానాథ్ డిమాండ్ చేశారు. గుంటూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ బీజేపీకి ఏజెంట్‌గా పనిచేస్తున్నారన్నారు. గత ఎన్నికల వరకు ప్రత్యేక హోదా నినాదం చేసిన జగన్.. సీఎం అయ్యాక మాట తప్పారని విమర్శించారు.

## 20న ఎంసెట్ నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎంసెట్-2020 షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదలతో ప్రక్రియ మొదలు కానుంది. ఈ నెల 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. మార్చి 27 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. రూ.500 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 4 వరకు, రూ.1000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 9 వరకు, రూ. 5000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏప్రిల్ 16 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రూ.10,000 ఆలస్య రుసుంతో ఏప్రిల్ 19 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పించారు. ఎంసెట్-ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్ష ఏప్రిల్ 20, 21, 22, 23 తేదీల్లో జరగనుంది. ఎంసెట్-అగ్రికల్చర్ స్ట్రీమ్ పరీక్ష ఏప్రిల్ 23-24 తేదీల్లో జరగనుంది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్.. ఈ రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 22-23 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఎం సెట్ ఆయా తేదీల్లో రోజుకు రెండు సెషన్లలో జరుగుతుంది. సోమవారం జరిగిన ఎంసెట్-సెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి, ఎంసెట్- 2020 కమిటీ చైర్మన్ రామలింగరాజు, ఎంసెట్-2020 కమిటీ కన్వీనర్ వి.రవీంద్ర పాల్గొన్నారు. ఎంసెట్ రాయదలచుకున్న అభ్యర్థులు ఒక స్ట్రీమ్‌కు అయితే రూ.500, రెండు స్ట్రీమ్‌లకు అయితే రూ.1000 ఫీజు చెల్లించవలసి ఉంటుంది. ఈ సారి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు కానుంది. 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తిస్తుంది.

## సీఎం రమేష్ తనయుని రిసెప్షన్‌కు రాష్ట్రపతి

- లోక్‌సభ స్పీకర్, కేంద్ర మంత్రులు, ఎంపీలు కూడా హాజరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ తనయుడు రిత్విక్ వివాహానంతర వేడుక (రిసెప్షన్) సోమవారం రాత్రి ఢిల్లీలోని తాజ్ పేలస్, దర్బార్ హాలులో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర మహిళ, శిశుసంక్షేమశాఖ మంత్రి స్మృతి ఇరానీ, ఇంధనశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌లతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణతో పాటు పలువురు రాష్ట్రానికి చెందిన ఎంపీలు కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.

**శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి వారి దేవస్థానము, కసాపురము (గ్రా), అనంతపురము జిల్లా**

... 10-02-2020 ...

... 01.04.2020 నుండి 31.03.2021 ... 01.04.2020 నుండి 30.09.2020 ...

... 25.02.2020 ... రూ. 5.000/- ... 22.02.2020 ... 26.02.2020 ... https://tender.apeprocurement.gov.in ... 9491000655, 9573395339, 9441052069 ...






# తప్పుడు నిర్ణయం

కశ్మీర్‌లో కాలు ఎలా వెనక్కుతీసుకోవాలో కేంద్రానికి తెలియడం లేదు. ఆర్నెల్లు గృహనిర్బంధంలో ఉంచిన మాజీ ముఖ్యమంత్రులు మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లాల మీద మోదీ ప్రభుత్వం ఇప్పుడు రెండేళ్ళ వరకూ నిర్బంధంలో ఉంచగలిగే ప్రజాభద్రతాచట్టాన్ని ప్రయోగించింది. నైతికంగానూ, చట్టపరంగానే కాదు, రాజకీయంగా కూడా ఇది తప్పుడు నిర్ణయం. ఒమర్ తండ్రి ఫారూఖ్ అబ్దుల్లా ఇప్పటికే ఇదే చట్ట ప్రకారం నిర్బంధంలో ఉన్నారు. ఈ చర్యలు ప్రజాభద్రతకు కాక, ఢిల్లీ పాలకుల రాజకీయ భద్రతకోసమని ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. ఇక, ఈ చట్ట ప్రయోగానికి వీలుగా వారెంత ప్రమాదకారులో తెలియచెబుతూ పోలీసులు ముందుకు తెచ్చిన వాదనలు మరింత విచిత్రంగా ఉన్నాయి.

ఒమర్ అబ్దుల్లా కశ్మీర్ ప్రజలను తన మాటకారి తనంతో ప్రభావితం చేసి ఉద్యమాలు సృష్టించగలరనీ, భారత్‌కు వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టగలరని అభియోగ పత్రంలో పోలీసులు ఆరోపించారు. కశ్మీర్‌లో ఉగ్రవాదం పతాకస్థాయిలో ఉన్నకాలంలో ఎన్నికలు బహిష్కరించాలంటూ ఉగ్రవాద సంస్థలు, వేర్పాటువాదులు పిలుపునిచ్చినా, ఒమర్ ప్రజలను ప్రోత్సహించి పెద్ద ఎత్తున ఓటింగ్ జరిగేట్టు చేసిన విషయాన్ని ఆయన సమర్థతకు నిదర్శనంగా పోలీసులు చెప్పుకొచ్చారు. 2008లో ఎన్నికల బహిష్కరణకు వేర్పాటువాదులు పిలుపునిస్తే, ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులు, ముఖ్యంగా ఒమర్ పూనుకొని ప్రజలను ఓటువైపు మళ్ళించిన కారణంగా ఓటింగ్ మరో 20శాతం పెరిగింది. ఈ ఎన్నికలు ఉగ్రవాద, వేర్పాటువాదాలకు చెంపపెట్టు అని దేశమంతా ప్రశంసించింది. ఇప్పుడు ఆ ఎన్నికలనే సాకుగా తీసుకొని, అప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి అయిన ఒమర్ పైనే ఈ వింత వాదనతో కేసు పెట్టడం అందరినీ ఆశ్చర్యపరుస్తున్నది. ప్రతి ఎన్నికప్పుడు, పోలింగ్ పెరిగినప్పుడు కశ్మీర్ భారత్ అంతర్భాగంగా కొనసాగాలని కశ్మీరీలు బలంగా కోరుతున్నారని కేంద్రం చెబుతూండేది. కానీ, ఇప్పటి ప్రభుత్వం ఓట్లు వేయించడాన్ని కూడా తప్పుబడుతున్నది. ఒమర్ అబ్దుల్లాతో పాటు ప్రజాభద్రతాచట్టం కింద అరెస్టయిన ఆయన పార్టీ కార్యదర్శి, మాజీ న్యాయ మంత్రి అలీ మహ్మద్ సాగర్ మీద కూడా పోలీసులు ఇదే రీతిన అభియోగాలు మోపారు. ప్రజలను పోలింగ్‌కు మళ్లించిన ఆయన సమర్థతనే తప్పుబట్టారు.

మెహబూబా ముఫ్తీ ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా మాట్లాడారనీ, కశ్మీర్‌ను భారత్ అన్యాయంగా ఆక్రమించుకుందన్నారనీ, నిషేధిత జమాతే ఇస్లామియాకు అనుకూలంగా మాట్లాడారనీ పోలీసుల అభియోగం. ప్రజాభద్రతాచట్టం ప్రయోగానికి సిద్ధపడినప్పుడు పోలీసులు ఇటువంటివి ఎన్నయినా తవ్వితీయవచ్చును. 370 రద్దుకు వ్యతిరేకంగా మాట్లాడం కూడా నేరమేనని అనవచ్చును. కానీ, ఈ సందర్భంగా 13వ శతాబ్దంలో కశ్మీర్‌ను పరిపాలించిన 'కోట రాణి'తో పోలీసులు మెహబూబాను పోల్చారు. ఆమె మాదిరిగానే ఈమె శత్రువులకు విషం పెడుతూ, కుట్రలూ కుయుక్తులతో అధికారం కోసం తపించిపోతూంటుందని వారి వాదన. పోలీసుల ఇతరత్రా వాదనలు అటుంచితే, తండ్రిచాటు బిడ్డ, కోటరాణి వంటి మాటలు బీజేపీతో పొత్తు నేపథ్యంలో ఆమెకు అతికినట్టే ఉన్నాయి. తండ్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ అడుగుజాడల్లో నడిచి బీజేపీతో మైత్రిని కొనసాగించడంతో జమ్మూకశ్మీర్‌లో కమలం కాలూనేందుకు మరింత వీలు కలిగింది. అనంతరం ఆమె పార్టీతో వ్యూహాత్మకంగా తెగదెంపులు చేసుకొని ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడానికీ అవకాశం దక్కింది.

తండ్రిచాటు బిడ్డలా ఉండటం, ప్రజలను ఓటు వేసేందుకు ప్రోత్సహించడం భారత్‌లో ఎప్పటినుంచి దేశద్రోహమైపోయాయి? అని ప్రియాంకా గాంధీ ప్రశ్నిస్తున్నారు. ఇంతకాలం కశ్మీర్‌ను గుప్పిట్లో పెట్టుకున్న అబ్దుల్లాలు, ముఫ్తీలమీద ఎన్ని విమర్శలైనా ఉండవచ్చు. కానీ, పాక్ ప్రేరేపిత ఉగ్రవాద మూకలు, వేర్పాటువాదులు ఆ రాష్ట్రాన్ని కల్లోలకాసారంగా మార్చేసినకాలంలో వారు భారత్ పక్షాన అక్కడ నిలబడ్డారు. కశ్మీరీలంతా ఢిల్లీమీద ఆగ్రహంతో రోడ్లమీదకు వచ్చినప్పుడల్లా వారిపక్షాన వాదిస్తున్నట్టు కనిపిస్తూనే వేర్పాటువాదుల బలం పెరగకుండా కాపుకాశారు. వారు తమ రాజకీయ ప్రయోజనాలకోసమే ఇదంతా చేసి ఉండవచ్చును కానీ, భారత్ తరపున నిలబడినందుకు, దాని రాజ్యాంగాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ నమ్మినందుకు వీరికి తగిన శాస్తి జరిగిందని భారత వ్యతిరేకులు ఆనందించేట్టుగా వ్యవహరించడం సరికాదు. కేంద్రప్రభుత్వం వరుస తప్పటడుగులతో కశ్మీర్‌ను మరింత దూరం చేసుకుంటున్నట్టు కనిపిస్తున్నది.

## మూడో కన్ను




సజిత్ కుమార్

పార్లమెంట్ లో సభ్యులు ప్రస్తావించే అంశాలపై వివరణ ఇచ్చేందుకు ఒక ప్రధానమంత్రి ఇంత విస్తృతంగా, లోతుగా అధ్యయనం చేసి రావడం అరుదైన విషయం. ఉభయ సభల్లోనూ నరేంద్ర మోదీ ఒకే రోజు వేర్వేరుగా చేసిన సుదీర్ఘ ప్రసంగాల్లో చరిత్ర పుటల్లో దాచేస్తే దాగని సత్యాల్ని వెలికి తీశారు. ఆయన గుప్పించిన ప్రశ్నలకు ప్రతిపక్షాలు జవాబు చెప్పలేకపోయాయి.

# చరిత్ర విప్పిన చరిత్ర నిర్మాత

సత్యకాలమ్



■ వై. సత్యకుమార్

భారతీయ జనతా పార్టీ మతతత్వ పార్టీ అని. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ఇద్దరూ మతతత్వ వాదులని ప్రతిపక్షాలు ఉధృతంగా చేస్తున్న ప్రచారం దేశంలో జరుగుతున్న ఒక రాజకీయ కుట్రను బహిర్గతం చేస్తోంది. బిజెపి, ఆ పార్టీ నేతలను మతతత్వ వాదులుగా, మైనారిటీ వర్గాలకు వ్యతిరేకులుగా చిత్రించి సామాన్య ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రతిపక్షాలు కలిసికట్టుగా తీవ్రయత్నం చేస్తున్నాయి. కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ స్థాయిలో లేవనెత్తేందుకు పాకిస్థాన్ చేసిన అన్ని ప్రయత్నాలు విఫలం కావడంతో ఆ దేశ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలే ప్రపంచ దేశాల దృష్టిలో భారత స్థాయి ఏమిటో అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తాయి. భారత దేశ ఆర్థిక స్థాయి మూలంగానే ప్రపంచ దేశాలు కశ్మీర్ విషయంలో కలుగచేసుకోలేకపోతున్నాయని ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ అనంతరం విలేఖరుల సమావేశంలో ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా భారత్ అత్యంత ప్రాధాన్యత గల దేశమని, భారత దేశాన్ని 1.2 బిలియన్ ప్రజలు ఉన్న మార్కెట్‌గానే పరిగణిస్తాయని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. కశ్మీర్ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ప్రపంచ దేశాలనుంచి ఎలాంటి ఒత్తిడీ లేదని ఆయన వాపోయారు. విచిత్రమేమంటే మన దేశంలో ప్రతిపక్షాలకు కూడా వాస్తవాలు తెలిసినప్పటికీ అవి బిజెపిని ఒకే మూసలో పరిమితం చేసి ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా పౌరసత్వ చట్టం చేసిన తర్వాత ప్రతిపక్షాలకు ప్రజలను మభ్య పెట్టేందుకు అవకాశం దొరికింది. షాహీన్ బాగ్ వంటి చోట్ల నిరసన ప్రదర్శనలను రోజుల తరబడి నిర్వహించడం ద్వారా అవి ఈ దేశంలో మైనారిటీలు అభద్రతా భావంలో ఉన్నారని ప్రపంచానికి సంకేతాలు పంపేందుకు ప్రయత్నించాయి. అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ షాహీన్ బాగ్‌ను ప్రతిపక్షాల ప్రయోగంగా అభివర్ణించారు. ఇప్పటివరకూ అన్ని ప్రయోగాలు విఫలమై చతికిల పడ్డ తర్వాత ప్రతిపక్షాలు ఈ ప్రయోగాన్ని చేపట్టాయి. ప్రతిపక్షాల ఈ ప్రయోగం వృథా ప్రయాస అని రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు స్పందిస్తూ ప్రధాని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలోనూ, ఆ తర్వాత జరిగిన చరిత్రను వివరిస్తూ ఎవరు మతతత్వ వాదులు అని ఆయన వేసిన ప్రశ్న ప్రతిపక్షాలు లేవనెత్తిన అన్ని వాదనలను పటాపంచలు చేశాయి. స్వాతంత్ర్యం తర్వాత పాకిస్థాన్‌లో ఉండిపోయిన హిందువుల్లో అత్యధికులు దళితులని, అక్కడ అణిచివేతకు గురైన దళితులను భారత దేశానికి రమ్మని చెప్పదలుచుకున్నానని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అన్న మాటల్ని ప్రధాని ఉటంకించారు. అంబేద్కర్ మతతత్వ వాదా? అని ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్ నుంచి సరిహద్దు దాటి భారత దేశంలో తమ జీవితాలను, పరువును కాపాడుకునేందుకు ప్రవేశించిన ముస్లిమేతరులకు పూర్తి పరిరక్షణ కల్పిస్తామని 1947లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం ఆమోదించిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. కాంగ్రెస్ మతతత్వ పార్టీయా? కేవలం ముస్లిమేతరులకే పరిరక్షణ కల్పిస్తామని కాంగ్రెస్ ఎందుకు తీర్మానించింది? అన్ని మతాల వారినీ రమ్మని ఎందుకు చెప్పలేదు? అని ఆయన నిలదీశారు. పాకిస్థాన్‌లో ఉన్న హిందువుల పట్ల జరిగే దారుణాలను భారత దేశం పట్టించుకోవాలని ప్రముఖ సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియా అన్న విషయాన్ని మోదీ ప్రస్తావించారు.



లాల్ బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఉండగా, పాకిస్థాన్‌లో జరుగుతున్న మైనారిటీల మావన హక్కుల ఉల్లంఘనను ప్రస్తావిస్తూ వారు వలస వచ్చేందుకు ఆంక్షల్ని సడలించాలని పార్లమెంట్ 1964లో చేసిన తీర్మానాన్ని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. పాకిస్థాన్ ఇస్లామిక్ రాజ్యమని, అక్కడ ముస్లిమేతరులు జీవించలేరని శాస్త్రి రాజ్యసభలో ప్రసంగించారని ఆయన చెప్పారు. పాకిస్థాన్‌లో మైనారిటీలను పరిరక్షించే విషయంలో భారత్ తొలి ప్రధాని పండిట్ నెహ్రూ కూడా సానుకూలత వ్యక్తం చేశారని, నెహ్రూకు, పాక్ తొలి ప్రధాని లియాఖత్ అలీఖాన్ మధ్య మైనారిటీల పరిరక్షణ విషయంలో ఒప్పందం కుదిరిందని ఆయన తెలిపారు. హిందూ శరణార్థులకూ, ముస్లిం వలసవాదులకూ మధ్య వ్యత్యాసాన్ని గమనించాలని అస్సాం తొలి ముఖ్యమంత్రికి నెహ్రూ రాసిన లేఖను ఆయన ఉటంకించారు. పాకిస్థాన్‌లో బాధలకు గురై భారత దేశానికి వచ్చిన వారికి పౌరసత్వం పొందే హక్కు ఉన్నదని 1950లో నెహ్రూ పార్లమెంట్‌లో చేసిన ప్రకటనను కూడా ఆయన వెలికి తీశారు. లాల్‌బహదూర్ శాస్త్రి, రామ్ మనోహర్ లోహియా, జవహర్ లాల్ నెహ్రూ మతతత్వ వాదులా? నెహ్రూ హిందూరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనుకున్నారా? ఆలోచనాశీలి, గొప్ప మేధావి, లౌకిక వాది అయిన పండిట్ నెహ్రూ 'కేవలం మైనారిటీలు' అన్న పదం ఎందుకు వాడారు? అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. పాకిసన్‌లోనే స్థిరపడిన ఏఐసిసి సభ్యుడు భూపేందర్ కుమార్ దత్తా, పాక్‌లో తొలి న్యాయశాఖ మంత్రి అయిన జోగేంద్ర నాథ్ మండల్, అక్కడి పాలకులు మైనారిటీల పట్ల అనుసరిస్తున్న వైఖరిని తట్టుకోలేక భారత్ కు వచ్చి ఇక్కడ భరత మాత ఒడిలో కన్నుమూశారని నరేంద్రమోదీ సభ్యులను కదిలించే విధంగా వివరించారు. పార్లమెంటులో సభ్యులు లేవనెత్తిన అంశాలకు జవాబు చెప్పేందుకు ఒక ప్రధానమంత్రి ఇంత లోతుగా పరిశోధన చేసి రావడం అరుదైన విషయం. ఉభయ సభల్లోనూ నరేంద్ర మోదీ ఒకే రోజు వేర్వేరుగా చేసిన సుదీర్ఘ ప్రసంగాల్లో చరిత్ర పుటల్లో దాచేస్తే దాగని సత్యాల్ని వెలికి తీశారు. ఆయన గుప్పించిన ప్రశ్నలకు జవాబు చెప్పేందుకు ప్రతిపక్షాలకు ఎలాంటి ఆస్కారం లేకుండా పోయింది. డిసెంబర్ లో జరిగిన శీతాకాల సమావేశాల్లో తాము ఎందుకు పౌరసత్వ చట్టాన్ని చేయవలిసి వచ్చిందో ప్రధాని సుదీర్ఘంగా వివరించిన తర్వాత బిజెపిని మతతత్వ పార్టీ అని ఆరోపించేందుకు ఎవరికీ అవకాశం లేదు. కాని నిజాలు తెలిసినప్పటికీ దుష్ప్రచారాలకు లంకించుకోవడం ప్రతిపక్షాలకు సహజ నైజంగా మారిపోయింది.

ప్రభుత్వ విధానాలను వివరించే రాష్ట్రపతి ప్రసంగంపై రెండు రోజుల పాటు చర్చ జరిగినప్పటికీ ఏ ఒక్క ప్రతిపక్ష నేతా స్ఫూర్తిదాయకంగా మాట్లాడలేకపోయారు. సరికదా ప్రధానమంత్రి, హోంమంత్రిపై వ్యక్తిగత దాడులు చేయడానికే ఆ చర్చను ఉపయోగించుకున్నారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగించిన తర్వాత ఆయనకు సాటిరాగల నేత సమీప భవిష్యత్‌లో ప్రభుత్వాధినేత అయ్యే అవకాశాలు లేవని మరోసారి తేటతెల్లమైంది. మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీకి, ప్రతిపక్షాలకూ మధ్య ఎంత సుదీర్ఘ వ్యత్యాసం ఉన్నదో స్పష్టమైంది. రాహుల్, ఆయన వందిమాగధులు, వారికి వంతపాడుతున్న కొన్ని ప్రాంతీయ పార్టీల నేతలు తమ అక్కసును వెలిబుచ్చడం మినహా ఏమీ చేయలేని దుస్థితిలో ఉన్నారని పార్లమెంట్ సమావేశాలు స్పష్టం చేశాయి.

అన్నిటికన్నా ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పొందిన తర్వాత పార్టీ అధ్యక్షుడుగా తన బాధ్యతలు నిర్వర్తించలేక పలాయనం చిత్తగించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లోక్‌సభలో మాట్లాడేందుకు ఎలాంటి ధైర్యం లేకపోయింది. అయితే పార్లమెంట్ వెలుపల ఒక ర్యాలీలో మాట్లాడుతూ యువకులు మరో ఆరునెలల్లో ప్రధాని వీపుపై కర్రలతో కొడతారంటూ వ్యాఖ్యానించారు. గత ఎన్నికల సందర్భంగా 'చౌకీదార్ చోర్ హై' అంటూ ప్రధానిని దొంగగా అభివర్ణించిన రాహుల్‌కు ప్రజల చేతుల్లో పరాభవం ఎదురై, తన స్వంత నియోజకవర్గం అమేథిలో ఓడిపోయిన తర్వాత కూడా తన తప్పేమిటో ఇంకా గుర్తుకు రాకపోవడం ఆశ్చర్యకరం. ఒక దేశ ప్రదానిని ఎలా గౌరవించాలో తెలియని నేతను కాంగ్రెస్ కార్యకర్తలు ఇంకా నెత్తిన పెట్టుకుని ఊరేగడం ఆ పార్టీలో ఉన్న భావదారిద్ర్యాన్ని తెలియజేస్తోంది. ఇలాంటి బలహీనమైన నేతలు మోదీని విమర్శించడమంటే సూర్యుడిపై ఉమ్మేయడమే అని తెలుసుకోవాలి.

*(బిజెపి జాతీయ కార్యదర్శి)*

భరతవాక్యం



■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

# కరోనా ఆర్థిక పాఠాలు

ప్రజల ఆరోగ్యాలూ దేశాల ఆర్థిక వ్యవస్థలూ కరోనా మహమ్మారి కల్లోలంలో చిక్కుకుంటున్నాయి. చైనాలో పలు ఆర్థిక కార్యకలాపాలు స్తంభించిపోయాయి. ఎయిర్‌బస్ కంపెనీ విమానాల తయారీని తాత్కాలికంగా నిలిపివేసింది. మొబైల్ ఫోన్స్ ఉత్పత్తికి ఫాక్స్ కోన్ ప్రస్తుతానికి స్వస్తి చెప్పింది. చైనీస్ షేర్ మార్కెట్లు పతనమయ్యాయి. చైనా ఈ పతనం, గ్లోబల్ షేర్ మార్కెట్లను కుదిపివేస్తోంది. చైనాకు విదేశీ పర్యాటకుల రాక పూర్తిగా తగ్గిపోయింది. చైనా ప్రజలు తమ విదేశీ ప్రయాణాలను విరమించుకున్నారు.

మన ఆర్థిక వ్యవస్థపై కూడా కరోనా కల్లోలం తాకిడి తీవ్రమవుతోంది. మన ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు ముడి రసాయనాలు, ఆటోమొబైల్ కంపెనీలకు విడిభాగాలతో సహా మన దిగుమతులలో 14 శాతం చైనా నుంచే జరుగుతున్నాయి. వజ్రాలు, చేపలు, సుగంధద్రవ్యాలు, రబ్బర్‌తో సహా మన ఎగుమతులలో ఐదు శాతం చైనాకు వెళుతున్నాయి. దిగుమతులు నిలిచిపోవడం, ఎగుమతులు కృశించిపోవడంతో మన ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నది.

అంతర్జాతీయ వాణిజ్యంతో ఏకీకృతమైన ఆర్థిక రంగాలనే కరోనా మహమ్మారి కల్లోల పరుస్తుండడం గమనార్హమైన విషయం. వివిధ వాహనాల విడి భాగాలను మనమే ఉత్పత్తి చేసుకొంటున్నట్టయితే మన ఆటోమొబైల్ పరిశ్రమలు కరోనా సంక్షోభంలో చిక్కుకునేవి కావు. ఆటోల విడిభాగాలను చౌకగా సమకూర్చుకోవాలనే ఆరాటం వల్లే వాటి అంతర్జాతీయ వాణిజ్యంలో మనం భాగస్వాములమయ్యాము. నిజానికి దేశీయ ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నప్పటికీ ఆ ప్రపంచ వాణిజ్యంలో మనం చాలా విస్తృత స్థాయి భాగస్వాములమయ్యాము. ఉత్పత్తి వ్యయాలను స్వల్పస్థాయిలో తగ్గించుకునే ప్రయత్నంలో పెను సంక్షోభం బారిన పడ్డాము. ఈ వాస్తవం దృష్ట్యా, అంతర్జాతీయ వాణిజ్యంతో విస్తృత ఏకీకరణపై పునరాలోచన చేయవలసిన అవసరం ఎంతైనా వున్నది. కరోనా కల్లోలం ఈ పునరాలోచనను అనివార్యం చేసింది.

మన ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ప్రాతిపదిక అయిన రైతు ఆర్థిక కార్యలాపాలను పరిశీలనలోకి తీసుకుందాం. తన ఆర్థిక కార్యకలాపాలను పట్టణ వాణిజ్య రంగంతో ఏ మేరకు ఏకీకృతం చేయాలనే విషయాన్ని రైతు స్వయంగా నిర్ణయించుకోవలసి వుంటుంది. అతను తన వ్యవసాయ పనులకు ఒక ట్రాక్టర్‌ను బాడుగకు తెచ్చుకుంటాడు. ట్రాక్టర్ ఆపరేటర్‌ను దినసరి వేతనంపై నియమించుకుంటాడు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేస్తాడు. బోర్ వెల్ మరమ్మతులకు మెకానిక్‌ను పిలుస్తాడు. ఈ పంట దినుసులు, సేవలు అన్నీ పట్టణం నుంచే సమకూర్చుకుంటాడు. పట్టణంలో ఇవన్నీ చౌకగా లభిస్తాయి గనుక రైతు పంట పెట్టుబడులు స్వల్ప స్థాయిలో వుంటాయి. అయితే తన వ్యవసాయానికి అవసరమైన పంట దినుసులు, సేవలకు పూర్తిగా పట్టణ మార్కెట్ పై ఆధారపడడం వల్ల తీవ్ర సమస్యలు తప్పక ఎదురవుతాయి. పట్టణం నుంచి పల్లెకు వచ్చే రోడ్లు పాడయిపోయినప్పుడు, పట్టణంలో రాజకీయ, సామాజిక ఆందోళనలు ప్రజ్వరిల్లినప్పుడు, మరీ ముఖ్యంగా అంటు వ్యాధులు ప్రబలిపోయినప్పుడు రైతుకు అవసరమైన సేవలు సకాలంలో అంత సులభంగా లభించవు. అటువంటి పరిస్థితుల్లో రైతు నష్టపోవలసివస్తుంది. క్రిమి సంహారక మందులు సకాలంలో అందుబాటులో లేకపోవడం వల్ల పంట దెబ్బ తినడం ఖాయం. సహజసిద్ధమైన క్రిమిసంహారక మందులపై ఆధారపడితే అతనికి నష్టం సంభవించే అవకాశముండదు. మరింత స్పష్టంగా చెప్పాలంటే రైతు తన



ఒక నిర్దిష్ట స్థాయిని దాటి అంతర్జాతీయ వాణిజ్యంతో మన ఆర్థిక వ్యవస్థను ఏకీకృతం చేయకూడదు. ప్రయోజనాలు అధికంగా సమకూరి, చిక్కులు తక్కువగా సంభవించే విధంగా మాత్రమే ప్రపంచ వాణిజ్యంలో మనం భాగస్వాములమవ్వాలి. ప్రజల ఆరోగ్యాలను, దేశ ఆర్థికాన్ని కల్లోల పరుస్తున్న కరోనా మహమ్మారి ఈ వాస్తవాన్నే స్పష్టం చేస్తున్నది.

వ్యవసాయ పనులకు పట్టణ మార్కెట్‌పై ఆధారపడడం రెండు పరస్పర విరుద్ధ ప్రభావాలకు కారణమవుతున్నది.

సేద్య కార్యకలాపాలను పట్టణ మార్కెట్‌తో ఏకీకృతం చేయడం వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గిపోతున్నది. అయితే అదే సమయంలో తీవ్ర చిక్కులు కూడా విధిగా ఏర్పడుతున్నాయి. ఈ రెండు పరస్పర విరుద్ధ ప్రభావాల మధ్య ఒక 'అభిలషణీయ' స్థాయిలో మాత్రమే సమన్వయాన్ని విధిగా నెలకొల్పుకోవాలి. ఆ సమన్వయం అసాధ్య విషయమేమీ కాదు. పట్టణం నుంచి తీసుకువచ్చే హైబ్రిడ్ విత్తనాలతో చాలా ప్రయోజనాలు వున్నాయి. పల్లెలో వాటికి ప్రత్యామ్నాయం లభించదు. హైబ్రిడ్ విత్తనాలతో సమస్యలు కూడా తక్కువగా వుంటాయి. కాగా శ్రామిక సేవలను పట్టణం నుంచే సమకూర్చుకోవడం వల్ల చెప్పుకోదగిన లబ్ధి సమకూరదు. పెద్ద నష్టం కూడా సంభవించవచ్చు. పట్టణం నుంచి వచ్చిన శ్రామికులు పండుగలు, పబ్బాలకు విధిగా పట్టణానికి పోతారు. పని నష్టం జరుగుతుంది. ఈ వాస్తవాల దృష్ట్యా పట్టణ వాణిజ్య వ్యవస్థపై ఆధారపడడం వల్ల చేకూరే లాభాలు, నష్టాలను రైతు నిరంతరమూ అంచనా వేసుకొంటూ తగు నిర్ణయాలు తీసుకోవలసివుంటుంది. ప్రయోజనాలు అధికంగానూ, చిక్కులు తక్కువగాను వుండే విధంగా మాత్రమే పట్టణ మార్కెట్‌పై ఆధారపడడమే రైతుకు మేలు చేస్తుంది.

రైతు మాదిరిగానే దేశ ఆర్థిక వ్యవస్థ కూడా ఒక అభిలషణీయ స్థాయిలో మాత్రమే అంతర్జాతీయ వాణిజ్యంతో ఏకీకృతమవ్వాలి. ఉదాహరణకు ఫాస్ఫేట్ ఎరువులు, అధునాతన సాంకేతికతలను దిగుమతి చేసుకోవడం వల్ల ప్రయోజనాలు అధికంగాను, చిక్కులు తక్కువగాను వుంటాయి. ఆటో విడి భాగాలు లాంటి వస్తువులను కూడా దిగుమతి చేసుకోవడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ అనవసర సమస్యల పాలు కావలసివస్తుంది. కరోనా కల్లోలంతో ప్రస్తుతం మన ఆర్థిక వ్యవస్థకు ఇటువంటి చిక్కులే ఏర్పడుతున్నాయి. వివిధ వాహనాలకు అవసరమైన విడి భాగాలను మనం మన దేశంలోనే ఉత్పత్తి చేసుకోగల సామర్థ్యం మనకు సంపూర్ణంగా వున్నది. అయితే వాటిని చౌకగా దిగుమతి చేసుకోవడానికి ఆరాటపడుతుండడం వల్లే ఇప్పుడు మన ఆర్థిక వ్యవస్థ కరోనా మహమ్మారి మూలంగా ఆపదలో పడ్డది. చెప్పవచ్చినదేమిటంటే ఒక నిర్దిష్ట స్థాయిని దాటి అంతర్జాతీయ వాణిజ్యంతో మన ఆర్థిక వ్యవస్థను ఏకీకృతం చేయకూడదు. ఈ ఆర్థిక వాస్తవాన్ని గుర్తించి, పాటించకపోవడం వల్లే మనం భారీగా నష్ట పోతున్నాం. బహుళజాతి కంపెనీల పరిస్థితి ప్రాథమికంగా భిన్నమైనది. మనం ఎదుర్కొనే సమస్యలు వాటికి ఎదురయ్యే అవకాశం లేదు. అంతర్జాతీయ వాణిజ్యంతో ఎంత గరిష్ఠ స్థాయిలో ఏకీకృతమయితే అంత గరిష్ఠంగా అవి ప్రయోజనం పొందుతాయి. ప్రత్యామ్నాయాలు అపారంగా లభించడమే అందుకు కారణం. ఉదాహరణకు ఫాక్స్ కోన్ యాపిల్ మొబైల్ ఫోన్స్‌ను మలేసియా, చెక్ రిపబ్లిక్, దక్షిణ కొరియా, సింగపూర్, ఫిలిప్పీన్స్ ఫ్యాక్టరీలలో ఉత్పత్తి చేస్తుంది. కరోనా మహమ్మారి చైనాలో విజృంభించింది. దీనివల్ల కొరియా, సింగపూర్‌లో ఉత్పత్తికి ఆటంకమేర్పడినా చెక్ రిపబ్లిక్‌లో ఉత్పత్తిని పెంచుతుంది. భారతీయ ఆటోమొబైల్ పారిశ్రామిక వేత్తకు ఇటువంటి ప్రత్యామ్నాయాలు లేవు. ఫ్యాక్టరీలను విధిగా వేరే ప్రాంతాలకు తరలించవలసివుంటుంది. దీనివల్ల మన ఆర్థిక వ్యవస్థకు చాలా పెద్ద నష్టం సంభవిస్తుంది. ఈ వాస్తవాన్ని దృష్టిలో వుంచుకొని మన ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ వాణిజ్యంతో ఏకీకృతం చేసేందుకు ఒక అభిలషణీయ స్థాయిని గుర్తించి, ఆ స్థాయికే ఏకీకరణను పరిమితం చేయాలి. ఇందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టాలి.

*(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగుళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)*

# అమరావతే నవ్యాంధ్ర అభ్యుదయం

నవ్యాంధ్ర రాజధానిగా అమరావతి నిర్మాణానికే లక్ష కోట్లు ఖర్చు చేస్తే వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి మాటేంటన్న అసంబద్ధ వాదనతో ప్రజల మధ్య విభజన తీసుకొచ్చే కుటిల రాజకీయ నీతికి ప్రభుత్వమే పాల్పడుతున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని ఎక్కడన్న అంశాన్ని తేల్చకుండానే ఉమ్మడి రాష్ట్రాన్ని కేంద్రం విభజన చేసింది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 6ను అనుసరించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాజధాని అంశంపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించమని శివరామకృష్ణన్ కమిటీని నియమించింది. రాజధాని ఎక్కడ అన్న అంశంపై ఆ కమిటీ నిర్దిష్టమైన సిఫార్సు చేయలేదు.



ఈ పూర్వరంగంలో అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ రాష్ట్ర శాసన సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ కూడా ఆమోదించాయి. రాష్ట్ర నడిబొడ్డులో అమరావతి ఉండడం వల్ల అన్ని ప్రాంతాల ప్రజలు స్థూలంగా సంతృప్తి వ్యక్తం చేశారు. గడచిన మూడు నాలుగేళ్ళుగా అక్కడ నిర్మితమైన కొన్ని భవనాల నుండే పాలన సాగుతున్నది. మరికొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో లేని వివాదాన్ని సృష్టించి, రాష్ట్ర విభజనతోనే తల్లడిల్లిపోతున్న రాష్ట్రాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టడం ఏ మాత్రం రాజకీయ విజ్ఞత అనిపించుకోదు. రాష్ట్ర రాజధాని వ్యవస్థ(రాజభవన్, సచివాలయం, చట్ట సభలు, ముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయాలు వగైరా రాష్ట్ర పరిపాలనా యంత్రాంగాలు ) అమరావతి కేంద్రంలోనే ఉండాలి. చారిత్రక ప్రాధాన్యత కలిగిన 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడికకు అనుగుణంగా కర్నూలులో హైకోర్టును నెలకొల్పాలన్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దల ఆలోచన సముచితం. దాన్ని అమలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నది.

రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతీయ అభివృద్ధి మండళ్ళను చట్టబద్ధంగా నెలకొల్పి, వార్షిక బడ్జెట్లలో నిధులు కేటాయించి, స్వయం ప్రతిపత్తితో అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించుకొని అమలు చేసే స్వేచ్ఛ కల్పించాలి. 73, 74 రాజ్యాంగ సవరణల మేరకు స్థానిక సంస్థలకు విధులు, నిధులు, బాధ్యతలను పూర్తి స్థాయిలో బదిలీ చేసి, స్థానిక ప్రభుత్వాల వ్యవస్థను బలోపేతం చేయాలి. నూతనంగా నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థను సమర్థంగా స్థానిక పరిపాలనా వ్యవస్థలో అంతర్భాగం చేయాలి.

ఈ నేపథ్యంలో ప్రజల మధ్య ఐక్యతను పరిరక్షించుకొంటూ, వివాదరహితంగా సమస్యలను పరిష్కరించుకొంటూ, వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణతో, సమతుల్యమైన, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అంకితభావం, చిత్తశుద్ధి, రాజకీయ సంకల్పంతో ప్రభుత్వం, రాజకీయ వ్యవస్థ పట్టుదలతో కృషి చేయాలి. పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరచిన అంశాల అమలుతో పాటు రాజ్యసభ వేదికగా నాటి ప్రధాన మంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రత్యేక హోదాను సాధించుకొని అభివృద్ధి చెందడానికి కృషి సల్పాలి. విభజన చట్టం షెడ్యూల్ 9లోని 89 సంస్థలు, షెడ్యూల్ 10లోని 107 సంస్థలకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య నలుగుతున్న విభజన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ఆ సంస్థలను రాష్ట్రంలోని 13 జిల్లాలలో నెలకొల్పాలి.

విభజన చట్టం, సెక్షన్ 85(2)లో పొందుపరచబడిన మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నెలకొల్పాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డును కర్నూలులో నెలకొల్పాలి.

పునర్విభజన చట్టంలో పొందుపరచిన మేరకు రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి పథకాన్ని రు. 25,000 కోట్లతో అమలు చేయాలి. ఈ అభివృద్ధి పథకాన్ని ప్రాంతీయ అభివృద్ధి మండళ్ళ ద్వారా అమలు చేయాలి.పారిశ్రామికాభివృద్ధికి 100% జి.ఎస్.టి., ఆదాయపు పన్ను రాయితీలు ఇచ్చి వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో ప్రభుత్వ, ప్రయివేటు రంగాలలో పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలి. కడప ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా నెలకొల్పాలి. ఎన్.టి.పి.సి., బి.హెచ్.ఇ.ఎల్. సంస్థలు సంయుక్తంగా చిత్తూరు జిల్లా మన్నవరం వద్ద విద్యుత్తు పరికరాల పరిశ్రమ నిర్మాణాన్ని కొనసాగించాలి. పునర్విభజన చట్టంలో పొందుపరచిన విశాఖ–చెన్నై(వయా శ్రీకాళహస్తి, శ్రీసిటీ) పారిశ్రామిక కారిడార్, కర్నూలు అనంతపురం బెంగుళూరు, బెంగుళూరు–చిత్తూరు– చెన్నయ్ పారిశ్రామిక కారిడార్లను కేంద్ర ప్రభుత్వం సహకారంతో అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి కల్పన, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి రాజకీయ సంకల్పంతో కృషి చేయాలి. ప్రకాశం జిల్లాలో రామాయపట్నం ఓడ రేవును నిర్మించాలి. కేంద్రం ఆమోదించిన రైల్వే జోన్‌ను విశాఖపట్నంలో త్వరితగతిన నెలకొల్పాలి. రాష్ట్రానికి గర్వకారణమైన విశాఖ మహానగరాన్ని మరింత శక్తిమంతమైన, పటిష్ఠమైన ఆర్థిక, పారిశ్రామిక మహానగరంగా అభివృద్ధి చేసి హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు, తదితర అభివృద్ధి చెందిన మహానగరాల సరసన చేరే విధంగా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి. రాయలసీమ నాలుగు జిల్లాలకు రాజధాని అమరావతితో మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనలో భాగంగా జాతీయ రహదారులను, రైల్వే మార్గాల నిర్మాణాన్ని సత్వరం చేపట్టాలి.

పరిపాలన అభివృద్ధి వికేంద్రీకరణ ముసుగులో రాజధాని వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలన్న దుష్ట ఆలోచనకు తక్షణం స్వస్తి చెప్పాలి. కులాలు, ప్రాంతాల మధ్య అగాధం, విద్వేషాలు పెంచే కుటిల రాజకీయాలకు, దుష్ట ఆలోచనలకు అడ్డుకట్ట పడకపోతే రాష్ట్ర భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన విశాఖపట్నం మహానగరానికి రాష్ట్ర రాజధానిని తరలించడంలో ఔచిత్యం ఏమిటో విజ్ఞతతో ఆలోచించాలి.

రాజధాని ఒక అవిచ్ఛన్న వ్యవస్థ. ఆ వ్యవస్థ (రాజభవన్, సచివాలయం, చట్ట సభలు, ముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయాలు మొదలైన రాష్ట్ర పరిపాలనా యంత్రాంగాలు ) నెలవుగా అమరావతే సబబైనది. ఈ వాస్తవాన్ని విజ్ఞతతో అర్థం చేసుకొని కులాలు, ప్రాంతాల మధ్య అగాధాలు, విద్వేషాలకు తావిచ్చే కుటిల రాజకీయాలకు స్వస్తి చెప్పాలి. లేని పక్షంలో నవ్యాంధ్రప్రదేశ్ భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది.

● టి. లక్ష్మీనారాయణ
సామాజిక, రాజకీయ విశ్లేషకులు



## వజ్రకరూరు వైఢూర్యం

కమ్యూనిస్టు విప్లవయోధుడు తరిమెల నాగిరెడ్డి. భారత విప్లవ రాజకీయరంగంలో 35 సంవత్సరాలకుపైగా వెలుగొంది మనసా వాచా కర్మణా నిజమైన విప్లవకారుడుగా అనేక ఉత్తమ లక్షణాలతో ప్రజల హృదయాలలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారు. నాగిరెడ్డి పుట్టి (ఫిబ్రవరి11, 1917) వంద సంవత్సరాలు దాటిపోయినా, చనిపోయి (జూలై 28, 1976) 44 సంవత్సరాలు అవుతున్నా ఆయన స్మృతి కమ్యూనిస్టు విప్లవకారులను నిరంతరం విప్లవ కర్తవ్యోన్ముఖులను చేస్తూనే వున్నది. నాగి రెడ్డి చక్కని వక్త. తన కంచుకంఠంలో పండిత పామరులను ఉర్రూతలూగించి విప్లవ రాజకీయాలను దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయన సభలకు జనం తండోపతండాలుగా హాజరయ్యేవారు. 1928లో తన 11ఏండ్ల చిరుప్రాయంలో అడయార్‌లోని దివ్యజ్ఞాన ఉన్నత పాఠశాలలో లాలా లజపతి రాయ్ సంస్మరణసభలో నాగిరెడ్డి తన మొట్టమొదటి ఉపన్యాసం ఇచ్చారు. 1932–33లో బెనారస్ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల జాతీయ భావాలకు వ్యతిరేకంగా స్నాతకోత్సవంలో మాట్లాడిన ఆనాటి ఢిల్లీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సర్ మార్జ్ గ్రోవర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులతో ఆయన చేయించిన ఆందోళన చరిత్రాత్మకమైనది. 1939లో బెనారస్ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘానికి ఆయన అధ్యక్షునిగా ఎన్నికైనారు. దేవులపల్లి వెంకటేశ్వరరావుతో కలసి సరైన విప్లవపంథాను రూపొందించడంలో నాగిరెడ్డి చారిత్రాత్మకమైన ప్రాతను నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆయన పాలకుల తీవ్ర నిర్బంధానికి గురైనారు. జైలులో వున్నప్పుడు 'తాకట్టులో భారతదేశం' అనే గొప్ప గ్రంథాన్ని రచించి దేశంలో సాగుతున్న విదేశీదోపిడీ తీరు తెన్నులను గణాంకాలతో అత్యంత ప్రతిభావంతంగా నాగిరెడ్డి వివరించారు. ఈ పుస్తకంలో ఆయన చేసిన నిర్ధారణలు నేటికీ అక్షర సత్యాలే. తరిమెల నాగిరెడ్డి 'వజ్రకరూరు వైఢూర్యం' అని మహాకవి శ్రీశ్రీ కీర్తించారు.

– సి. భాస్కర్
యుసిసిఆర్ఐ(యం-యల్)
(నేడు తరిమెల నాగిరెడ్డి జయంతి)



**కాలేజీ ఫీజు కోసం వెయిట్రెస్ ఉద్యోగం...**
**అవకాశాల వేటలో గ్యారేజీలో నివాసం..**
**కల నిజమై అగ్రపథంలో నిలిచాక**
**ఆరేళ్ళ విరామం...**
**పునఃప్రవేశం తరువాత మళ్లీ సంచలనం...**
**ఒకప్పుడు రొమ్ము క్యాన్సర్‌పై పోరాటం...**
**ఈ ఏడాది ఉత్తమ నటిగా ఆస్కార్ అవార్డు**
**పొందిన రెనీ జెల్‌వెగర్ జీవితంలో**
**ఇలాంటి మలుపులు ఎన్నెన్నో...**

# ద రియల్ విన్నర్

రెనీ పుట్టింది స్థితిపరుల కుటుంబంలోనే. ఆమె తండ్రి ఇంజనీర్. కానీ ఆమె కాలేజీలో చదువుతున్నప్పుడు ఆయన ఉద్యోగం పోయింది. ఫీజులు కట్టే పరిస్థితి లేకపోవడంతో నగ్న నాట్యాలు సాగే ఒక స్ట్రిప్ క్లబ్‌లో వెయిట్రెస్‌గా రెనీ పని చేయాల్సి వచ్చింది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం కటీ నగరంలో ఆమె బాల్యం, చదువూ సాగాయి. క్రీడలన్నా, నటన అన్నా రెనీకి చాలా ఇష్టం. అదే ఆమెను సినీ రంగం వైపు నడిపించింది. మొదట టెక్సాస్‌లో చిన్న చిన్న పాత్రలు చేశారు. విద్యార్థినిగా ఉన్నప్పుడు ఒక సినిమాలో రెండు డైలాగుల వేషం వేశారు. "ఆ సీన్ ఎడిటింగ్‌లో పోవడంతో చాలా నిరాశ చెందాను" అని ఆమె చెబుతారు. అనంతరం లోబడ్జెట్ సినిమాల్లో కొన్ని అవకాశాలు వచ్చాయి. తరువాత హాలీవుడ్ దిశగా దృష్టి మళ్ళింది. అయితే ఆమెలో ఎన్నో సంశయాలు. "హాలీవుడ్‌కు వెళ్ళాలని చాలాసార్లు అనుకున్నా ఎప్పటికప్పుడు వాయిదా వేసుకుంటూ వచ్చాను. అక్కడ నటిగా పోటీ ఇచ్చే ప్రతిభ అనుభవం నాకు లేదని నమ్మేదాన్ని. చిన్న సినిమాలు చేసి, ఆత్మవిశ్వాసం పెంచుకున్నాక, ఇరవై నాలుగేళ్ళ వయసులో లాస్ ఏంజెల్స్ చేరుకున్నాను" అని ఒక సందర్భంలో అన్నారామె.

అక్కడ కూడా ఆమె జీవితం అంత సజావుగా సాగలేదు. ఒక చిన్న గ్యారేజీ అపార్ట్‌మెంట్‌లో తన కుక్కతో కలిసి ఉండేవారు. 1996లో 'జెర్రీ మాగైర్' సినిమా ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆ తరువాత మంచి పాత్రలు వెతుక్కుంటూ వచ్చాయి. 2001లో విడుదలైన 'బ్రిడ్జెట్ జోన్స్ డైరీ' సినిమా ఆమెను అంతర్జాతీయ స్థాయి నటిగా నిలబెట్టింది. అత్యధికంగా పారితోషికం తీసుకొనే నటీమణుల జాబితాలో రెనీ చోటు సంపాదించుకున్నారు.

### యాస నేర్చి... బరువు పెరిగి...

పాత్ర ఏదైనా అందులో ఒదిగిపోవడం తెలిసిన నటి రెనీ. "నన్ను 'బ్రిడ్జెట్ జోన్స్ డైరీ'లోని టైటిల్ పాత్రకు తీసుకుంటున్నట్టు ప్రకటన రాగానే ఎన్నో విమర్శలు వచ్చాయి. అది బ్రిటిష్ యువతి పాత్ర. నేను మాట్లాడే ఇంగ్లీష్ బ్రిటిష్ యాసతో ఉండదు. అలాగే జోన్స్ కాస్త లావుగా ఉంటుంది, సిగరెట్లు కాలుస్తుంది. ఆ పాత్ర కోసం నేను బ్రిటిష్ యాస నేర్చుకున్నాను. పిజ్జాలూ, ప్రోటీన్ షేక్‌లు తీసుకొని ఎనిమిది కిలోల బరువు పెరిగాను. సిగరెట్లు కాల్చడం నేర్చుకున్నాను" అని చెప్పారు రెనీ. ఆ శ్రమ వృథా పోలేదు. సినిమా విడుదలైన తరువాత ఆ పాత్ర ఆమె తప్ప మరెవరూ చేయలేరన్నంత ఖ్యాతి సంపాదించుకున్నారు. అలాగే 'కోల్డ్ మౌంటెన్' నవల రెనీకి చాలా ఇష్టం. దాన్ని సినిమాగా తీయడానికి హక్కులు కొందామని అనుకున్నారు. ఆ సంగతి సినీ రూపకర్త ఆంథోనీ మింఘెల్లాకు తెలిసింది. ఆ హక్కులు కొని, రెనీని ప్రధాన పాత్రధారిణిగా పెట్టి సినిమా తీశారు. ఆ సినిమాకు ఉత్తమ సహాయనటిగా తొలి ఆస్కార్ ఆమెకు లభించింది. ఆ చిత్రంతో ఒకే పాత్రకు ఆస్కార్, గోల్డెన్ గ్లోబ్‌తో సహా అయిదు వేర్వేరు పురస్కారాలు సాధించిన పదముగ్గురు నటీమణుల్లో రెనీ ఒకరుగా నిలిచారు. 'చికాగో' అనే సినిమా కోసం సరదాగా రెనీ పాడగా రికార్డు చేస్తే, ఆమె గొంతు చక్కగా ఉంటుందని తెలిసింది. కానీ ఆ సినిమాలో పాత్ర కోసం పది నెలల పాటు గానం, నృత్యంలో ఆమె శిక్షణ తీసుకున్నారు.

### అందుకే బ్రేక్...

అయితే వరుస విజయాలతో అగ్రస్థానంలో ఉన్న సమయంలో నటనకు ఆమె విరామం ఇచ్చారు. అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఏకంగా ఆరేళ్ళపాటు! ఆ సమయంలో రెనీ గురించి అనేక పుకార్లు షికారు చేశాయి. వాటికి ఆ తరువాత ఆమె బదులిస్తూ "సినిమాలతో తీరిక లేకుండా గడపడంతో నా గురించి నేను శ్రద్ధ తీసుకోలేకపోయాను. బాగా అలిసిపోయాను. ఆరోగ్యానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోలేకపోయాను. వైద్యులు ఆ సంగతి చెప్పిన తరువాత సినిమాల నుంచి విరామం తీసుకోవడం తప్పనిసరి అనిపించింది. అలాగే నేను చేయవలసిన పనులు చాలా ఉన్నాయి. అవి నా సినిమా షెడ్యూల్‌లో ఇమడవు. అందుకే బ్రేక్ తీసుకున్నాను. ఆ విషయంలో నాకు ఎలాంటి విచారమూ లేదు. నన్ను నేను రీఛార్జ్ చేసుకోవడానికీ, సెలబ్రిటీగా ఎప్పుడూ ప్రజల దృష్టి నామీదే ఉన్నప్పుడు నేను అనుభవించలేని జీవితాన్ని ఆస్వాదించడానికీ ఆ సమయం నాకు వీలు కలిగించింది" అని ఆమె చెప్పారు. ఆరేళ్ళ తరువాత, 'బ్రిడ్జెట్ జోన్స్' సీరీస్‌లో మూడవ చిత్రం 'బ్రిడ్జెట్ జోన్స్ బేబీ'తో 2016లో రెనీ రీ-ఎంట్రీ ఇచ్చారు. తెరపై తన పునరాగమనాన్ని బలంగా చాటారు.

న్యూస్ మేకర్

### ఆ కోరిక తీరింది

ఆ తరువాత మరో రెండు సినిమాలు చేసిన రెనీకి అందివచ్చిన అద్భుతమైన అవకాశం 'జూడీ'. దీనికే ఇప్పుడామెకు ఉత్తమ నటిగా ఆస్కార్ దక్కింది. 1988లో హాలీవుడ్‌ను రెనీ తొలిసారి సందర్శించారు. అక్కడ 'వాక్ ఆఫ్ ఫేమ్' (సుప్రసిద్ధ తారల పేర్లతో ఉండే మార్గం)ను చూసి, ఏదో ఒక రోజు తన పేరు కూడా అక్కడ ఉండాలని కలగన్నారు. 2005లో ఆ కోరికను నిజం చేసుకున్నారు.

### క్యాన్సర్‌పై అవగాహన కోసం...

రెనీ ఒకప్పుడు రొమ్ములో గడ్డలు ఏర్పడడంతో అప్రమత్తమై, అది ముదిరి రొమ్ము క్యాన్సర్‌గా మారకుండా ఎదుర్కొని, విజయవంతంగా బయటపడ్డారు. అందుకే ఆ వ్యాధిపై అవగాహన కలిగించడానికి బ్రెస్ట్ హెల్త్ ఇంటర్నేషనల్‌తో కలిసి పని చేశారు. నిధుల సేకరణ కోసం టామీ హిల్‌ఫిగర్ కంపెనీ రూపొందించిన బ్రెస్ట్ క్యాన్సర్ ఎవేర్‌నెస్ హ్యాండ్‌బ్యాగ్‌కు మోడల్‌గా వ్యవహరించారు. అభిమానులతో సాదరంగా ఉంటారనే పేరు ఆమెకు ఉంది.

ప్రశంసలూ, పురస్కారాలూ రెనీకి కొత్త కాదు. నాలుగు సార్లు గోల్డెన్ గ్లోబ్, రెండుసార్లు బ్రిటిష్ అకాడమీ ఫిల్మ్ అండ్ టీవీ అవార్డులు, నాలుగు స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్ అవార్డులతో సహా ఎన్నో పురస్కారాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. 2004లో 'కోల్డ్ మౌంటెన్' సినిమాకు ఉత్తమ సహాయనటిగా ఆస్కార్ అందుకున్న రెనీ ఈ ఏడాది 'జూడీ' సినిమాతో ఉత్తమ నటిగా మరో ఆస్కార్‌ను సొంతం చేసుకున్నారు. గ్లామర్ రంగంలో మహిళలు ఒకసారి లైమ్‌లైట్ నుంచి పక్కకు తప్పుకుంటే ఇక వారి కెరీర్ ముగిసినట్టేనన్న అపోహలను చెల్లాచెదురు చేశారు. ప్రతిభకూ, నైపుణ్యానికీ కాలదోషం ఉండదని రుజువు చేశారు. అందుకే... రెనీ ది రియల్ విన్నర్!

సుప్రసిద్ధ అమెరికన్ గాయని, నటి జూడీ గార్లాండ్ జీవిత కథ ఆధారంగా రూపొందిన చిత్రం. నలభై ఏడేళ్ళకే మరణించిన జూడీ జీవితంలోని చివరి సంవత్సరాల్లో ఆమె పడిన ఘర్షణలకు అద్దంపట్టిన సినిమా 'జూడీ'. ఈ పాత్ర కోసం

## ఆ పాత్రలో పరకాయ ప్రవేశం

హెయిర్ స్టయిల్ దగ్గర నుంచి ప్రతి విషయంలోనూ రెనీ ఎంతో శ్రద్ధ తీసుకున్నారు. జూడీని తనలో ఆవహింపజేసుకొని నటించారు. అమెరికాలో కిందటి ఏడాది సెప్టెంబర్‌లో విడుదలైన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. అనేక ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను గెలుచుకుంది. వీటిలో రెనీ సాధించినవే పదిహేనుకు పైగా ఉండడం విశేషం.



'జూడీ' చిత్రంలో...

---

**కొన్ని దశాబ్దాల పాటు అమృతతుల్యమైన తన గానాన్ని అందించి పరవశింపజేసిన మహా గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు. ఈ లోకం విడిచివెళ్లి నాలుగున్నర దశాబ్దాలైనా ఆయన పాట వినందే తెలుగువారికి రోజు మారదు. ఆయన భౌతికంగా అమరుడై నేటికి సరిగ్గా 46 సంవత్సరాలు. కృష్ణా జిల్లా టేకుపల్లిలో 1922 డిసెంబర్ 4 జన్మించారు ఘంటసాల. సూరయ్య (సూర్య నారాయణ), రత్తమ్మ దంపతులకు మూడో సంతానం. గానకళ ఘంటసాలకు ఆజన్మవిద్యే అనుకోవాలి.**



నివాళి

నేడు ఘంటసాల వర్ధంతి

# కారణజన్ముడు

అది 1930వ సంవత్సరం. మండు వేసవి.ఎర్ర లంగోటా, కొండి చుట్టుకుని ఓ ఆరేడేళ్ల పిల్లవాడు 'ఇందిరా హృదయారవింద' అని నారాయణతీర్థుల తరంగాన్ని నృత్యం చేస్తూ పాడగా... చూసి పరవశించినట్లు సముద్రాల రాఘవాచార్యులు రాశారు. పదేళ్ల వయస్సులో బెజవాడలో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు ఇంట జరిగిన సప్తాహంలో పాల్గొన్నారు ఘంటసాల. ఆ సందర్భంగా నారాయణ తీర్థుల తరంగాన్ని పాడుతూ, నాట్యం చేయడం అక్కడున్నవారిని ఆనందంలో ముంచెత్తింది.

**తండ్రి మాటే శిరోధార్యంగా...**

మృదంగాన్ని చంకకు తగిలించుకుని, భుజం మీద తన సంగీత వారసుడ్ని మోసుకుంటూ సూరయ్య ఊరూరా తిరుగుతూ తరంగ గానం చేసేవారు. దాంతోనే కుటుంబాన్ని పోషించేవారు. ఆయన చివరి ఘడియల్లో కుమారుణ్ణి దగ్గరికు తీసుకుని సంగీత విద్యలో తరించమని చెప్పారు. ఆ మాటే ఘంటసాలకు శిరోధార్యమైంది. తండ్రి మరణానంతరం ఆశ్రయం, పోషణ లేక తల్లి తన తమ్ముడింటికి వెళ్లిపోయారు. కానీ ఘంటసాల మాత్రం తండ్రి మాట ప్రకారం ఎలాగైనా సంగీతం నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. 40 రూపాయల విలువ చేసే ఉంగరాన్ని 8 రూపాయలకే ఇచ్చేసి, రైలెక్కి విజయనగరం చేరుకున్నారు.

**విజయనగరం వెళ్లి...**

ఆ నాడు విజయనగరం సంగీత కళాశాలకు వెళ్లేనాటికి వేసవి సెలవులు. ఉండడానికి నెలవు లేదు. తినడానికి తిండి లేదు. పాఠశాల్లో కొంత ఆశ్రయం చూసుకుంటూ ఇంటింటికీ వెళ్లి యాచించారు. తర్వాతి కాలంలో అనేక వేదికల మీద 'నాడు ఏ తల్లి నా మొదట నా జోలెలో భిక్ష వేసిందో... ఆమె వాత్సల్యపూరితమైన భిక్ష నాకు అష్టైశ్వర్యాలతో కూడిన భవిష్యత్తునే ప్రసాదించింది' అని కృతజ్ఞతగా చెప్పుకున్నారు ఘంటసాల. పగలు తెచ్చుకున్న అన్నంలో మిగిలింది రాత్రికి దాచుకోవడానికి ఆయన వద్ద గిన్నె కూడా లేదు. బట్టలో చుట్టి పెట్టుకొనేవారు. కొన్నిసార్లు దానికి చీమలు పట్టి, రాత్రిళ్లు పస్తులుండాల్సి వచ్చేది. చివరకు పట్రాయని సీతారామశాస్త్రి గారి ఇంట ఆశ్రయంతో పాటు తొలినాళ్ల సంగీత విద్య కూడా ఘంటసాలకు లభించింది.

**శ్రవణానందం... శాస్త్రసమ్మతం...**

తీరని తపన, నిరంతర సాధనతో నాలుగేళ్ల కోర్సు రెండేళ్లలోనే పూర్తి చేశారు ఘంటసాల. శ్రవణానందము... శాస్త్రసమ్మతము కావాలనే సిద్ధాంతాన్ని పుణికిపుచ్చుకున్నారు. ఈ సిద్ధాంతాన్ని ఆచరించి తన గానాన్ని సంగీత శాస్త్ర సమ్మతంగానే గాక శ్రవణానంద సముపేతంగా పంచిపెట్టారు. గాత్ర సంగీతంలో పట్టా పొంది విజయనగరం విడిచిపెట్టే తరుణంలో సుప్రసిద్ధ హరికథా విద్వాంసుడు చొప్పలి సూర్యనారాయణ భాగవతారు పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో ఘంటసాల సంగీత కచ్చేరీ ఏర్పాటు చేశారు. నాటి సభలో ఆదిభట్ల నారాయణదాసు... ఘంటసాల ప్రతిభకు మెచ్చి తంబూరా బహూకరించారు. అది తన జీవితంలోనే పర్వదినంగా చెప్పుకున్నారు ఘంటసాల.

**ఖైదీలకు సంగీత పాఠాలు...**

సంగీత విద్యలో పట్టభద్రుడైన తర్వాత కూడా ఘంటసాల జీవనం కష్టతరంగానే సాగింది. పర్వదినాల్లో చేసిన కచేరీలు, సంగీత పాఠాలు కడుపునింపలేదు. దీంతో నాటకాలు, హరికథల వైపు మొగ్గు చూపారు. అంతలో స్వాతంత్ర్యోద్యమం తీవ్రమైంది. క్విట్ ఇండియా ఉద్యమకాలమది. ఆ ప్రభావం ఘంటసాలపై కూడా పడింది. 'నా వ్యక్తిగత జీవితం, కుటుంబ బాధ్యత, సంగీత సాధన... అన్నీ దేశ భవితవ్యం దృష్ట్యా చాలా అల్పం' అని భావించి ఉద్యమంలో దూకారు. 1943 ఏప్రిల్ 24న 22 ఏళ్ల వయసులో బళ్లారి అల్లీపురం జైలులో శిక్ష అనుభవించారు ఘంటసాల. ఆ జైలులోనే పొట్టి శ్రీరాములు వద్ద హిందీ నేర్చుకున్నారు. ఎర్నేని సుబ్రహ్మణ్యం, ఎలమంచిలి వెంకటప్పయ్యలు గాంధీజీ సిద్ధాంతాలను బోధించారు. అవగాహన పెరిగింది. అక్కడా ఆయన జాతీయోద్యమ గీతాలు ఆలపించారు. ఖైదీలకు సంగీత పాఠాలు బోధించారు. జైలు నుంచి విడుదలయ్యాక మోపిదేవిలో నటరాజ నాట్యమండలి వారు ప్రదర్శించిన నాటకాల్లో వివిధ పాత్రలు ధరించారు ఘంటసాల. సుమధుర సంగీతంతోనూ అలరించారు.

**సముద్రాల పరవశం...**

1944 మార్చి 3న సావిత్రితో ఘంటసాల వివాహం జరిగింది. తన పెళ్లిలో తానే సంగీత కచ్చేరీ చేశారు. తర్వాత కొన్నాళ్లకు సముద్రాల సీనియర్‌ను కలిశారు. తన గాన మాధుర్యంలో ఆయన్ను ముంచెత్తారు. మద్రాసు వచ్చి తనను కలుసుకోమన్నారు సముద్రాల. రెండు నెలలు దీక్షగా నాటకాలు వేసి, రూ.50 కూడబెట్టుకుని 1944 మేలో మద్రాసు వెళ్లారాయన. సముద్రాల వారు చిత్తూరు నాగయ్య, బి.ఎన్.రెడ్డి వంటి ఎంతో మంది ప్రముఖులకు ఘంటసాల పాట వినిపించారు. సిఫారసు ఉత్తరాలు రాశారు. పాట చాలా బావుందన్నారు. అవకాశాలిస్తామన్నారు. కానీ అవి అంత సులభంగా రాలేదు. ఆశ్రయం కష్టమైంది. పగలు అవకాశాల కోసం తిరగటం, రాత్రివేళల్లో పానగల్ పార్కులో నిద్ర.



ముగ్గురు పద్మశ్రీలు: ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లతో...

**రూ.116 పారితోషికం...**

సముద్రాలవారే ఘంటసాలను మద్రాసు రేడియో ప్రయోక్త బాలాంత్రపు రజనీకాంతరావుకు పరిచయం చేశారు. 1944 సెప్టెంబర్ 30న మద్రాసు రేడియోలో మొదటిసారి ఘంటసాల కర్ణాటక సంగీత కచ్చేరీ ప్రసారమైంది. తరచుగా సంగీత రూపకాల్లో, బృంద గానాల్లో, సంగీత నాటకాల్లో పాడే అవకాశం వచ్చింది. బలరామయ్య 'సీతారామ జననం'లో చిన్న చిన్న వేషాలకు ఘంటసాల నెలకు రూ.75 జీతానికి కుదిరారు. అది అక్కినేని నాగేశ్వరరావు సినిమా. పూర్వ పరిచయం వల్ల నాగేశ్వరరావు, ఘంటసాల ఇంకా దగ్గరయ్యారు. పేకేటి శివరాం ఇన్‌ఛార్జిగా ఉన్న హెచ్‌ఎంవీలో ఘంటసాల పాట రికార్డు చేశారు. బి.ఎన్.రెడ్డి 116 రూపాయల పారితోషికమిచ్చారు. 'బాలరాజు'లో సుబ్బరాయన్ వద్ద సహాయ సంగీత దర్శకునిగా పని చేయడమే గాక తొలిసారి అక్కినేనికి పాడారు ఘంటసాల.

**సంగీత దర్శకునిగా...**

'లక్ష్మమ్మ' ఘంటసాల సంగీత దర్శకునిగా తొలిచిత్రం. తర్వాత 'కీలుగుర్రం'. ఆ మరుసటి సంవత్సరం 'షావుకారు'లో ఎన్టీఆర్‌కు ఘంటసాల నేపథ్యగానం తొలిసారి. ఈ ఇద్దరు కథానాయకుల నటనాయాత్రకు ఘంటసాల పాట వైభవం కలిగిస్తే, వారికి పాడడం ద్వారా ఘంటసాల గాన యాత్ర ఉజ్వలంగా వెలిగింది.

'గాంభీర్యం, మాధుర్యం, మార్దవం, ఆర్జవం కలబోసిన స్వరం ఘంటసాలది' అన్న కె.వి.రెడ్డి ప్రశంసలు ఆయనకు యోగ్యతాపత్రాలు. పాటైనా, పద్యమైనా, శ్లోకమైనా, దండకమైనా నవరసాలొలికే గానం ఘంటసాలది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, తుళు, హిందీ భాషల్లో కలిపి పది వేలకు పైగా పాటలు పాడారు. 100కు పైగా సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. ఐక్యరాజ్యసమితి వేదికపై పాడిన ఘనత దక్కించుకున్నారు.

**అన్నమయ్య తరువాత ఆయనే...**

తిరుమల శ్రీవారి ఎదుట అన్నమాచార్యుడి తరువాత మళ్లీ పాడింది ఘంటసాలే! 'శ్రీవేంకటేశ్వర మహత్మ్యం'లో 'శేషశైలావాసా' అంటూ తన్మయత్వంతో పాడిన ఆ దృశ్యం తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయింది. పాటైనా, పద్యమైనా, దండకమైనా రసరంజకంగా ఆలపించడం ఘంటసాలకే చెల్లింది. బిచ్చమెత్తి సంగీత విద్య నేర్చారు. తరతరాలకూ తరగని సంగీత భిక్ష పెట్టారు. అందుకే పాట ఉన్నంత కాలం ఘంటసాల జీవించే ఉంటారు.

• డా. జె.చెన్నయ్య

*(హైదరాబాద్ కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ వారు విజయనగరంలో నేడు 24 గంటల నిర్విరామ ఘంటసాల ఆరాధనోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా)*

---

# నా భూమి నాకు దక్కాలంటే...?



లీగల్ కౌన్సెలింగ్

*ప్రభుత్వం వారు 2008లో 3 సెంట్ల భూమి. డి-ఫారమ్ పట్టా ఇచ్చారు. అందులో ఇల్లు కట్టుకోవడానికి 2016లో మేము వెళితే, అప్పటికే ఆ స్థలంలో కొందరు ఇల్లు కట్టుకున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాం. కానీ, ఫలితం లేదు. నా మూడు సెంట్ల భూమి నాకు దక్కాలంటే ఏంచేయాలి? ఈ స్థలానికి సంబంధించిన హద్దులు చూపమని బ్యాంకులో చలాన్ కూడా కట్టాం. అలాగే స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెల్‌కు కూడా ఫిర్యాదు చేశాను. కానీ, ఎక్కడా స్పందన లేదు. నాకు ఇచ్చిన అసైన్డ్ స్థలంలో ఇతరులు ఇల్లు కట్టడం కూడా సర్వేయర్, వీఆర్‌ఓలు వచ్చి చూశారు. ఆ వివరాల రిపోర్టులు కావాలని సమాచార హక్కు చట్టం కింద ఒక అర్జీని పోస్టులో పంపాను. కానీ, వారు ఇంతవరకు నాకు రిపోర్టు పంపలేదు. కరెంటు బిల్లులు, ఇంటిపన్ను బిల్లులన్నీ అందులో ఇల్లు కట్టిన వారి పేరు మీదే ఉన్నాయి. అనుబంధ పత్రం కూడా వారి పేరు మీదే ఉంది. నా భూమి నాకు దక్కాలంటే ఏం చేయాలి?*

**- బి. రామలక్ష్మి,** నిజామాబాద్

మీకు డి-ఫారమ్ పట్టా ఇవ్వడమే కాకుండా, అసైన్డ్ చేసిన భూమిని స్వాధీనపరిచి మీకు అందులో ఇల్లు కట్టుకోవడానికి వీలు కల్పించవలసిన బాధ్యత కూడా అసైన్ చేసిన అధికారులదే. మీకు భూమిని స్వాధీనపరచనందు వల్ల వేరే వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించుకున్నప్పుడు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌కి, లేదా జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేయండి. మీ భూమిని ఆక్రమించిన వారిని అందులోంచి తొలగించి మీకు స్వాధీనపరచమని గానీ, లేదా దానికి సమీపంలో అంతే విస్తీర్ణమైన వేరే ఏదైనా భూమిని ఇప్పించమని గానీ అడగండి. మీరు ఫిర్యాదు చేసిన తరువాత కూడా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ కానీ, కలెక్టర్ గానీ ఈ విషయంలో ఏమాత్రం స్పందించకపోతే మీరు వారి మీద పై అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. అంతే కాకుండా న్యాయస్థానాన్ని సంప్రతించి, మీ భూమిని మీకు అసైన్ చేయమని కోరే హక్కు మీకు ఉంది. సమాచార చట్టం హక్కు ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ మీరు అడిగిన సమాచారం ఇంతవరకూ లభించలేదన్నారు. వాస్తవానికి మీరు అర్జీ పెట్టుకున్న 30 రోజుల్లోగా మీరు అడిగిన సమాచారాన్ని మీకు అందచేయాలి. ఒకవేళ ఆ సమాచారం వారి వద్ద లేకపోతే, ఆ విషయమైనా తెలియచేయవలసిన బాధ్యత వారికి ఉంది. సమాచారం అందించడంలో నిర్లక్ష్యంగా ఉండిపోతే వారి మీద హైదరాబాద్‌లోని అప్పిలేట్ అథారిటీకి ఫిర్యాదు చేయండి. ఏమైనా మీకు డి-ఫారమ్ పట్టా ఇస్తూ అసైన్ చేసిన అధికారులే మీకు న్యాయం చేయవలసి ఉంటుంది.



**• ఒడ్నాల శ్రీహరి,**
న్యాయవాది, హైదరాబాద్

---



నిరసన

# మహిళా దర్శకుల్ని గుర్తు చేశారు

ఆస్కార్స్ 2020కి దర్శకత్వ విభాగంలో ఒక్క మహిళ కూడా నామినేట్ కాలేదు. అఫ్‌కోర్స్... గతేడాదీ లేరు! ఈ ఏడాది నామినేషన్లు ప్రకటించిన తర్వాత దర్శకత్వ విభాగంలో మహిళలు లేకపోవడంతో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. మహిళా దర్శకుల్ని కావాలనే విస్మరించారనే వ్యాఖ్యలు వినిపించారు. ఆస్కార్స్ వేడుక సాక్షిగా ఈ అంశంపై నటి నటాలీ పోర్ట్‌మన్ నిరసన వ్యక్తం చేశారు. గతేడాది మంచి మంచి చిత్రాలు తీశారని పేరు తెచ్చుకున్న మహిళా దర్శకులు లోరైన్ (హస్‌లర్స్), గ్రెటా గెర్‌విగ్ (లిటిల్ విమెన్), మాటీ డియాప్ (అట్లాంటిక్స్), మారియెల్లి హెల్లర్ (ఎ బ్యూటిఫుల్ డే ఇన్ ది నైబర్‌హుడ్), మెలీనా మాట్‌సౌక్స్ (క్వీన్ & స్లిమ్), అల్మా హరెల్ (హనీ బోయ్), సెలిన్ సియామా (పోర్ట్రెట్ ఆఫ్ ఎ లేడీ ఆన్ ఫైర్), లులు వాంగ్ (ది ఫేర్‌వెల్) పేర్లను నటాలీ పోర్ట్‌మన్ తన కోటుపై అందరికీ కనిపించేలా ఎంబ్రాయిడరీ చేయించారు. ఆ కోటును గౌనుపై ధరించి రెడ్ కార్పెట్ మీద నడిచారు. మహిళా దర్శకుల పేర్లను ప్రపంచానికి గుర్తు చేశారు. ఓ విధంగా ఇది నిరసన. ఆస్కార్స్ కమిటీపై వేసిన సెటైర్. నటాలీ పోర్ట్‌మన్‌కు సోషల్ మీడియాలో భారీ మద్దతు లభిస్తోంది. ఆమెపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



**'హోటల్ భోజనం పొట్టకు చేటు!'**
**అనుకునే రోజులు పోయాయి!**
**పొగలు కక్కే చికెన్ ముక్కలు, పిజ్జాలు, బర్గర్లు**
**నోరూరిస్తుంటే....**
**ఇంటి భోజనంతో సరిపెట్టుకోవడం ఎవరి తరం?**
**అయితే ఇలాంటి ఫాస్ట్ ఫుడ్‌తో ఆరోగ్యం కూడా**
**అంతే ఫాస్ట్‌గా అటకెక్కుతుంది అంటున్నారు**
**వైద్యులు!**

జీర్ణ సమస్యలు

# కారణాలు కడుపులోనే...



తేలికగా జీర్ణమై శోషణ చెంది, శక్తి అందించేదే ఆరోగ్యకరమైన పౌష్టికాహారం. ఇంట్లో వంట అలాంటిదే! మేలురకం వంట నూనెలు, తాజా కూరగాయలు, శుభ్రమైన వంటగదిలో వండిన వంటకాలు ఆరోగ్యకరమైనవి. కానీ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లలో పరిస్థితి ఇందుకు విరుద్ధం. పదే పదే ఒకే నూనెలో వేయించడం, నిల్వ చేసిన కూరగాయలు, మాంసం వాడడం, కృత్రిమ రుచులు జోడించడం, ప్రాసెస్డ్ ఫుడ్ వాడకం ఇక్కడ సర్వసాధారణం. అలాగే చీజ్, బటర్, మయొనీస్, కెచప్, సోయా సాస్, అజినమోటో లాంటి రుచిని పెంచే పదార్థాలు వాడడం, చక్కెర ఎక్కువగా ఉండే శీతల పానీయాలను ఆహారానికి జత చేయడం ఫాస్ట్ ఫుడ్‌లో భాగం. ఇవన్నీ ఆరోగ్యానికి, మరీ ముఖ్యంగా జీర్ణవ్యవస్థకు చేటు చేసేవే! ఇలాంటి ఆహారంతో పలు రకాల జీర్ణసంబంధ సమస్యలు తలెత్తుతాయి. పొట్ట ఉబ్బరం, నొప్పి, విరోచనాలు, వాంతులు... ఇలా చెప్పుకుంటూపోతే బోలెడన్ని సమస్యలు. అయితే ఇవన్నీ ఏదో ఓ సందర్భంలో ప్రతి ఒక్కరినీ వేధించేవే అయినా, నిర్లక్ష్యం చేస్తే తిరిగి సరిదిద్దలేని శాశ్వత సమస్యలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి జీర్ణసంబంధ సమస్యల మీద ఓ కన్నేసి ఉంచాలి. ఈ సమస్యలకు రెండు ప్రధానమైన కారణాలు ఉన్నాయి. అవేంటంటే...

### ఆ నూనెల మూలంగా...

జంక్ ఫుడ్‌లో వాడే పదార్థాలు, అవి తయారయ్యే విధానం... రెండూ ఆరోగ్యానికి హాని కలిగించేవే! రెస్టారెంట్లు, హోటళ్లలో ఒకే నూనెను పదే పదే మరిగిస్తూ ఉంటారు. అలా మరిగించడం మూలంగా ఆ నూనెల్లో ట్రాన్స్‌ఫ్యాట్స్ తయారవుతాయి. ఇవి మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. ఇవి జీర్ణవ్యవస్థతో పాటు గుండెకూ చేటు చేస్తాయి.

### ఆ బ్యాక్టీరియా వల్లే...

అశుభ్రమైన పదార్థాలు, అశుభ్రమైన పరిసరాల్లో ఈ బ్యాక్టీరియా ప్రబలుతుంది. జీర్ణవ్యవస్థకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యలను కలుగజేసే సూక్ష్మజీవి ఇదొక్కటే! గ్యాస్ట్రిక్, డియోడినమ్ అల్సర్లు, గ్యాస్ట్రిక్ కేన్సర్ లాంటి తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. ఈ బ్యాక్టీరియా పొట్టలో చేరితే అవసరానికి మించి ఎక్కువగా యాసిడ్ ఉత్పత్తి అవుతూ ఉంటుంది. దాంతో యాసిడ్‌తో సంబంధం ఉన్న సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. కడుపులో మంట, కడుపు ఉబ్బరం, త్రేన్పులు కనిపిస్తాయి.



### పేగు పూసిందా?

ఎక్కువ శాతం జీర్ణవ్యవస్థ సంబంధిత సమస్యలన్నీ జంక్ ఫుడ్ మానుకున్న కొన్ని రోజుల్లోనే అదుపులోకి వస్తాయి. కేవలం హెలికోబ్యాక్టర్ పైలోరీతో ఏర్పడిన ఇన్‌ఫెక్షన్ ఒక్కటే ఒకసారి సోకితే, దీర్ఘకాలం పాటు చికిత్స తీసుకోవలసి ఉంటుంది. పేగు పూత (ఐ.బి.డి) ఒకసారి తలెత్తితే జీవితాంతం మందులు వాడవలసి ఉంటుంది.

### కడుపు ఉబ్బరమా?

ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ (ఐ.బి.ఎస్) జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యే అయినా ఆహారశైలి వల్ల కాకుండా, ఒత్తిడి లాంటి మానసిక కారణాల మూలంగా తలెత్తుతుంది. కడుపు ఉబ్బరం, మలబద్ధకం లేదా విరేచనాలు లాంటివి ప్రధానంగా కనిపిస్తాయి. వీరిలో పొట్టలో కదలికలు తక్కువగా లేదా ఎక్కువగా ఉంటాయి. కడుపులో నొప్పి కూడా ఉంటుంది. జీవనశైలి మార్పులతో ఈ సమస్యను అదుపు చేసుకోవచ్చు.

### సొంత వైద్యం మానుకోవాలి!

సాధారణంగా జీర్ణసంబంధ సమస్యలకు సొంత వైద్యం మీదే ఆధారపడుతూ ఉంటాం. అసిడిటీ, పొట్టలో నొప్పి, విరోచనాలు లాంటి సమస్యలకు మందుల షాపులో మాత్రలు కొని వాడేస్తూ ఉంటాం. కానీ ఎంతో అరుదుగా తప్ప ఇలా సొంత వైద్యం మీద ఆధారపడడం క్షేమం కాదు. నెలలో ఒకసారి లేదా రెండు సార్లు జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు తలెత్తుతూ ఉంటే, తప్పనిసరిగా వైద్యులను కలవాలి. యాంటీ బయాటిక్స్ వాడడం అలవాటు చేసుకోవడం వల్ల యాంటీ బయాటిక్ రెసిస్టెన్స్ ఏర్పడి శరీరం మందులకు స్పందించే గుణం కోల్పోతుంది. ఇది మరింత ప్రమాదకరం.



- డాక్టర్ కె. సోమశేఖర్
గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్
హైదరాబాద్

## ఇలా ఎందువల్ల?

**అజీర్తి, వికారం, మలబద్ధకం లాంటి జీర్ణసంబంధ సమస్యలు ప్రతి ఒక్కరిలో అడపా దడపా కనిపించేవే! అయితే అవి అరుదుగా కాకుండా, పదే పదే కనిపిస్తూ ఉంటే జీర్ణవ్యవస్థతో సంబంధం ఉన్న సమస్యగానే భావించాలి. లక్షణాల పరంగా రుగ్మతలను కనిపెట్టే ప్రయత్నం చేయాలి.**

### ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్

దీన్నే పేగు పూత అంటారు. దీన్లో అల్సరేటివ్ కొలైటిస్, క్రోన్స్ డిసీజ్ అనే రెండు రకాలుంటాయి. మొదటిది పెద్ద పేగులో వచ్చే సమస్య అయితే, రెండవది చిన్న, పెద్ద పేగులు రెండిటికీ కలిపి ఉండవచ్చు. ఎక్కువ ట్రాన్స్ ఫ్యాట్స్ ఉన్న పదార్థాలు తినడం మూలంగా ఈ సమస్యలు తలెత్తుతాయి. పొట్టలో శబ్దాలు, నొప్పి, రక్తంతో కూడిన విరేచనాలు, జ్వరం, బరువు తగ్గిపోవడం, రక్తహీనత ఈ సమస్యలో కనిపించే ప్రధాన లక్షణాలు.



### ఛాతీలో మంట



తిన్న వెంటనే ఛాతీలో మంట ఎసిడిటీకి సంబంధించిన లక్షణం! తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, అత్యధికంగా కొవ్వులు లేదా తీపి కలిగిన పదార్థాలు తినడం ఇందుకు ప్రధాన కారణం. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, అన్నవాహికలోకి తన్నుకొని వచ్చే యాసిడ్ మూలంగా అన్నవాహిక పైపొరలోని కణాల స్థానంలో కొత్త కణాలు తయారవుతాయి. అవి క్రమేపీ కేన్సర్ కణాలుగా మారే ప్రమాదం ఉంటుంది.

### కాలేయ ఇన్‌ఫెక్షన్



భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం, అశుభ్రమైన పదార్థాలతో వంటకాలు తయారవడం మూలంగా హెచ్.పైలోరీ బ్యాక్టీరియా శరీరంలో చేరుకుంటుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి తేలికగా సోకుతుంది. ఈ బ్యాక్టీరియా 'నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్' అనే సమస్యను కలిగిస్తుంది. దీర్ఘకాలంలో ఈ సమస్య కాలేయాన్ని తిరిగి సరిదిద్దలేనంత తీవ్రంగా దెబ్బతీస్తుంది.

### పైల్స్ అండ్ ఫిషర్స్

మలబద్ధకం, ఆహారంలో పీచుపదార్థాలు లోపించడం ఇందుకు ప్రధాన కారణం. జంక్ ఫుడ్‌లో ఎక్కువగా నూనెలు, మైదా, చీజ్, తక్కువ కూరగాయలు ఉంటాయి. దాంతో సుఖ విరేచనం కష్టం అవుతుంది. ఫలితంగా పురీషనాళం చీరుకుపోయి ఫిషర్స్, పైల్స్ ఏర్పడతాయి. ఆహారంలో మార్పులు చేసుకుంటే సర్జరీ లేకుండానే సమస్యలను తగ్గించుకోవచ్చు.

### విషాహారం

కలుషిత ఆహారం తినడం మూలంగా వాంతులు, విరేచనాలు మొదలవుతాయి. కడుపులో నొప్పి కూడా ఉంటుంది. ఇందుకు కారణం వైరస్‌లు, బ్యాక్టీరియాలు కలిపి జీర్ణవ్యవస్థను అతలాకుతలం చేయడమే!



### స్టమక్ అల్సర్

హెచ్ పైలోరి బ్యాక్టీరియా కారణంగా చిన్న పేగులో లేదా జీర్ణాశయంలో అల్సర్ వస్తుంది. తిన్న వెంటనే లేదా ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు నొప్పి ఉండవచ్చు. వాంతి వచ్చినట్టు అనిపించడం, మరీ ముఖ్యంగా ఉదయాన్నే కడుపులో నొప్పితో నిద్ర మెలకువ రావడం లాంటి లక్షణాలు కూడా ఉంటాయి.

### స్టమక్ కేన్సర్



హెచ్. పైలోరి బ్యాక్టీరియా దీర్ఘకాలికంగా శరీరంలో ఉంటే, పొట్ట కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. అల్సర్‌తో మొదలై క్రమేపీ కేన్సర్‌గా పరిణమిస్తుంది. కాబట్టి లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి.

---

హార్మోనల్ హెల్త్

# నాకు చావే శరణ్యమా?



**డాక్టర్! నాకు పెళ్లయి మూడేళ్లు. తొలి రాత్రి తొలి ప్రయత్నంలోనే ఫెయిల్ అయ్యాను. దాంతో ఆత్మస్థయిర్యం దెబ్బతింది. వైద్యుల సూచన మేరకు వయాగ్రా వాడినా ఫలితం దక్కలేదు. కలిసే ప్రయత్నం చేసిన ప్రతిసారీ అలాగే జరుగుతూ ఉండడంతో భార్యకు దూరంగా ఉండిపోయాను. హస్తప్రయోగం సమయంలో అంగస్తంభనలు, స్ఖలనాలు మామూలుగానే జరుగుతున్నాయి. అయినా భార్యతో కలిసే సమయంలో ఇలా ఎందుకు జరుగుతోంది? ఈ సమస్యతో బంధువుల్లో చులకన అయిపోయాను. కొన్నిసార్లు ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనిపిస్తోంది. నన్ను ఏం చేయమంటారు?**

**- ఓ సోదరుడు,** దోర్నాల

మీకు అంగస్తంభనాలు, స్ఖలనాలు మామూలుగానే ఉన్నాయి. కాబట్టి సమస్య మీ మనసులోనే ఉంది. మొదటిసారి ఫెయిల్ అయ్యారు కాబట్టి ఆ భయం మీ మనసులో అలా నాటుకుపోయింది. దాంతో భార్యతో కలిసే సమయానికి అంగం స్తంభించడం లేదు. ఇలాంటప్పుడు వయాగ్రా కూడా పని చేయదు. నిజానికి మీకు ఉన్నది సమస్యే కాదు. మీ మనసులో భయం పోయి, సమర్థంగా సెక్స్‌లో పాల్గొనేలా చేయాలంటే అంగ స్తంభన ఎక్కువ సమయం పాటు నిలిపి ఉంచే చికిత్స అవసరం. ఇందుకోసం 'ఇంట్రా పినైల్ ఇంజెక్షన్' ఇవ్వవలసి ఉంటుంది. ఈ ఇంజెక్షన్ అంగానికి చేస్తారు. దీంతో కనీసం రెండు నుంచి మూడు గంటల పాటు అంగం స్తంభించి ఉంటుంది. ఇలా ఒకసారి భార్యతో సెక్స్‌లో పాల్గొనగలిగితే, మీలో ఆత్మ విశ్వాసం పెరిగి, తర్వాత ఎటువంటి చికిత్స అవసరం లేకుండానే సెక్స్‌లో పాల్గొనగలుగుతారు. అయితే ఆ సమయంలో భార్య తోడ్పాటు కూడా అవసరం అవుతుంది. కాబట్టి మీరు భార్యతో కలిసి వైద్యులను సంప్రతించండి. ఈ ఇంజెక్షన్ పగటి వేళ తీసుకోవలసి ఉంటుంది. అలాగే ఆస్పత్రికి దగ్గర్లో, వైద్యులకు అందుబాటులో ఉండాలి. కాబట్టి అనుభవజ్ఞులైన వైద్యులను కలిసి సమస్యను వివరించి, చికిత్స తీసుకోండి. ఇంత చిన్న విషయానికి ఆత్మహత్య ఆలోచన చేయడం అవివేకం.



- డాక్టర్ రాహుల్ రెడ్డి
ఆండ్రాలజిస్ట్, హైదరాబాద్
8332850090 (కన్సల్టేషన్ కోసం)

అధ్యయనం

# తలగడలో ఏముంది?

పడక గది అంటే అందరికీ పరవశమే! ఎందుకంటే పగలంతా ఉండే శబ్దాల హోరు నుంచీ, అలజడి, ఆందోళనల నుంచీ పరిపూర్ణ విముక్తి కలిగించే మరో ప్రపంచం కదా అది! అయితే హాయిగా తల వాల్చే తలగడలో ఏమేం ఉంటాయో ఎందరికి తెలుసు? తలగడలకు సంబంధించి మాంచెస్టర్ యూనివర్సిటీలో జరిగిన ఒక అధ్యయనంలో గగుర్పాటు కలిగించే పలు వాస్తవాలు బయటపడ్డాయి. నెలల పర్యంతం ఉతకని తలగడలో 16 రకాల ఫంగస్‌లు తయారవుతాయని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఫంగస్ పరిణామంగా శ్వాసకోశాల్లో తీవ్ర స్థాయిలో ఇన్‌ఫెక్షన్లు తలెత్తుతూ ఉంటాయి. వీటివల్ల వాయువాహికలు, శ్వాసకోశాలు దెబ్బతింటాయి. అంతిమంగా ఇది వ్యాధి నిరోధక శక్తి తగ్గడానికి కారణమవుతుంది. ఇది అత్యంత ప్రమాదకర పరిస్థితి. పిల్లో కవర్స్ ఉతకడంతోనే అంతా శుభ్రమైపోయిందని అందరూ అనుకుంటారు. కానీ, దిండు లోపల అసంఖ్యాకంగా ఫంగస్ పెరిగిపోతూ ఉంటుంది. అప్పటికప్పుడు దాని తాలూకు దుష్ఫలితాలేవీ కనిపించకపోయినా, ఒక దశలో శరీరం పలురకాల శ్వాసకోశ వ్యాధులకు నిలయం అవుతుంది. అందుకే ఏడాది లేదా రెండేళ్లకు దిండ్లను పారవేయడం ఎంతో శ్రేయస్కరమని పరిశోధకులు చెబుతున్నారు.



ఆయుర్వేదం

# తులసి వెరసి...



సంప్రదాయ వైద్య విధానంలో తులసిని విరివిగా ఉపయోగిస్తారు. కీటకనాశని, విషహారిణిగా కూడా తులసి ఉపయోగపడుతుంది. తులసితో ఉన్న ప్రయోజనాలు కోకొల్లలు!

**ఉపయోగించే విధానాలు:**

తాజా ఆకుల కషాయం లేదా శీతల కషాయం, ఆకుల ఎండుపొడి, పచ్చి ఆకులు నమలడం, పచ్చి ఆకులను నెయ్యి/తేనె/అల్లపురసం వంటి వాటితో కలిపి వాడడం, వాడుకలో ఉంది. తులసిని హెర్బల్ టీగా కూడా ఉపయోగిస్తారు. తులసి పంచభాగాల చూర్ణాన్ని కూడా ఔషధంగా వాడతారు. తులసి ఆకుల రసం మర్దన చేయడం మరొక చికిత్సా విధానం. తులసిని ఇతర ద్రవ్య పదార్థాలతో కలిపి పలు చికిత్సల్లో ఉపయోగిస్తారు.

**కీటకహారిణి, నొప్పి నివారిణి**

తులసి ఆకుల నుంచి యుజెనాల్ అనే నూనె వాతావరణంలో కలుస్తూ ఉంటుంది. ఇది క్రిమికీటకాదులను, బ్యాక్టీరియాను పారదోలుతుంది. తద్వారా వాతావరణం శుభ్రపడుతుంది. పలు ఔషధాలలో నొప్పి నివారిణిగా దీన్నే వాడుతున్నారు. ఇదే రసాయనం కలిగి ఉండే తులసి కూడా నొప్పినివారిణిగా పేరు తెచ్చుకుంది.

**గుండెకు అండ**

తులసి అనేక గుండె వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. గుండెనొప్పి, ఎథిరోస్క్లెరోసిస్ ఈ పరిధిలోకి వస్తాయి. తులసి రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. కొలెస్ట్రాల్ పలు రకాల గుండె జబ్బులకు మూల కారణం. కాబట్టి గుండెకు రక్షణ కల్పించే ఔషధంగా తులసిని ఉపయోగించవచ్చు.

---

లిటిల్స్

### కనిపెట్టండి చూద్దాం!

ఈ బొమ్మలో కొన్ని తప్పులున్నాయి. వాటిని కనిపెట్టండి.




### పదాలు పూరించండి




### సరైన నీడను గుర్తించండి



### చుక్కలు కలిపి రంగులు వేయండి



### డైలీ సుడోకు -276

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | | | | | 1 | | | 7 |
| | | 3 | 9 | | | | | |
| | | | | 3 | 6 | | 1 | |
| | 5 | 9 | 3 | | 4 | | | |
| | | | | | | | | |
| | | | 2 | | 7 | 6 | 4 | |
| | 9 | | 6 | 1 | | | | |
| | | | | | 9 | 4 | | |
| 6 | | | 5 | | | | | 2 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

**సుడోకు - 275 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 7 | 6 | 1 | 4 | 3 | 5 | 2 | 9 |
| 3 | 4 | 9 | 2 | 6 | 5 | 8 | 7 | 1 |
| 1 | 5 | 2 | 7 | 8 | 9 | 6 | 4 | 3 |
| 4 | 8 | 1 | 5 | 7 | 2 | 9 | 3 | 6 |
| 2 | 6 | 3 | 4 | 9 | 1 | 7 | 5 | 8 |
| 7 | 9 | 5 | 8 | 3 | 6 | 4 | 1 | 2 |
| 6 | 1 | 4 | 3 | 5 | 8 | 2 | 9 | 7 |
| 9 | 3 | 7 | 6 | 2 | 4 | 1 | 8 | 5 |
| 5 | 2 | 8 | 9 | 1 | 7 | 3 | 6 | 4 |



# 92వ ఆస్కార్ వేడుక వింతలు - విశేషాలు

## నేనో స్కాండ్రల్‌ని



**- వాకిన్ ఫీనెక్స్**

"నా జీవితంలో నేనో స్కాండ్రల్‌ని. చాలా సెల్ఫిష్‌గా ఉండేవాణ్ణి. కొన్నిసార్లు క్రూరంగానూ ప్రవర్తించా. నాతో పని చేయడం కష్టమే. కానీ, మీలో చాలామంది నాకు సెకండ్ ఛాన్స్ ఇచ్చారు. గతంలో చేసిన తప్పులను గుర్తుపెట్టుకోకుండా... ఒకరికి ఒకరు సపోర్ట్ చేసినప్పుడు మనం ఉత్తమ స్థితిలో ఉంటాం. పైకి రావడానికి ఒకరికి ఒకరు సహాయం చేయడం, ఎడ్యుకేట్ చేయడమే నిజమైన విముక్తి. సమాజంలో అదే ఉత్తమమైనది. జాత్యహంకారం, మానవ హక్కులు, జంతువుల హక్కులు, స్త్రీ-పురుష అసమానతకు వ్యతిరేకంగా... మనమంతా అన్యాయంపై పోరాడుతున్నాం. ఒక దేశం, జాతి, వ్యక్తికి అర్హత లేకుండా మరొకరిపై ఆధిపత్యం చెలాయించే, దోపిడీ చేసే హక్కుకు వ్యతిరేకతంగా పోరాడుతున్నాం. మనుషులుగా మనమంతా కలిసి మంచి మార్పును, వాతావరణాన్ని సృష్టించగలం"

**- ఆస్కార్ అందుకున్న సందర్భంగా ఉత్తమ నటుడు వాకిన్ ఫీనెక్స్**


హిల్దార్

## ఇదే తొలి ఆస్కార్ అవార్డు...

నటుడిగా వాకిన్ ఫీనెక్స్‌కి, సహాయనటిగా లారా డ్రెన్‌కి, దర్శకుడిగా బోంగ్ జోన్-హోకి, సంగీత దర్శకురాలు హిల్దార్‌కి, సహాయ నటుడిగా బ్రాడ్ పిట్‌కి!!


'పారాసైట్' చిత్ర బృందం

### తొలిసారి....

ఆంగ్లేతర చిత్రానికి('పారాసైట్')కి ఆస్కార్ వచ్చింది! 92ఏళ్ల ఆస్కార్ చరిత్రలో ఇదో సరికొత్త అధ్యాయం!! ఓ సౌత్ కొరియా చిత్రం నామినేట్ కావడమూ, నాలుగు అవార్డులు పొందడమూ ఇదే తొలిసారి!!



## అయ్యో... ఐరిష్‌మ్యాన్!

నెట్‌ఫ్లిక్స్ నిర్మించిన చిత్రాల్లో 'ది ఐరిష్ మ్యాన్'కి 10, 'మ్యారేజ్ స్టోరీ'కి 6, 'ది టు పోప్స్'కి 3 నామినేషన్లు దక్కాయి. ఇలా ఇతర చిత్రాలకూ వచ్చిన నామినేషన్లు కలుపుకుంటే 24. అందులో రెండు అవార్డులే వచ్చాయి. 'ది ఐరిష్ మ్యాన్'కి పది నామినేషన్లలో ఒక్క అవార్డూ రాలేదు. దర్శకుడు మార్టిన్ స్కోర్సెసె చిత్రానికి ఇలా జరగడం ఇది రెండోసారి. ఇంతకు ముందు అతడు దర్శకత్వం వహించిన 'గ్యాంగ్స్ ఆఫ్ న్యూయార్క్' (2002)కీ ఆస్కార్స్‌లో పది నామినేషన్లు దక్కాయి. అయితే... ఒక్క అవార్డూ రాలేదు. నెట్‌ఫ్లిక్స్‌తో పాటు ఆయనకూ ఈ ఏడాది ఆస్కార్స్ నిరాశ మిగిల్చాయి.

## నా పిల్లలకు అంకితం!

'వన్స్ అపాన్ ఎ హాలీవుడ్' చిత్రంలో నటనకు గాను బ్రాడ్‌పిట్ ఉత్తమ సహాయ నటుడిగా అవార్డు అందుకున్నారు. బ్రాడ్ పిట్‌కి తొలి ఆస్కార్ ఇది. ఆయనకు ఆరుగురు పిల్లలున్నారు. మాజీ భార్య, నటి ఏంజెలీనా జోలీ ద్వారా ముగ్గురికి జన్మనిచ్చారు. మరో ముగ్గుర్ని దత్తత తీసుకున్నారు.



"జీవితంలో వెనక్కి తిరిగి చూసుకునే అలవాటు నాకు లేదు. కానీ, ఇది (ఆస్కార్ ట్రోఫీ) చూసుకునేలా చేసింది. ఇది నా పిల్లల కోసం! నా ప్రతి పనినీ రంగులమయం చేశారు. నా పిల్లలను నేనెంతో ఆరాధిస్తారు"
**- బ్రాడ్ పిట్**

- అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే పురస్కార గ్రహీత టైకా వైయిటిటి... ఆస్కార్ ట్రోఫీని జాగ్రత్తగా ఎక్కడ దాచాలో తెలియక ముందున్న కుర్చీ కింద పెట్టారు. ఆ మూమెంట్‌ని నటి బ్రీ లార్సన్ వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. అంతే... క్షణాల్లో వైరల్ అయింది.

## బెస్ట్ బర్త్‌డే గిఫ్ట్!


లారా డెర్న్

బహుశా... లారా డెర్న్ జీవితంలో ఇదే అత్యుత్తమ పుట్టినరోజు అయ్యుంటుంది! ఫిబ్రవరి 10న (సోమవారం) ఆమె పుట్టినరోజు. అంతకు ముందు రోజు (అమెరికాలో ఫిబ్రవరి 9, ఆదివారం రాత్రి) ఆస్కార్స్ ప్రదానోత్సవం జరిగింది. 'మ్యారేజ్ స్టోరీ'లో నటనకు గాను 53ఏళ్ల లారా డ్రెన్ తొలిసారి ఆస్కార్ అవార్డు అందుకున్నారు. ఆమె తల్లితండ్రులు బ్రూస్ డెర్న్, డయాన్ ల్యాడ్... ఇద్దరూ యాక్టర్సే. ఆస్కార్స్ వేడుకకు తల్లి డయాన్‌తో కలిసి లారా వచ్చారు. జన్మనిచ్చిన తల్లి ముందు, పుట్టినరోజున జీవితంలో తొలిసారి ప్రతిష్టాత్మక ఆస్కార్ అందుకోవడం కంటే ఆనందం ఏముంటుంది?!

## మీకు తెలుసా?

- తొలిసారి 92 ఏళ్ల ఆస్కార్స్ చరిత్రలో ఒరిజినల్ స్కోర్స్‌లో నామినేట్ అయిన సినిమాల సంగీతాలను వినిపించే ఆర్కెస్ట్రాకి ఓ ఫీమేల్ కండక్టర్ ఈమర్ నూన్ (ఐరిష్ కంపోజర్) నేతృత్వం వహించారు.
- ఆస్కార్స్‌లో ఆసియాకు చెందిన దర్శకుడు అవార్డు అందుకోవడం ఇది రెండోసారి. బోంగ్ జోన్-హో కంటే ముందు 'బ్రోక్‌బ్యాక్ మౌంటైన్', 'లైఫ్ ఆఫ్ పై' చిత్రాలకు ఆంగ్ లీ రెండుసార్లు ఆస్కార్స్ అందుకున్నారు.
- ఆంగ్లేతర చిత్రంతో ఉత్తమ దర్శకుడు అవార్డు అందుకున్న రెండోవ్యక్తి బోంగ్ జోన్-హో. ఇంతకు ముందు మెక్సికన్ చిత్రం 'రోమా'కు ఆల్ఫోన్సో కుడ్‌వాన్ ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు.
- పదేళ్లలో తొమ్మిదిసార్లు అమెరికాయేతర దర్శకులే ఆస్కార్స్‌లో ఉత్తమ దర్శకుడిగా అవార్డులు అందుకున్నారు. ఓ దశాబ్దంలో ఇలా జరగడం అరుదైన విషయం.
- 'ది లయన్ కింగ్'లో 'కెన్ యు ఫీల్ ద లవ్ టునైట్'కు బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో ఎల్టన్ జాన్ ఆస్కార్ అందుకున్నారు. సుమారు 25 తర్వాత... మళ్లీ ఈ ఏడాది ఆయన జీవితంపై తీసిన బయోపిక్ 'ది రాకెట్ మ్యాన్'లో 'లవ్ మి ఎగైన్' పాటకు అవార్డు అందుకున్నారు. ఆ పాట రాసిన బెర్నీ తైపున్‌కి ఇది తొలి ఆస్కార్. 53 ఏళ్లుగా వీళ్లిద్దరూ కలిసి పాటలు కంపోజ్ చేస్తున్నారు.
- బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఓ మహిళ ఆస్కార్ అందుకోవడం ఇదే తొలిసారి. 'జోకర్'కి గాను హిల్దార్ ఆ ఘనత సాధించారు. సంగీత పరంగా చూసుకుంటే... ఆస్కార్ అందుకున్న మూడో మహిళ ఆమె. ఒరిజినల్ మ్యూజికల్/కామెడీ స్కోర్ విభాగంలో 'ఎమ్మా' (1996) చిత్రానికి రాచెల్ పోర్ట్‌మన్, 'ది ఫుల్ మాంటీ' (1997) చిత్రానికి అన్నే డూడ్లీ ఆస్కార్స్ అందుకున్నారు.













| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలరుకు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 40,979.62 | 12,031.50 | 40,738 | 46,225 | 71.30 | 54.07 |
| 162.23 | 66.85 | 72 (మేలిమి 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత)) | 5 | (10 పైసలు) | |



# హోండా డియో బీఎస్-6

ప్రారంభ ధర రూ.59,990

న్యూఢిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ).. బీఎస్-6 ప్రమాణాలతో రూపొందించిన 'డియో' స్కూటర్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ 110 సీసీ స్కూటర్ రెండు వేరియంట్ల (స్టాండర్డ్, డీలక్స్)లో లభించనుంది. స్టాండర్డ్ వేరియంట్ ధర రూ.59,990 కాగా, డీలక్స్ వేరియంట్ ధర రూ.63,340 (ఢిల్లీ షోరూమ్). హెచ్ఎంఎస్ఐ ఇప్పటికే 33 లక్షలకు పైగా డియో స్కూటర్లను విక్రయించింది. దేశంలో అత్యధికంగా అమ్ముడవుతున్న స్కూటర్లలో ఇదొకటని, భారత్ నుంచి ఎగుమతవుతున్న స్కూటర్లలో దీనిదే అగ్రస్థానమని కంపెనీ పేర్కొంది. వచ్చేవారం నుంచి డీలర్ల వద్ద ఈ స్కూటర్ అందుబాటులో ఉంటుందని హెచ్ఎంఎస్ఐ వెల్లడించింది.

## ఇక అన్నీ బీఎస్-6 వెర్షన్లే: వోల్వో

ఇకపై దేశంలో విక్రయించే అన్ని మోడళ్ల కార్లను బీఎస్-6 వెర్షన్లలో అందుబాటులోకి తేనున్నట్లు వోల్వో కార్స్ ఇండియా ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి (మార్చి 31) వరకు బీఎస్-6 సర్టిఫైడ్ మోడళ్ల ధరను పెంచబోమని కంపెనీ తెలిపింది.



# ఎంఎఫ్ ఆస్తులు.. రూ.27.85 లక్షల కోట్లు

## జనవరిలో గరిష్ఠ స్థాయికి చేరిక

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థల పథకాల్లో పెట్టుబడులు జోరు మళ్లీ ఊపందుకుంది. గత ఏడాది డిసెంబరు నెలలో రూ.61,810 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న మదుపరులు ఈ సంవత్సరం జనవరిలో మాత్రం రూ.1.2 లక్షల కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. దీంతో గత ఏడాది డిసెంబరులో రూ.26.54 లక్షల కోట్లున్న ఈ సంస్థల నిర్వహణలోని పెట్టుబడు(ఏయూఎం)లు జనవరిలో అయిదు శాతం వృద్ధి రేటుతో రూ.28.75 లక్షల కోట్లకు చేరాయి. ఎంఎఫ్‌ల నిర్వహణలో పెట్టుబడులు గతంలో ఎన్నడు ఇంత గరిష్ఠ స్థాయికి చేరలేదని అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (అంఫి) పేర్కొంది.

### రుణ పథకాలదే అగ్రస్థానం

జనవరిలో పరిశ్రమ సమీకరించిన రూ.1.2 లక్షల కోట్ల నిధుల్లో రూ.1.09 లక్షల కోట్లు రుణ పథకాల ద్వారానే సమకూరాయి. ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల ద్వారా మరో రూ.7,547 కోట్ల నికర పెట్టుబడులు వచ్చాయి. క్రమానుగత పెట్టుబడి పథకాల (సిప్) ద్వారా సమకూరే పెట్టుబడులూ జనవరిలో రికార్డు స్థాయిలో రూ.8,532 కోట్లకు చేరాయి. దీంతో సిప్ నిర్వహణలోని ఎంఎఫ్‌ల పెట్టుబడులూ రూ.3.25 లక్షల కోట్ల రికార్డు స్థాయికి పెరిగాయి.

## మార్కెట్‌ను వెంటాడిన భయాలు

కరోనా వైరస్ భయాలు వరుసగా రెండో రోజూ భారత స్టాక్ మార్కెట్‌ను వెంటాడాయి. దీంతో సోమవారం సెన్సెక్స్ 162.23 పాయింట్ల నష్టంతో 40,979.62 వద్ద, 66.85 పాయింట్ల నష్టంతో నిఫ్టీ 12,031.50 వద్ద ముగిశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ ఒక దశలో 373 పాయింట్లు అటుఇటుగా ఊగిసలాడింది. ఆటో, మెటల్ కంపెనీల షేర్లలో అమ్మకాలు హోరెత్తాయి. సెన్సెక్స్ ప్యాక్‌లో ఎం అండ్ ఎం కంపెనీ షేర్లు అత్యధికంగా 7.16 శాతం నష్టంతో రూ.528.05 వద్ద ముగిశాయి. కాగా, సోమవారం 'డీమార్ట్' మార్కెట్ క్యాప్ రూ.1.5 లక్షల కోట్లు దాటింది.



# 'కరోనా'తో కటకట!

## చైనా నుంచి ఆటో విడిభాగాల సరఫరాకు ఇబ్బందే: సియామ్

గ్రేటర్ నోయిడా: చైనాను కుదిపేస్తున్న కరోనా వైరస్.. భారత ఆటో రంగ వర్గాల్లోనూ గుబులు పెంచింది. ఈ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో చైనా నుంచి వాహన విడిభాగాల సరఫరాకు ఆటంకం ఏర్పడవచ్చని పరిశ్రమ ప్రతినిధులు ఆందోళన చెందుతున్నారు. చైనా కొత్త ఏడాది ఉత్సవ సెలవులు కొద్ది రోజుల్లో ముగియనున్నాయని, సెలవుల తర్వాత అక్కడి ప్లాంట్లలో ఉత్పత్తి పునఃప్రారంభమయ్యాక సరఫరాపై పూర్తి స్పష్టత వస్తుందని భారత వాహన తయారీదారుల సంఘం (సియామ్) పేర్కొంది. చైనా నుంచి విడిభాగాల సరఫరాకు ఆటంకాలేమైనా ఏర్పడే అవకాశాలున్నాయా..? దేశీయంగా వాహన తయారీ, బీఎస్-6 పరివర్తనంపై ఏమేర ప్రభావం పడే అవకాశం ఉంది..? అనే వివరాల కోసం తమ సభ్య కంపెనీల నుంచి డేటా సేకరిస్తున్నట్లు తెలిపింది. గత వారం దేశంలో జరిగిన ఆటో ఎక్స్‌పో, ఆటో కాంపోనెంట్స్ ఎక్స్‌పోలపైనా కరోనా వైరస్ ప్రభావం చూపింది. పలు చైనా కంపెనీల ప్రతినిధులు ఈ ఎక్స్‌పోకు హాజరు కాలేకపోయారు. చైనాలోని అతిపెద్ద ఎస్‌యూవీ తయారీదారైన గ్రేట్ వాల్ మోటార్స్.. భారత్‌లో 100 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఈ ఎక్స్‌పోలో ప్రకటించింది. కానీ, కంపెనీ యాజమాన్య బృందం మాత్రం భారత్‌కు రాలేదు. భారత్‌లోని కంపెనీ ప్రతినిధుల సాయంతోనే ఆటో షోలో తన వాహనాలను ప్రదర్శించింది. హైమా బ్రాండ్‌నేమ్‌తో వాహనాలను విక్రయిస్తోన్న ఎఫ్ఏడబ్ల్యూ గ్రూపు యాజమాన్యం కూడా కరోనా కారణంగా భారత పర్యటనను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. దాంతో ఈ కంపెనీ ఆటో షోలో నిర్వహించాల్సిన మీడియా సమావేశాన్ని రద్దు చేసుకుంది.



బీఎస్-6 ప్రమాణాల అమలు గడువును పొడిగించాలని సుప్రీం కోర్టును ఆశ్రయించే విషయమై ఇప్పుడే ఏం వ్యాఖ్యానించలేం. ఈ విషయంలో సభ్య కంపెనీల నిర్ణయం కోసం వేచి చూస్తాం. మరో 2-3 రోజుల్లో కొంత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. సభ్య కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నాం. మరింత డేటా చేతికొచ్చాక భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం.

**- రాజేశ్ మీనన్, సియామ్ డైరెక్టర్ జనరల్**



కరోనా వైరస్ ప్రభావంపై ఇప్పుడే ఏం చెప్పలేం. ఎప్పుడు అదుపులోకి వస్తుంది, చైనా నుంచి ఆటో విడిభాగాల సరఫరాపై ఏమేర ప్రభావం చూపనుందనే అంశాలపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. దీని తీవ్రతపై ఇంకా ఓ అంచనాకు రావాల్సి ఉంది.

**- కెనిచి అయుకవా, మారుతి సుజుకీ ఎండీ, సీఈఓ**



చైనాలోని ప్లాంట్లు తిరిగి తెరుచుకుని, కార్మికులు తిరిగి విధుల్లో వచ్చాక గానీ ఆటో విడిభాగాల సరఫరాపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. వచ్చే వారంలో ప్లాంట్లు మళ్లీ తెరుచుకునే అవకాశం ఉంది. ప్లాంట్లు తెరుచుకున్నా కార్మికులు విధులకు హాజరు కాకపోతే ప్రపంచవ్యాప్తంగా సమస్యను ఎదుర్కొనాల్సి రావచ్చు.

**- గుంటెర్ బషెక్, టాటా మోటార్స్ సీఈఓ, ఎండీ**

## వాహన విక్రయాల్లో 6.2% క్షీణత



గత నెలలో దేశీయంగా ప్యాసింజర్ వాహనాల విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 6.2 శాతం తగ్గాయి. వాహన కొనుగోలు, నిర్వహణ వ్యయం పెరగడంతోపాటు దేశ ఆర్థిక వృద్ధి రేటు మందగించడంతో వాహనాలకు డిమాండ్ కుంటుపడిందని భారత వాహన తయారీదారుల సంఘం (సియామ్) పేర్కొంది. 2020 జనవరిలో దేశీయంగా 2,62,714 ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. గత ఏడాది అదే కాలానికి విక్రయాలు 2,80,091 యూనిట్లుగా నమోదయ్యాయి. 2019 డిసెంబరులోనూ వెహికిల్ సేల్స్ 8.1 శాతం తగ్గి 1,64,793 యూనిట్లకు పరిమితం అయ్యాయి. గత నెలలో అన్ని విభాగాల వాహనాల విక్రయాలు 13.83 శాతం తగ్గి 17,39,975 యూనిట్లుగా నమోదయ్యాయి. అందులో టూవీలర్ సేల్స్ 16.06 శాతం తగ్గుదలతో 13,41,005 యూనిట్లు, వాణిజ్య వాహనాల అమ్మకాలు 14.04 శాతం తగ్గి 75,289 యూనిట్లకు పరిమితమయ్యాయి.

## మిగతా రంగాలదీ అదే సమస్య



ఆటోమొబైల్ ఒక్కటే కాదు, మిగతా రంగాల కంపెనీలూ సరఫరా సమస్యలపై ఆందోళన చెందుతున్నాయి. ముఖ్యంగా మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, భారీ యంత్రాలు, రసాయనాలు, ప్లాస్టిక్ ఉత్పత్తుల కంపెనీలపై అధిక ప్రభావం పడనుంది. చైనాలో కొత్త ఏడాది సంబరాల నేపథ్యంలో కార్మికులు సెలవులపై వెళ్లడంతో గత నెల ద్వితీయార్థం నుంచే ఆ దేశంలో పారిశ్రామికోత్పత్తి తగ్గుతూ వచ్చింది. దాంతో భారత కంపెనీలు ముందు జాగ్రత్త చర్యగా గతనెలలో చైనా నుంచి పెద్దమొత్తాల్లో ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నాయి. ఇప్పుడా నిల్వలు అడుగంటుతున్నాయి. కరోనా కలకలంతో వూహాన్‌తోపాటు పలు పారిశ్రామిక నగరాల్లోని ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. వచ్చే వారంతో సెలవులు ముగియనున్నప్పటికీ, ప్లాంట్లు మళ్లీ తెరుచుకుంటాయా..? ఉత్పత్తి, సరఫరా మళ్లీ మొదలవుతుందా..? అనే విషయాల్లో అనిశ్చితి నెలకొంది. ఇప్పటికే చైనాలోని చాలా ఫ్యాక్టరీలు పునః ప్రారంభాన్ని వచ్చేనెలకు వాయిదా వేసుకున్నాయి. మార్చిలోనైనా తెరుచుకుంటాయన్న స్పష్టత లేదు. చైనా నుంచి ముడి సరుకులు, విడిభాగాల సరఫరా నిలిచిపోతే భారత్‌లోనూ పలు ప్లాంట్లలో ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది.

| 2018-19లో చైనా నుంచి దిగుమతులు (కోట్ల డాలర్లు) | |
|---|---|
| 8,700 | మొత్తం ఉత్పత్తుల విలువ |
| 2,060 | ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు |
| 1,340 | యంత్రాలు |
| 860 | ఆర్గానిక్ రసాయనాలు |
| 270 | ప్లాస్టిక్ ఉత్పత్తులు |

## ఈ వారంలో బ్యాంకుల విలీన నోటిఫికేషన్

కోల్‌కతా: దేశంలోని 10 ప్రభుత్వ రంగ బ్యాంకులను 4 మెగా బ్యాంకులుగా మార్చేందుకు సంబంధించిన విలీన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఈ వారంలో జారీ చేయవచ్చంటున్నారు. ఈ నోటిఫికేషన్ జారీ చేయగానే ఆయా బ్యాంకుల డైరెక్టర్ల బోర్డులు సమావేశమై విలీనాలకు తుది అనుమతులు ఇవ్వడంతో పాటు అత్యంత కీలకమైన స్వాప్ నిష్పత్తిని ప్రకటిస్తాయి. బ్యాంకుల అర్ధ సంవత్సరపు ఫలితాల ఆధారంగా విలీనంకానున్న ఒక్కో బ్యాంకు విలువను నిర్ణయించినట్టు బ్యాంకు అధికారి ఒకరు తెలిపారు. దేశంలోని బ్యాంకుల భారీ విలీనాల్లో ఒకటైన ఈ ప్రక్రియ కింద పీఎన్‌బీలో ఓబీసీ, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా; యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆంధ్రాబ్యాంక్, కార్పొరేషన్ బ్యాంకు విలీనం అవుతాయి. అలాగే కెనరా బ్యాంకు, సిండికేట్ బ్యాంకు; ఇండియన్ బ్యాంకు, అలహాబాద్ బ్యాంకు విలీనం కానున్నాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ విలీనాలు అమల్లోకి రానున్నాయంటున్నారు.

## గ్రీస్ విమానాశ్రయ పనులు షురూ: జీఎంఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్రీస్‌లోని క్రీట్ వద్ద హెరాక్లియన్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణాన్ని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ప్రారంభించింది. గ్రీస్ ప్రధాన మంత్రి కైరియాకోస్ మిత్సోటకిస్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విమానాశ్రయం డిజైన్, నిధుల సమీకరణ, నిర్మాణం, నిర్వహణకు కన్సెషన్ కమిన్స్‌మెంట్ డేట్ (సీసీడీ) సాధించినట్లు జీఎంఆర్ గ్రూప్ (ఎనర్జీ, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్) చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. 2019 ఫిబ్రవరిలో గ్రీస్ భాగస్వామి గీక్ టెర్నాతో కలిసి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ (జీఏఎల్) కన్సెషన్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం 35 ఏళ్ల అమలులో ఉంటుంది. విమానాశ్రయం మొదటి దశ నిర్మాణం అయిదేళ్లలో పూర్తవుతుంది. దాదాపు రూ.3,900 కోట్లతో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. యూరోప్‌లోకి ప్రవేశించడంతోపాటు యూరోప్‌లో విమానాశ్రయాన్ని నిర్వహించడానికి బిడ్‌ను దాఖలు చేసి గెలిచిన తొలి ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్ జీఎంఆరే. గ్రీస్‌కు ప్రతి ఏడాది 3.3 కోట్ల మంది విదేశీ పర్యాటకులు వస్తారు. క్రీట్‌కు అత్యధిక పర్యాటకులు విచ్చేస్తారు. హెరాక్లియన్ ఎయిర్‌పోర్ట్ గ్రీస్‌లో రెండో అతిపెద్ద విమానాశ్రయం. రుణాలు లేకుండా.. ఈక్విటీ, ప్రభుత్వ గ్రాంట్ నిధులతో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు.

## కేరళ వరద బాధితులకు 'జోయాలుక్కాస్' చేయూత

### రూ.15 కోట్లతో 250 ఇళ్లు నిర్మించి అందజేసిన సంస్థ



హైదరాబాద్: జోయాలుక్కాస్ గ్రూప్‌నకు చెందిన జోయాలుక్కాస్ ఫౌండేషన్.. కేరళ వరద బాధితుల సహాయార్థం జోయ్ హోమ్స్ ప్రాజెక్టును చేపట్టింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.15 కోట్లతో 250 ఇళ్లు నిర్మించి, వరదల్లో నిలువ నీడ కోల్పోయిన బాధితులకు అందజేసింది. ఈ గృహాల లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేసిన రెండో గెట్ టుగెదర్ కార్యక్రమానికి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం 160 బాధిత కుటుంబాలు తాము కట్టించిన కొత్త ఇళ్లలో నివసిస్తున్నారని, మిగతా గృహాలను త్వరలోనే అందజేస్తామని జోయాలుక్కాస్ గ్రూపు చైర్మన్, ఎండీ జోయ్ అలుక్కాస్ తెలిపారు.

జోయ్ హోమ్స్ ప్రాజెక్టు లబ్ధిదారుల గెట్ టుగెదర్ ప్రారంభ కార్యక్రమంలో కేరళ సీఎం పినరయి విజయన్, జోయాలుక్కాస్ సీఎండీ జోయ్ అలుక్కాస్ తదితరులు

## ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 10వ తేదీకి.. | | విజయవాడ | 365 |
| హైదరాబాద్ | 350 | విశాఖపట్నం | 400 |
| 11వ తేదీకి.. | | వరంగల్ | 353 |
| చిత్తూరు | 398 | డజను గుడ్లు రూ. 60 | |
| గోదావరి | 365 | | |

## ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 65 | విజయవాడ | 70 |
| వరంగల్ | 65 | గుంటూరు | 70 |
| మహబూబ్‌నగర్ | 65 | ఒంగోలు | 72 |
| కరీంనగర్ | 67 | చిత్తూరు | 72 |
| కర్నూలు | 65 | నెల్లూరు | 72 |
| విశాఖపట్నం | 60 | అనంతపురం | 64 |
| గోదావరి | 64 | | |

## శ్రీసిటీలో ఇసుజు ప్లాంట్ విస్తరణ

### రూ.400 కోట్లతో ప్రెస్ షాప్, ఇంజన్ అసెంబ్లీ యూనిట్ ఏర్పాటు

తడ : ఆంధ్రప్రదేశ్, శ్రీసిటీలో రెండో దశ ప్లాంట్ కార్యకలాపాలను ప్రారంభించినట్లు యుటిలిటీ వాహన తయారీదారు ఇసుజు మోటార్స్ వెల్లడించింది. కార్యకలాపాల విస్తరణలో భాగంగా రూ.400 కోట్ల పెట్టుబడితో నెలకొల్పిన కొత్త ప్రెస్ షాప్ ఫెసిలిటీ, ఇంజన్ అసెంబ్లీ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపింది. సోమవారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో జపాన్ కౌన్సిల్ జనరల్ కోజిరోయఖియామా, ఇసుజు మోటార్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టోరునకాట, మిత్సుబిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, సీఈవో ఇవారో టోఈడీ, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి రెండో దశ ప్లాంట్ కార్యకలాపాలను ప్రారంభించారు. ప్రెస్ షాప్, ఇంజన్ అసెంబ్లీ ద్వారా ఇసుజు తయారీ కార్యక్రమాలు మరింత బలోపేతం కానున్నాయని జపాన్ కౌన్సిల్ జనరల్ కోజిరోయఖియామా అన్నారు. అత్యుత్తమ శ్రేణి ఉత్పత్తులు, సేవలందించేందుకు ఇసుజు ఎప్పుడూ ప్రయత్నిస్తున్నదని సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టోరునకాట అన్నారు. ప్లాంట్ విస్తరణతో అంతర్జాతీయ మార్కెట్లో సామర్థ్యాన్ని విస్తరించేందుకు దోహదపడనుందని తెలిపారు.



## బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 40,960 | --- | 41,970 | 40,900 | 40,860 |
| క్రితం ముగింపు | 40,610 | 41,470 | 41,920 | 41,050 | 40,930 |
| 22 క్యారెట్లు | 38,990 | --- | 38,610 | 37,970 | 38,910 |
| క్రితం ముగింపు | 38,700 | 38,200 | 38,560 | 38,060 | 38,980 |
| వెండి (కిలో) | 46,200 | --- | 47,600 | 47,400 | 50,100 |
| క్రితం ముగింపు | 46,100 | 47,700 | 47,600 | 47,500 | 49,900 |

## క్యూ3 ఫలితాలు

**యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా :** మొండి బకాయిల ప్రొవిజనింగ్ తగ్గడం యూబీఐకి కలిసివచ్చింది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో బ్యాంకు లాభం రూ.574.58 కోట్లకు పెరిగింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ.153.21 కోట్లు. ఆదాయం రూ.9572.58 కోట్ల నుంచి రూ.10741.21 కోట్లకు పెరిగింది. స్థూల ఎన్‌పీఏలు 14.86 శాతానికి, నికర ఎన్‌పీఏలు 6.99 శాతానికి తగ్గాయి. మొండి బకాయిల కోసం కేటాయింపులు గత ఏడాది క్యూ3తో పోల్చితే రూ.2139.13 కోట్ల నుంచి రూ.1569.90 కోట్లకు తగ్గాయి.

**ఐఓబీ :** మొండి బకాయిలకు భారీ పరిమాణంలో ప్రొవిజనింగ్ చేయాల్సి రావడంతో డిసెంబరు త్రైమాసికంలో నష్టం భారీగా పెరిగిపోయి రూ.346.02 కోట్ల నుంచి రూ.6075.49 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం కూడా రూ.5688.59 కోట్ల నుంచి రూ.5197.94 కోట్లకు తగ్గింది. ఈ త్రైమాసికంలో మొత్తం రూ.6663.94 కోట్లు ఎన్‌పీఏలకు ప్రొవిజనింగ్ చేయాల్సి వచ్చిందని తెలిపింది.

**పిట్టీ ఇంజనీరింగ్ :** డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.120.44 కోట్ల ఆదాయంపై రూ.4.05 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం ఆదాయం రూ.165.68 కోట్లు, లాభం రూ.5.08 కోట్లతో పోలిస్తే రెండూ తగ్గాయి. కాగా రూ.190 కోట్ల తో చేపట్టిన విస్తరణ ప్రణాళికకు బోర్డు ఆమోదం తెలిపింది.

## మైహోమ్ 'తర్కష్య' ప్రారంభం

**నాలుగు టవర్లు.. 660 గృహాలు**



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చిన జీయర్ స్వామి, మైహోమ్ గ్రూప్ చైర్మన్ రామేశ్వర్ రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని కోకాపేటలో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును మైహోమ్ కన్‌స్ట్రక్షన్స్ ప్రారంభించింది. 5.82 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న 'మైహోమ్ తర్కష్య'లో నాలుగు బ్లాక్‌లు ఉంటాయని.. ఒక్కో బ్లాక్‌లో జీ+32 అంతస్తులు ఉంటాయని కంపెనీ వెల్లడించింది. ఒక్కొక్కటి 1,957, 2,235 చదరపు అడుగుల విస్తీర్ణంలో మొత్తం 660 ట్రిపుల్ బెడ్ రూమ్ గృహాలు ఉంటాయి. అత్యాధునిక జిమ్, సూపర్ మార్కెట్, ఏసీ అతిథి గదులు, క్రెష్, టెన్నిస్, బ్యాడ్మింటన్ కోర్టులు, స్పా వంటి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు మైహోమ్ తెలిపింది. ప్రాజెక్టు ప్రారంభం రోజునే 50 శాతం పైగా యూనిట్లు అమ్ముడయ్యాయని పేర్కొంది. తర్కష్య ప్రాజెక్టుకు శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి శంకుస్థాపన చేశారు.

## 8 స్టార్టప్‌లకు రూ.44 లక్షల నిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వరంగల్‌లోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ఎస్ఆర్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ (ఎస్ఆర్ఐఎక్స్) 8 స్టార్టప్‌లకు గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద రూ.44 లక్షలు అందజేసింది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ (ఇన్నోవేషన్) ఏకే గార్గ్ ఆధ్వర్యంలో టైడ్ 2.0 పథకంలో భాగంగా ఈ మొత్తాన్ని అందజేశారు. ఆరు స్టార్టప్‌లలో సహ వ్యవస్థాపకులుగా మహిళలు ఉన్నారని ఎస్ఆర్ ఇన్నోవేషన్ ఎక్స్ఛేంజ్ సీఈఓ శ్రీదేవీ దేవిరెడ్డి తెలిపారు. నిధుల కోసం 80 స్టార్టప్ కంపెనీల నుంచి దరఖాస్తులు రాగా.. ఎనిమిదింటిని ఎంపిక చేశారు. నాలుగు స్టార్టప్‌లకు ఒక్కొక్క దానికి రూ.4 లక్షలు, మిగిలిన నాలుగింటికి ఒక్కో దానికి రూ.7 లక్షల చొప్పున అందజేశారు.

## డాక్టర్ కాపర్ బ్రాండ్‌కు అవార్డు




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): 'డాక్టర్ కాపర్'కు ఆసియాలోనే అత్యుత్తమ బ్రాండ్‌గా గుర్తింపు లభించింది. డాక్టర్ కాపర్ పేరుతో ఎంఎస్ఆర్ ఇండియా రాగి బాటిళ్లను విక్రయిస్తోంది. థాయ్‌లాండ్‌లో జరిగిన యునైటెడ్ రీసెర్చ్ అండ్ ఏషియన్ బిజినెస్ అండ్ సోషల్ ఫోరమ్ 2020లో ఆసియాలోనే అత్యుత్తమ బ్రాండ్స్ 2019-20 అవార్డును అందుకున్నట్లు ఎంఎ స్ఆర్ ఇండియా సీఈఓ ఎం మల్లా రెడ్డి తెలిపారు. డాక్టర్ కాపర్ ఈ అవార్డును అందుకోవడం వరుసగా ఇది రెండోసారి. మల్లారెడ్డికి యంగ్ ఆసియన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అవార్డు లభించింది.

## నిరోధం 12080

**టెక్ వ్యూ**

మంగళవారం స్థాయిలివే...

**నిరోధం: 12080 మద్దతు: 11960**

నిఫ్టీ రియాక్షన్‌లోనే ప్రారంభమై మానసిక అవధి 12000 కన్నా దిగజారింది. చివరి సెషన్‌లో రికవరీ సాధించి ఆ స్థాయి కన్నా పైనే క్లోజయినా 66 పాయింట్లు నష్టపోయింది. ర్యాలీ అనంతరం గత రెండు రోజుల్లో మైనర్ కరెక్షన్ ట్రెండ్ కనిపిస్తోంది. మరోసారి 20, 50 డీఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కొనసాగాలంటే రానున్న కొద్ది రోజుల్లో ఆ సూచీలకన్నా పైన నిలదొక్కుకోవాలి. 12000 వద్ద బలమైన కన్సాలిడేషన్ అవసరం.

◆ మైనర్ ఇంట్రాడే నిరోధం 12080. ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. స్వల్పకాలిక ప్రధాన నిరోధం 12150.

◆ మైనర్ ఇంట్రాడే మద్దతు స్థాయి 11960 కన్నా దిగజారితే మరింత బలహీనత ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 11900 కన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్‌లో ప్రవేశిస్తుంది.

■ వి.సుందర్ రాజా

## మిడ్ సెషన్ మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** మాఘ బహుళ విదియ
**నక్షత్రం :** పుబ్బ
**అప్రమత్తం:** మృగశిర, చిత్త, ధనిష్ఠ నక్షత్ర జాతకులు, కన్య, మకర రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 2.26**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ నిలకడగా ప్రారంభమై 12 గంటల వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 2 గంటల వరకు మెరుగ్గా నిలిచి తదుపరి ముగింపు వరకు నిలకడ/నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 12 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 2 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12070, 12105**

**మద్దతు స్థాయిలు : 11990, 11955**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

# 300 ఏళ్ల కిందటి సొరంగం

**» ఇంటి నిర్మాణానికి తవ్వకాలు జరుపుతుండగా వెలుగులోకి**



కోల్‌కతా, ఫిబ్రవరి 10 : అక్కడ ఇంటి నిర్మాణం కోసం తవ్వకాలు జరుగుతున్నాయి.. కూలీలంతా పనుల్లో నిమగ్నమయ్యారు.. ఈక్రమంలో ఓ చోట గునపం దింపగానే నేల ఒక్కసారిగా కుంగిపోయింది. తవ్వకుండానే మట్టిదిబ్బలు నేలలోకి జారిపోయాయి. దీన్ని చూసినవారంతా భూకంపం వస్తోందా అని భయకంపితులయ్యారు. ధైర్యం చేసుకొని దగ్గరకు వచ్చిచూస్తే గానీ అక్కడ భూగర్భ సొరంగం ఉందనే విషయం వారికి తెలియలేదు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు బుర్ద్వాన్ జిల్లా మహత గ్రామంలో చోటుచేసుకుంది. జియారుల్ మలిక్ అనే వ్యక్తి ఇంటిని కట్టుకునేందుకు భూమిని తవ్వుతుండగా సొరంగం బయల్పడింది. అందులో గుప్తనిధులు ఉండొచ్చనే పుకార్లు చక్కర్లు కొట్టడంతో పరిసరాల్లోని ఐదారు గ్రామాల ప్రజలు క్యూ కట్టారు. ఆ సొరంగం 300 ఏళ్ల కిందటిది అయి ఉండొచ్చని చెబుతున్నారు.



దేశంలో తొలిసారి ఓ కుక్కకు పేస్‌మేకర్ ఇంప్లాంట్ సర్జరీ చేశారు. కొకర్ స్పానియల్ జాతికి చెందిన ఖుషీ వయసు ఏడున్నరేళ్లు. ఆ కుక్క గుండె సమస్యతోనూ బాధపడుతోందని ఢిల్లీలోని మ్యాక్స్ వెట్స్ ఆస్పత్రి వైద్యులు గుర్తించారు. డిసెంబరు 15న 'పేస్‌మేకర్'ను విజయవంతంగా అమర్చారు. ఇప్పుడు ఆ శునకం ఆరోగ్యంగా ఉందని వైద్యులు చెప్పారు.

# 'సోలార్ ఆర్బిటర్' ప్రయోగం విజయవంతం

**సూర్యుడి ధ్రువాల ఫొటోలు తీసి పంపనున్న వ్యోమనౌక.. ప్రాజెక్టు వ్యయం రూ.10వేల కోట్లు**

వాషింగ్టన్, ఫిబ్రవరి 10 : యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ) సంయుక్త భాగస్వామ్యంతో 'సోలార్ ఆర్బిటర్' అనే వ్యోమనౌకను నాసా సోమవారం విజయవంతంగా ప్రయోగించింది. అమెరికాలోని ఫ్లోరిడాలో ఉన్న కేప్ కెనవెరల్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ లాంచ్‌ప్యాడ్ నుంచి మెరుపు వేగంతో 'సోలార్ ఆర్బిటర్' నింగిలోకి దూసుకెళ్లింది. ఇది నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశించిన తర్వాత.. ప్రపంచంలోనే తొలిసారిగా సూర్యుడి ధ్రువాల ఫొటోలను తీసి నాసాకు పంపించనుంది. నాసా ఏడాదిన్నర క్రితం ప్రయోగించిన 'పార్కర్ సోలార్ ప్రోబ్' అనే రోబోటిక్ వ్యోమనౌక కార్యకలాపాలకు ఇది చేదోడుగా నిలువనుంది. 2018 ఆగస్టు 12న తన ప్రయాణాన్ని ప్రారంభించిన పార్కర్ సోలార్ ప్రోబ్ 2025 చివరికల్లా సూర్యుడికి 60 లక్షల కిలోమీటర్ల సమీపానికి చేరుకోనుంది. అక్కడే తిరుగుతూ సౌర తుఫానులు సంభవించే అవకాశాలుంటే గుర్తించి భూమికి ఎప్పటికప్పుడు హెచ్చరికలు పంపుతుంది. ఈక్రమంలో 'సోలార్ ఆర్బిటర్' దానితో జతకట్టి సాంకేతిక సహకారం అందిస్తుంది.



కేప్ కెనవెరల్ నుంచి దూసుకెళ్తున్న సోలార్ ఆర్బిటర్

# ఆధార్ ఉంటేనే అంత్యక్రియలు

**» స్పష్టంచేసిన శ్మశానవాటిక నిర్వాహకులు**

**» ఏడుపు మాని తెల్లబోయిన కుటుంబసభ్యులు**

**» బెంగళూరు శ్మశానవాటికలో ఘటన**




బెంగళూరు, ఫిబ్రవరి 10: జీవితం క్షణభంగురం.. మరణం ఎప్పుడు సంభవిస్తుందో తెలియదు. ఎందుకైనా మంచిది. ఆధార్ కార్డును ఎప్పుడూ జేబులోనో, హ్యాండ్‌బ్యాగ్‌లోనో పెట్టుకుంటే మంచిది. ఆ విషాద సమయంలో కుటుంబసభ్యులు, మన ఆధార్ కార్డును వెతుకులాడే స్థితిలో ఉండరు కదా! ఇదంతా ఎందుకంటారా? మృతుల ఒరిజినల్ ఆధార్ కార్డును చూపితే తప్ప అంత్యక్రియలు నిర్వహించేది లేదని బెంగళూరులోని ఓ స్మశానవాటిక నిర్వాహకులు తేల్చి చెప్పారు. మృతదేహాన్ని అక్కడికి తెచ్చి.. పాడె మీద నుంచి దించి అంత్యక్రియలకు సిద్ధం చేస్తున్న దశలో 'ఏదీ.. చనిపోయిన ఆవిడ ఆధార్ కార్డును చూపండి'? అని నిర్వాహకులు అడగడంతో ఆమె కుటుంబసభ్యులు.. ఏడుపు మానేసి తెల్లబోయారు. బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బీబీఎంపీ) పరిధిలో నివాసం ఉంటున్న కె. రాజేశ్ (పేరు మార్చాం)కు ఈ అనుభవం ఎదురైంది. ఆయన 75ఏళ్ల అత్త, వారం క్రితం చనిపోయింది. అంత్యక్రియల కోసం సుమనహళ్లి స్మశానవాటికకు తీసుకెళ్లారు. మృతురాలి ఒరిజినల్ అధార్ కార్డును చూపెట్టాల్సిందేనని నిర్వాహకులు చెప్పడంతో రాజేశ్ కుటుంబసభ్యులు కంగుతిన్నారు. ఇంటికి వెళ్లి ఆధార్‌ను తెద్దామనుకున్నా అదెక్కడో పోయింది. ఈ-ఆధార్ తీసుకుందామంటే, లింక్ ఉన్న మొబైల్ నంబరు పనిచేయడం లేదు. ఇదంతా నిర్వాహకులకు వివరించినా 'ఊహూ.. ఆధార్ కావాల్సిందే' అని స్పష్టం చేశారు. చివరికి ఎలాగో అలా మృతురాలి ఫోన్ నంబరును యాక్టివేట్ చేయించి, ఈ-ఆధార్ కార్డు సంపాదించి.. దాన్ని శ్మశానవాటిక నిర్వాహకులకు చూపించి అంత్యక్రియలు జరిపించారు. ఆధార్ కార్డు ఉంటేనే అంత్యక్రియలకు అనుమతిస్తామని బీబీఎంపీ అధికారులు చెబుతున్నా.. ప్రజల్లో మాత్రం వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

# చైనా 'జీవాయుధం' వెనుక అమెరికన్ శాస్త్రవేత్త!



**» నానో సైంటిస్టు చార్లెస్ లీబర్ అరెస్టు.. పూచీకత్తుపై బెయిల్**

**» హార్వర్డ్ వర్సిటీలో పనిచేస్తున్న లీబర్.. చైనాకు సహకారం**

**» వుహాన్ వర్సిటీలో ల్యాబ్ నెలకొల్పేందుకు అంగీకారం**

**» ఎఫ్‌బీఐ ఛార్జిషీటు.. ఇద్దరు రిసెర్చ్ విద్యార్థులూ అరెస్టు**

**» ఇందులో ఒకరిది చైనా సైన్యంలో లెఫ్టినెంట్ హోదా**



శాస్త్రవేత్త చార్లెస్ లీబర్

మసాచుసెట్స్, ఫిబ్రవరి 10: కరోనా వైరస్ వ్యాప్తికి కారణంగా అనుమానిస్తున్న జీవాయుధ తయారీ వెనుక ఉన్నది ఓ అమెరికన్ శాస్త్రవేత్తా..? ఈ పరిశోధనలో చైనా నుంచి ఆర్థిక సాయం పొందుతూ, సహకరిస్తున్నది ఆయనేనా..? అమెరికాలో సంభవించిన కొన్ని పరిణామాలు, చైనా నుంచి వెలువడ్డ కొన్ని కథనాలు ఈ అనుమానాన్ని మరింత బలపడేట్లు చేస్తున్నాయి. నిపుణుల అంచనా ప్రకారం... చార్లెస్ లీబర్ అనే ఆ శాస్త్రవేత్త వుహాన్ విశ్వవిద్యాలయంలో ఓ జీవ-రసాయన ల్యాబ్‌ను నెలకొల్పి - జీవాయుధాల రూపకల్పనలో పరోక్షంగా సహకరిస్తున్నారు. ఆ పరిశోధనా క్రమంలోనే కరోనావైరస్ బయట ప్రపంచంలోకి లీకై వుహాన్‌ను కమ్మేసిందన్నది ఒక వాదన. దీనిని ఎవరూ ఇదమిత్థంగా ధ్రువీకరించకపోయినప్పటికీ ఈ వైరస్ వ్యాప్తికి, వుహాన్ విశ్వవిద్యాలయ ల్యాబ్‌లో పరిశోధనలకు ఖచ్చితంగా సంబంధం ఉండే ఉంటుందని శాస్త్ర ప్రపంచం నమ్ముతోంది. అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో కెమిస్ట్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ చార్లెస్ లీబర్... నానో టెక్నాలజీలో నిపుణుడు. ఎంతో మందికి మార్గదర్శకుడు. అలాంటి గొప్ప సైంటిస్టుని జనవరి 28న ఎఫ్‌బీఐ అధికారులు అకస్మాత్తుగా అరెస్టు చేశారు. కారణం.... చైనా నుంచి ఆర్థికసాయాన్ని అందుకుంటూ ఆ విషయాన్ని అమెరికా ప్రభుత్వానికి చెప్పకుండా దాచడం. ఆ విషయం తెలియదని అబద్ధమాడడం! అమెరికా చట్టం ప్రకారం ఏ పౌరుడైనా విదేశీ సాయం పొందినపుడు.. సదరు సాయానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి తెలియపరచాలి. ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. మరో కీలకాంశం ఏంటంటే.. లీబర్‌తో పాటు మరో ఇద్దరు రిసెర్చి విద్యార్థులను కూడా ఎఫ్‌బీఐ అరెస్టు చేసింది. నిజానికి వీరిలో ఒకడు.. చైనా సైన్యంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్నారు. రెండో వ్యక్తి లోగాన్ నుంచి చైనాకు విమానం ఎక్కబోతుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 21 అత్యంత శక్తిమంతమైన జీవపరిశోధన శాంపిల్స్‌ను స్వాధీనపరుచుకున్నారు. రెండు రోజుల పాటు చార్లెస్ లీబర్‌ను నిశితంగా ప్రశ్నించాక.. ఏకంగా 10 లక్షల డాలర్ల పూచీకత్తు మీద ఆయనకు స్థానిక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అదే సమయంలో దేశం విడిచిపోరాదని ఆంక్ష పెట్టింది. ఈ కేసు గురించి బయటకు పొక్కాక- హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఆయన పరిశోధనలను ఆపేసి, ఆయనను సస్పెండ్ చేసింది. ఆయనను సెలవుపై పంపేసి, క్యాంపస్‌లో అడుగుపెట్టవద్దని ఆంక్ష విధించింది. లీబర్ కింద దాదాపు 18 మంది విద్యార్థులు రిసెర్చ్ స్కాలర్లుగా ఉన్నారు. థౌజండ్ టాలెంట్స్ ప్లాన్ పేరిట చైనా ఓ ప్రతిష్టాత్మక పరిశోధన కార్యక్రమాన్ని సాగిస్తోంది. దీని కింద విదేశాల్లో లబ్ధప్రతిష్టులైన వారిని ఆకర్షించి తమ వర్సిటీల్లో పరిశోధనలు సాగిస్తోంది. ఆ క్రమంలోనే చార్లెస్ లీబర్‌నూ సంప్రదించింది. ఆయనకు నెలసరి వేతనం 50, 000 డాలర్లు ఇస్తుండడమే కాకుండా, ఇతర వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం మరో 1, 50,000 డాలర్లు చెల్లిస్తోంది. 2012-17 మధ్య కాలంలో ఆయన చైనాకు పూర్తిగా పనిచేశారు. 15 లక్షల డాలర్ల ఖర్చుతో- వుహాన్ విశ్వవిద్యాలయంలో ఓ పరిశోధనా ల్యాబ్‌ను ఏర్పాటు చేయడమూ ఆయనతో ఓ ఒప్పందంలో భాగం. ఆ ల్యాబ్ ఏర్పాటు కూడా దాదాపుగా కొలిక్కి వచ్చినట్లు సమాచారం. వుహాన్ వర్సిటీతో ఒప్పందం విషయాన్ని చార్లెస్ లీబర్ అటు హార్వర్డ్‌కు గానీ, ఇటు అమెరికన్ ప్రభుత్వానికి గానీ చెప్పలేదు. పైపెచ్చు... అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ (డీవోడీ) నుంచి 2008 నుంచి దాదాపు 15 మిలియన్ డాలర్ల విలువైన గ్రాంట్లు పొంది హార్వర్డ్‌లో సైతం రిసెర్చ్‌ను కొనసాగించారాయన. చైనా సాగిస్తున్న థౌజండ్ టాలెంట్స్ ప్లాన్‌పై ఎప్పటినుంచో అమెరికా కన్నుంది. అది తమ దేశానికి, ఇతర దేశాలకు చెందిన అగ్రశ్రేణి శాస్త్రవేత్తలను ఆకర్షించి- మేధాసంపత్తి హక్కులను హరిస్తుందన్నది అమెరికా భయం. దాన్ని దెబ్బతీయాలని ఎప్పటినుంచో ప్రయత్నిస్తోంది. అలాంటి ప్లాన్‌కు హార్వర్డ్ ప్రొఫెసర్ పనిచేస్తారని అమెరికా ఊహించలేదు. లీబర్ అరెస్టుతో కరోనావైరస్ వ్యాప్తికి కారణాలపై శాస్త్రలోకంలో విస్తృత చర్చ మొదలైంది. నిజంగానే ఈ వైరస్ వుహాన్ విశ్వవిద్యాలయంలోని ల్యాబ్‌లో సాగుతున్న పరిశోధనల్లోనే డెవలప్ అయిందా..? నిజమైతే లీకేజికి కారణాలేంటి..? బయటకు చెప్పకపోయినా లీబర్ అరెస్టుకు- కరోనా అభివృద్ధికి మధ్య సంబంధం ఏదేనా ఉందా, అరెస్టు చేసిన ఇద్దరు చైనా స్కాలర్ల నుంచి బయటపడ్డ వయల్స్‌లో ఏముంది... మొదలైన వాటిపై ఎఫ్‌బీఐ ఆరాతీస్తోంది.

# చైనా.. ఆగని కరోనా

## ఒక్క రోజే 97 మంది మృతి

**» 908కి చేరిన మరణాలు.. నిపుణులను పంపిన డబ్ల్యూహెచ్‌వో**



వీడియో ద్వారా మోదీని వేడుకొంటున్న నౌకలోని భారతీయ సిబ్బంది

బీజింగ్, న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 10: చైనాలో కరోనా విజృంభణ కొనసాగుతూనే ఉంది. ఆదివారం ఒక్క రోజే 97 మందిని బలి తీసుకుంది. వీరిలో 91 మంది వైరస్ వెలుగుచూసిన వూహాన్ నగరం ఉన్న హుబెయ్ ప్రావిన్స్‌కు చెందినవారే. కొత్తగా 3,062 మందికి వైరస్ సోకింది. దీంతో కేసుల సంఖ్య 40,171గా నమోదైంది. మొత్తమ్మీద ఇప్పటివరకు 908 మంది మరణించినట్లు చైనా జాతీయ ఆరోగ్య మిషన్ ప్రకటించింది. వుహాన్‌లో కోటిన్నర మందికి వైరస్ పరీక్షలు నిర్వహించడం గమనార్హం. తీవ్రత నేపథ్యంలో చైనా అధికారులకు సహకరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిపుణుల బృందాన్ని పంపింది. తమ దేశంలోని 27 మంది విదేశీయులకు కరోనా సోకిందని వారిలో అమెరికన్ సహా ఇద్దరు మృతి చెందారని చైనా తెలిపింది. కరోనాను 15 నిమిషాల్లోనే నిర్ధారించే కిట్‌ను తియాన్జిన్ యూనివర్సిటీ అభివృద్ధి చేసింది. కరోనాను ఎదుర్కొనడంలో సాయపడతామని ప్రకటించినందుకు భారత ప్రధాని మోదీకి చైనా కృతజ్ఞతలు తెలిపింది. జపాన్‌తీరంలో నిలిపివేసిన క్రూయిజ్‌లో కొత్తగా 60 మందిలో కరోనా లక్షణాలు బయటపడ్డాయి. నౌకలో భారతీయులూ ఉన్నారని ఎంబసీ తెలిపింది. 160 మంది సిబ్బంది, 8 మంది ప్రయాణికులు భారత్‌కు చెందినవారని తెలుస్తోంది. నౌక సిబ్బందిలో ఒకరైన వినయ్‌కుమార్ సర్కార్ అనే బెంగాల్ చెఫ్.. 'మోదీ జీ మమ్మల్ని కాపాడండి' అంటూ వీడియో పంపాడు. ఎండలు ఎక్కువగా ఉండే ఏప్రిల్‌లో వేడిమిని తట్టుకోలేక కరోనా వైరస్ నశిస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ చేశారు. కరోనా మందు కనిపెట్టిన వారికి రూ.కోటి ఇస్తానని ప్రముఖ నటుడు జాకీచాన్ ప్రకటించారు.

### భారత 'తొలి అనుమానితురాలి' పరీక్షలు నెగిటివ్

వైరస్ కేంద్ర స్థానమైన వూహాన్ నుంచి వచ్చి ఆసుపత్రిలో చేరిన కేరళలోని త్రిశ్శూర్ విద్యార్థికి కరోనా సోకలేదని తేలింది. ఆమెకు నిర్వహించిన ఐదు పరీక్షల ఫలితాలు నెగిటివ్‌గా వచ్చాయి. మరోవైపు వలస పక్షుల కారణంగా కరోనా వ్యాపించే అవకాశం లేదని కేంద్ర పర్యావరణ మంత్రి ప్రకాశ్ జావదేకర్ స్పష్టం చేశారు. గుజరాత్‌లో వచ్చే వారం సదస్సు జరుగనున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. మొత్తం 1.97 లక్షల మంది విమాన ప్రయాణికులను స్క్రీనింగ్ చేశామని కేంద్ర మంత్రి హర్షవర్ధన్ లోకసభలో తెలిపారు. దేశంలో 3 కేసులే నమోదయ్యాయని తెలిపారు.

# 'పారాసైట్'కు ఆస్కార్

ప్రపంచ సినీరంగం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే 'ఆస్కార్' అవార్డుల ప్రదానోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం లాస్ ఏంజెల్స్‌లో కన్నులపండువగా జరిగిన ఈ కార్యక్రమానికి హాలీవుడ్ నటీనటులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. విభిన్న వస్త్రధారణలతో వచ్చిన నటీమణులు అవార్డుల ప్రదానోత్సవానికి మరింత అందం తీసుకొచ్చారు. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఈ సారి దక్షిణకొరియా సినిమా 'పారాసైట్' ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. 92 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో ఒక ఆంగ్లేతర చిత్రానికి ఈ అవార్డ్ రావడం ఇదే తొలిసారి. అంతేకాదు మరో మూడు విభాగాల్లో కూడా ఈ చిత్రానికి అవార్డులు దక్కాయి. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాల వల్ల సమాజంలో నెలకొంటున్న కఠిన పరిస్థితులను వినోదాన్ని జోడించి వివరిస్తూ కొరియన్ దర్శకుడు బాంగ్ జూన్ హో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇక 'జోకర్'లో ఉత్తమ నటనకుగాను వాకిన్ ఫీనిక్స్ ఉత్తమ నటుడిగా, 'జూడీ' చిత్రానికి గాను రెనీ జెల్వెగర్ ఉత్తమ నటిగా పురస్కారాలు అందుకున్నారు. 'వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్' చిత్రానికిగాను బ్రాడ్‌పిట్‌కు ఉత్తమ సహాయ నటుడి అవార్డ్ దక్కింది. 'ట్రాయ్ స్టోరీ 4' ఉత్తమ యానిమేటెడ్ చిత్రంగా పురస్కారం దక్కించుకొంది.

### 'పారాసైట్' ఇతివృత్తం..

కడుపు నింపుకోవడానికే కష్టంగా ఉన్న ఓ పేద కుటుంబంలో నలుగురు వ్యక్తులు.. ఉద్యోగాల కోసం ఓ ధనిక కుటుంబం చెంతకు చేరతారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులన్న విషయం యజమానుల దగ్గర దాచిపెడతారు. వాళ్ల కన్నా ముందు ఆ ఉద్యోగాల్లో ఉన్న వారిని మోసగించి, ఆ ఇంటి నుంచి వెళ్లగొడతారు. యజమాని కుటుంబం విహారయాత్రకు వెళ్లినప్పుడు అక్కడి సౌకర్యాలను ఉపయోగించుకుంటూ గడుపుతుంటారు. అక్కడ ఉద్యోగాలు కోల్పోయిన వారికి వారంతా ఒకే కుటుంబానికి చెందినవారని తెలిసిపోతుంది. ఈలోపే విహారయాత్రకు వెళ్లిన యజమానులు తిరిగి వస్తున్నారనే వార్త ఆ కుటుంబీకుల చెవిన పడుతుంది. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని యజమానికి తెలిస్తే.. వాళ్ల ఉద్యోగాల పోతాయన్న భయంతో వారేం చేశారు? అన్నదే సినిమా ఇతివృత్తం. కాన్స్(2019) చలన చిత్రోత్సవాల్లో పురస్కారం అందుకొన్న తొలి దక్షిణ కొరియా సినిమాగా రికార్డు సృష్టించింది. ఉత్తమ విదేశీ చిత్రంగా 77వ 'గోల్డెన్ గ్లోబ్' అవార్డు కూడా అందుకుంది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ పురస్కారం దక్కించుకొని చరిత్ర సృష్టించింది.

## బీజేపీని వ్యతిరేకిస్తే హిందువులను వ్యతిరేకించినట్టు కాదు: భయ్యాజీ జోషి

పణజీ, ఫిబ్రవరి 10: బీజేపీని వ్యతిరేకిస్తే హిందువులను వ్యతిరేకించినట్టు కాదని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి సురేష్ భయ్యాజీ జోషి స్పష్టం చేశారు. సోమవారం ఆయన 'విశ్వగురు భరత్'పై ప్రసంగించారు. 'బీజేపీని వ్యతిరేకిస్తే హిందువులను వ్యతిరేకించినట్టు భావించరాదు. అది రాజకీయ పోరు. నిరంతరం సాగుతుంది. ఆ పోరును హిందువులతో ముడిపెట్టొద్దు' అన్నారు.

## నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయి. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 11 జిల్లాల్లో మొత్తం 21 లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందోమోనన్న అనుమానాలు వెల్లువెత్తగా.. అలాంటిదేమీ లేదని ఢిల్లీ ఎన్నికల ప్రధానాధికారి రణ్‌బీర్ సింగ్ చెప్పారు.

## జే ట్యాక్స్ కోసమే చార్జీల పెంపు: టీడీపీ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): ధరలను పెంచి ప్రజలపై భారం మోపడాన్ని నేతలు యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఇంత కక్ష సాధింపు ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదన్నారు. జే ట్యాక్సు కోసమే విద్యుత్ చార్జీలను పెంచారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు ఆరోపించారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఆంధ్రను అప్పగిస్తే... విద్యుత్ కోతలతో జనాలకు జగన్ వాతపెడుతున్నాడని ఆరోపించారు. వైసీపీ హయాంలో సంక్షేమ పథకాలన్నీ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని పంచుమర్తి అనురాధ విమర్శించారు.

# ఢిల్లీలో కదం తొక్కిన నిరసనకారులు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ), ఎన్నార్సీకి నిరసనగా జరిగిన ప్రదర్శనలతో సోమవారం ఢిల్లీ అట్టుడికింది. వందలాది విద్యార్థులు, పౌరసమాజంలోని కార్యకర్తలు ప్లకార్డులు, బ్యానర్లు చేతబూని సెంట్రల్ ఢిల్లీలోని ప్రధాన వీధుల్లో కదంతొక్కారు. మండి హౌస్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్న ఆందోళకారులు అక్కడి నుంచి ప్రదర్శనగా జంతర్‌మంతర్ వైపు వెళ్లారు. వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా అనే సంస్థ ఈ నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది. కాగా, సీఏఏకు నిరసనగా 'చలో పార్లమెంట్'కు పిలుపునిచ్చిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు.



ఆందోళనకారులను తరలించేందుకు కాన్పూర్‌లోని మహ్మద్‌అలీ పార్క్‌ను చుట్టుముట్టిన పోలీసులు

### ఖుర్షీద్ నోట 'ఆజాదీ' మాట!

సీఏఏకు నిరసనగా జామియా మిల్లియా ఇస్లామియా ఎదురుగా ఇటీవల జరిగిన ఒక ప్రదర్శనలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ 'ఆజాదీ' కావాలంటూ నినదించారు. దిగ్భ్రాంతికరమైన ఈ సంఘటనకు సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఒక చిన్నారితో కలిసి ఖుర్షీద్ 'ఆజాదీ' నినాదం ఇస్తున్నట్లుగా వీడియోలో రికార్డయ్యింది. 'హమ్ ఛీన్‌కే లేంగే'(మేము గుంజుకుంటాం) అని చిన్న కుర్రాడు అనగానే....సల్మాన్ ఖుర్షీద్ దానికి సమాధానంగా 'ఆజాదీ'(స్వాతంత్ర్యం) అంటూ నినాదమిచ్చారు. ఇందులో తప్పేమీ లేదని ఆయన సమర్థించుకున్నారు.

# సీఏఏపై 4నెలల పసికందు ఆందోళనా?

**కేంద్రానికి, ఢిల్లీకి సుప్రీం నోటీసులు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10: ఢిల్లీలోని షాహీన్‌బాఘ్ ప్రాంతంలో సాగుతున్న ఆందోళనపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఓ నాలుగునెలల పసికందు అసలు అలాంటి ఆందోళనలో పాల్గొనగలడా.? అని ప్రశ్నించింది. వణికించే చలిలో ఆ ఆందోళన జరుగుతున్న ప్రాంతానికి తలిదండ్రులు తీసికెళ్లడం, ఇంటికొచ్చాక ఆ మగశిశువు చనిపోవడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై... ఆందోళనల్లో పిల్లలు పాల్గొనకుండా నిషేధించాలని కోరుతూ జాతీయ సాహస అవార్డు విజేత జెన్ గన్‌రతన్ సద్వర్తి వేసిన పిటిషన్‌ను స్వచ్ఛందంగా విచారణకు స్వీకరించిన కోర్టు- ఈ అంశంపై కేంద్రానికి, ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. ఇలాంటి నిరసనోద్యమాల్లో పాల్గొన్న పిల్లల్ని వారి స్కూళ్లలో మిగతా విద్యార్థులు, యాజమాన్యాలు దూరం పెడుతున్నాయని, దేశద్రోహి, పాకిస్థానీ, టెర్రరిస్టు... అంటూ వెక్కిరిస్తున్నారని కొందరు మహిళా న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చినపుడు ఛీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన ధర్మాసనం వారిని తప్పుబట్టింది. మరోవైపు- షాహీన్‌బాఘ్‌లో ఆందోళనకారులు రోజుల తరబడి నిరసనతో రోడ్డును దిగ్బంధం చేయడంపై కూడా కోర్టు తీవ్ర అసంతృప్తి చేసింది. ఈ ఆందోళనవల్ల కాళిందీకుంజ్ నుంచి షాహీన్‌బాఘ్ వైపు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయిందని, అందుచేత ఆందోళనకారులు అక్కడనుంచి ఖాళీ చేసేట్లుగా ఆదేశాలివ్వాలంటూ బీజేపీ మాజీ ఎమ్మెల్యే నందకిషోర్ గార్గ్, మరికొందరు పిటిషన్ వేశారు. 'ఆందోళనతో ట్రాఫిక్ ను స్తంభింపజేస్తారా? నిరసన ప్రజాస్వామ్యంలో ఓ హక్కు.. కాదనం. అదే సమయంలో పబ్లిక్ రోడ్లలో, పార్కుల్లో ఆందోళనలతో ప్రజలకు అసౌకర్యం కల్గించడాన్ని కూడా అంగీకరించం. కావలిస్తే నిరసనల కోసం ప్రజాసమూహం తిరుగాడని ఓ ప్రాంతాన్ని ఎన్నుకుని, అక్కడ చేసుకోవాలి" అని ఎస్కే కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ తేల్చి చెప్పింది. అయితే అక్కడ నుంచి నిరసనకారుల తొలగింపుపై తక్షణం ఆదేశాలివ్వడానికి నిరాకరించింది.

# అట్రాసిటీస్ చట్టం ఓకే

(మొదటి పేజీ తరువాయి)

ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని ప్రాథమికంగా నిర్ధారణ అయితే.. ముందస్తు బెయిల్ రాదు. ఒకవేళ ప్రాథమికంగా నిర్ధారణ కాకపోతే మాత్రం బెయిల్ మంజూరుకు ఎలాంటి అడ్డంకీ ఉండబోదు. జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ రవీంద్ర భట్, జస్టిస్ వినీత్ శరణ్ సోమవారం ఇచ్చిన ఈ తీర్పు కొంతలో కొంత కేంద్రానికి ఊరటనిస్తూనే ఫిర్యాదుదారులు కూడా ఆషామాషీగా కేసులు పెట్టకుండా కొంత కళ్లెం వేస్తుందని నిపుణులు అంటున్నారు.

### ఏంటీ కేసు?

సుప్రీంకోర్టు 2018 మార్చి 20న ఓ సంచలన తీర్పు ఇచ్చింది. కాశీనాథ్ మహాజన్ వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో ఇచ్చిన రూలింగ్‌ను నీరుగారుస్తూ ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పు అది. సుప్రీం తీర్పు ప్రకారం.. ఎస్సీ, ఎస్టీలను వేధించినట్లు ప్రభుత్వ ఉద్యోగులపై ఎవరైనా కేసు పెడితే సదరు ఉద్యోగులను ఎకాఎకి అరెస్టు చేయడం కుదరదు. ఆ ఉద్యోగి తాలూకు ఉన్నతాధికారి ఆ ఆరోపణపై పరిశీలన జరిపి దానిని ధ్రువీకరించాల్సి ఉంటుంది. అదే ప్రభుత్వేతర వ్యక్తులపైన అంటే సామాన్య ప్రజానీకంపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక కేసు పెట్టినప్పుడు.. డీఎస్పీ ర్యాంకు అధికారి ఆ ఆరోపణలోని నిజానిజాల నిగ్గుతేల్చి నివేదిక ఇచ్చాకే దాని ప్రకారం ఎఫ్ఐఆర్‌లు, అరెస్టులు లేదా ప్రాసిక్యూషన్లు జరపాలి. స్థూలంగా చెప్పాలంటే ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ఎవరిపైనైనా ముందస్తు విచారణ జరపాలి. నిందితులకు ముందస్తు బెయిల్ కూడా ఇవ్వాలి. వీటితోపాటు సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలను కూడా వెలువరించింది. సమన్యాయం ప్రాతిపదికన జస్టిస్ ఆదర్శ్ గోయెల్, జస్టిస్ యూయూ లలిత్ ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపింది. భారత్ బంద్ జరిగింది. నిరసనల్లో 11 మంది ఎస్సీలు చనిపోయారు. ఈ ఆగ్రహాన్ని చల్లార్చేందుకు కేంద్రం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పడేస్తూ పార్లమెంటులో ఓ సవరణ చట్టం చేసింది. తీర్పునకు ముందునాటి పరిస్థితిని ఆ చట్టం పునరుద్ధరించింది.

### బెయిల్ విషయంలో మెలిక

ముందస్తు బెయిల్ మంజూరు విషయంలో మాత్రం తాజా తీర్పు చిన్న మెలిక పెట్టింది.

- ముందస్తు బెయిల్ ఇవ్వడానికి సీఆర్‌పీసీలోని సెక్షన్ 438 ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టానికి వర్తించదు. సూటిగా చెప్పాలంటే 1989 నాటి చట్టం ప్రకారం ముందస్తు బెయిలు ఇవ్వడం అసాధ్యం.
- అయితే ఈ చట్టం కిందకు సదరు ఆరోపణలు వస్తాయన్న ప్రాథమిక సాక్ష్యాధారాలు లేకపోతే సవరించిన చట్టంలోని సెక్షన్ 18ఎ, 18ఎ (1) వర్తించవు. అంటే నాన్ బెయిలబుల్ నిబంధన వర్తించదు.
- ప్రాథమిక సాక్ష్యాధారాలుంటే మాత్రం నాన్ బెయిలబుల్ నిబంధన వర్తిస్తుంది. ముందస్తు బెయిల్ రాదు.
- అత్యంత అరుదైన సందర్భాల్లో ఈ చట్టం దుర్వినియోగమవుతోందని భావించినపుడు సీఆర్‌పీసీలోని సెక్షన్ 482 ప్రకారం కేసును కొట్టేసే అధికారం కోర్టుకు ఉంటుంది.

### ప్రాథమిక విచారణ అనవసరం

ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల) నిరోధక సవరణ చట్టం-2018గా పిలిచే ఈ చట్టంలో కేంద్రం ప్రధానంగా 18ఎ పేరిట ఒక నిబంధన చేర్చి.. నాటి ద్విసభ్య ధర్మాసనం వెలువరించిన మార్గదర్శకాలను రద్దు చేసింది. అయితే కేంద్రం ఈ చట్టాన్ని చేయడాన్ని కొందరు సుప్రీంలో సవాల్ చేశారు. కేంద్రం కూడా ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెల్లదని కోర్టుకెక్కింది. వాదోపవాదాలు విన్నాక గత ఏడాది అక్టోబరు 1న జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ బీఆర్ గవాయ్‌లతో కూడిన బెంచ్.. అంతకుముందు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన సంచలన తీర్పును, మార్గదర్శకాలను రీకాల్ చేసింది. "నాటి డివిజన్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులు సరికాదు. అవి రాజ్యాంగంలోని 142వ అధికరణానికి విరుద్ధం. అంతేకాదు.. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు ప్రాథమిక విచారణ అక్కర్లేదు. డీఎస్పీ స్థాయి అధికారి విచారణ కూడా అనవసరం. అధికారుల విచారణకు సంబంధించిన నిబంధనలు 3, 4, 5 చెల్లనేరవు. మార్గదర్శకాలు చేయాల్సినది పార్లమెంటు. సుప్రీంకోర్టు కాదు" అని స్పష్టం చేసింది. ఆ తరువాత పార్లమెంటు చేసిన సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం ఇచ్చిన రూలింగ్‌లో సుప్రీంకోర్టు మరింత స్పష్టతనిచ్చింది.

# రిజర్వేషన్లపై ఆత్మరక్షణలో మోదీ సర్కార్!

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్లు కల్పించడం రాష్ట్రాలకు తప్పనిసరి కాదని, అసలు ఇది ప్రాథమిక హక్కు కిందకు రాదని సుప్రీంకోర్టు మూడు రోజుల కిందట వెలువరించిన తీర్పుపై పార్లమెంటు ఉభయసభలూ సోమవారంనాడు దద్దరిల్లాయి. నిమ్న వర్గాలకు ఇస్తున్న రిజర్వేషన్లు పరిరక్షించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విపక్షాలు దాడి చేశాయి. మోదీ అధికారంలోకొచ్చాక ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్లపై ఓ పథకం ప్రకారం దాడి జరుగుతోందని, మౌలికంగా బీజేపీ, ఆరెస్సెస్‌లు రిజర్వేషన్లకు వ్యతిరేకమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. పార్లమెంటు ప్రారంభం కావడానికి ముందు ప్రధాని మోదీ మంత్రులతో, సీనియర్ ఎంపీలతో సమావేశమై సుప్రీంకోర్టు తీర్పు పర్యవసానాలను చర్చించినట్లు సమాచారం. లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం కాగానే, కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి నేతృత్వంలో ప్రతిపక్షాలు సుప్రీం తీర్పుపై తమ ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేస్తుందా లేదా చెప్పాలని కోరాయి. ఉద్యోగాలు, ప్రమోషన్ల కోసం రిజర్వేషన్లు కల్పించాలన్నది ప్రాథమిక హక్కు కాదని, ఇది సుప్రీంకోర్టు నిర్ణయమని, ఈ విషయంలో ప్రభుత్వం చేయగలిగింది ఏమీ లేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషీ స్పష్టం చేయడంతో ప్రతిపక్షాలు మరింత ఆగ్రహం ప్రకటించాయి. ఆ సమయంలో బీజేపీ మిత్రపక్షమైన లోక్ జనశక్తి నేత చిరాగ్ పాశ్వాన్ కల్పించుకుని... సుప్రీంకోర్టు తీర్పుపై తాము ఏకీభవించబోమని, ఈ విషయంలో ప్రభుత్వం కలుగ చేసుకోవాలని కోరారు. దీంతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కలుగచేసుకొని సుప్రీం తీర్పుపై సామాజిక సంక్షేమ మంత్రి ప్రకటన చేస్తారని సర్ది చెప్పారు. 'సున్నితమైన ఈ అంశాన్ని కాంగ్రెస్, ఇతర విపక్షాలు రాజకీయం చేస్తున్నాయి' అని ఆయన విమర్శించారు. ఆ తరువాత సామాజిక సంక్షేమ శాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లాట్ ఓ ప్రకటన చేస్తూ- ఆ వ్యవహారం 2012 నవంబరు 5న ఉత్తరాఖండ్ ప్రభుత్వ పీడబ్ల్యూడీ విభాగం ఇచ్చిన ఉద్యోగాల భర్తీకి సంబంధించినదని, ఆ సమయంలో కాంగ్రెస్ అధికారంలో ఉందని అన్నారు. ఈ కేసులో సుప్రీంకోర్టు అసలు కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కూడా కోరలేదని, తమకు సంబంధం లేని అంశంతో తమను విమర్శించడం తగదని అన్నారు. దీంతో- విపక్ష సభ్యులు పెద్ద ఎత్తున సిగ్గు.. సిగ్గు అంటూ లోకసభ నుంచి వాకౌట్ చేశారు. గెహ్లాట్ సభను తప్పుదోవ పట్టించారని, తాము ఆయనపై సభాహక్కుల ఉల్లంఘన తీర్మానం తెస్తామని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. అటు రాజ్యసభలో కూడా ఈ అంశంపై రభస జరిగింది. సుప్రీం తీర్పుతో తాము ఏకీభవించడం లేదని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని రామ్‌దాస్ అథవలే తెలిపార.

## వైసీపీ ఎంపీలదే హోదా సాధన బాధ్యత

- కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తితో రాష్ట్ర ప్రజలు
- వెనుకబడిన జిల్లాలకు మూడేళ్లుగా సాయమేది?
- లోక్‌సభలో రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ వేదికగా ప్రత్యేక హోదా సాధనపై వైసీపీ ఎంపీల తీరును టీడీపీ సభ్యుడు రామ్మోహన్ నాయుడు నిగ్గదీశారు. విభజన హామీలపైనా, కేంద్ర విద్యా సంస్థలు, పోలవరం, రైల్వే జోన్ వంటి వాటికి నిధుల కేటాయింపులో కేంద్రం అలసత్వాన్నీ ఆయన ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌పై ఆంధ్ర ప్రజల అసంతృప్తినీ ప్రకటించారు. 2011 జనాభా లెక్కలను 15వ ఆర్థిక సంఘం ప్రామాణికంగా తీసుకోవడంతో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయాన్నీ గణాంకాలతో వివరించారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. గత ఐదేళ్లలో హోదా సాధన కోసం పలు మార్గాల్లో పోరాడి విఫలమయ్యామన్నారు. హోదా సాధిస్తామన్న వైసీపీ మాటలు నమ్మిన ప్రజలు 22 మంది ఎంపీలను ఇచ్చారన్నారు. వారి వైఖరిపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. విభజన చట్టంలోని హామీల అమలుపై కొందరు చేస్తున్న ప్రచారాన్ని తప్పికొడుతూ... 'అది భారత పార్లమెంటు చేసిన చట్టం. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే' అని విస్పష్టంగా ప్రకటించారు. ఆరేళ్లపాటు వెనుకబడిన జిల్లాలకు ఇస్తామన్న నిధులను మూడేళ్ల నుంచీ ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన ఏ కేంద్రీయ విద్యా సంస్థకూ జాతీయ ప్రాముఖ్య హోదాను కల్పించలేదన్నారు. పోలవరానికి కేంద్రం నుంచి ఇంకా రావల్సిన రూ.5 వేల కోట్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే... పునరావాస ప్యాకేజీ సమస్యను పరిష్కరించకుండా ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం సాధ్యం కాదని ఎంపీ అన్నారు. ఉపాధి నిధుల పెండింగ్ గురించీ, విశాఖ-చెన్నై పారిశ్రాక కారిడార్‌కు నిధుల కేటాయింపుపైనా ఆయన కేంద్రాన్ని నిలదీశారు.

### అమరావతినే కొనసాగించాలి: కనకమేడల

"ఆంధ్ర రాజధాని అమరావతి రాష్ట్ర పునర్విభజన చట్టం పరిధికి లోబడి ఏర్పాటైంది. కనుక దాన్ని యథాతథంగా కొనసాగించేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి" అని కనకమేడల రవీంద్ర కుమార్ కోరారు. కేంద్ర బడ్జెట్‌పై రాజ్యసభలో సోమవారం జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 3 రాజధానుల నిర్ణయాన్ని ప్రకటించిన తర్వాత 59 రోజులుగా రాజధాని ప్రాంత రైతులు వివిధ రూపాల్లో తమ నిరసనను శాంతియుతంగా తెలుపుతున్నారని అన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని చెప్పారు.

### 'బీమ్స్' బీచ్‌గా రుషికొండ అభివృద్ధి: జావడేకర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని రుషికొండ బీచ్‌ను... బీచ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఈస్టటిక్స్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్(బీమ్స్) ద్వారా అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు. సోమవారం రాజ్యసభలో వైసీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి ఈ మేరకు లిఖితపూర్వకంగా జవాబిచ్చారు. రుషికొండకు బీమ్స్ ప్రాజెక్టులో చోటు కల్పించినట్లు తెలిపారు.

### 15వేల కోట్లతో జాతీయ రహదారులు: గడ్కరీ

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో సుమారు రూ.15వేల కోట్ల అంచనా వ్యయంతో 18 జాతీయ రహదారుల ప్రాజెక్టు పనులు చేపట్టినట్లు కేంద్ర రవాణా, రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. సోమవారం రాజ్యసభలో విజయసాయిరెడ్డి అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

### సీబీఐ ప్రత్యేక కోర్టుల పరిధిపై నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సీబీఐ కేసుల ప్రత్యేక కోర్టుల పరిధిని నిర్ధారిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. విశాఖలోని సీబీఐ కేసుల ప్రత్యేక కోర్టు పరిధిని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల వరకూ ఉంటుందని పేర్కొంది. విజయవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన సీబీఐ కేసుల అదనపు న్యాయస్థానం పరిధి పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వరకూ ఉంటుందని స్పష్టం చేసింది. అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన కేసులను కాకుండా ఇతర కేసులను విజయవాడలోని ఐదో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు చేపడుతుందని జీవోలో పేర్కొన్నారు.

### అంపశయ్యపై ఆంధ్ర ఆర్థికం

- లోక్‌సభలో లావు, భరత్, రంగయ్య, సత్యవతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): "ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అంపశయ్యపై ఉంది. ఈ సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని బయటపడేయడానికి ప్రత్యేక హోదా కల్పించాలి. విభజన హామీలన్నీ అమలు చేయాలి" అని వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభ్యర్థించారు. సోమవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.11,800 కోట్లు ఖర్చు చేసిందని, ఈ నిధులన్నీ రియింబర్స్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.55,540 కోట్లుకు పెంచడానికి సాంకేతిక కమిటీ అంగీకరించిందని, ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని కోరారు. నాలుగు స్మార్ట్ సిటీలకు నిధులు కేటాయించాలని కోరారు. పన్నుల వాటాలో 15వ ఆర్థిక సంఘం ఒక శాతం కోత విధించడం వల్ల రాష్ట్రానికి రూ.1500 కోట్ల నష్టం వస్తుందని తెలిపారు. కేంద్రం రెవెన్యూ లోటు సమస్యను ఎలా పరిష్కరిస్తుందని అడిగారు. విద్యకు జీడీపీలో 3శాతం నిధులన్నా కేటాయించాలన్నారు. అమ్మ ఒడి, నాడు-నేడు పథకాలకి కేంద్రం సహకారం అందించాలని లావు కోరారు. హోదా కోసం వైసీపీ ఎంపీ భరత్ కూడా విజ్ఞప్తి చేశారు. పోలవరం పునరావాసం ప్యాకేజీని అందించాలని కోరారు. విభజన హామీలను అమలు చేయాలని వైసీపీ ఎంపీలు రంగయ్య, సత్యవతి విజ్ఞప్తి చేశారు.

### చర్చకు విజయసాయి గైర్హాజరు

రాజ్యసభలో సోమవారం బడ్జెట్‌పై చర్చలో పాల్గొనకుండా వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి గైర్హాజరయ్యారు. సాయంత్రం 6.25 నిమిషాలకు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ చర్చలో పాల్గొనేందుకు విజయసాయి రెడ్డిని పిలిచారు. సభలో లేకపోవడంతో గైర్హాజరైనట్లు ప్రకటించారు.

### హథీరాంజీ 'మహంత్' సస్పెన్షన్‌పై స్టే

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని హథీరాంజీ మఠం 'మహంత్' అర్జున్‌దాస్‌కు ఉపశమనం లభించింది. ఆయన్ని మహంత్ పదవి నుంచి తొలగిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల అమలును హైకోర్టు నిలుపుదల చేసింది. ఈ వ్యవహారంపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని దేవాదాయశాఖ కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి మధ్యంతర ఆదేశాలిచ్చారు.

### ప్రాథమికంలో ఇంగ్లిష్ బోధన ఎక్కడాలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దేశంలో ఏ పాఠశాలలోనూ ప్రాథమిక స్థాయిలో కేవలం ఇంగ్లిష్ మీడియంలోనే బోధించడం లేదని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ అన్నారు. సోమవారం లోక్‌సభలో ఆయన టీడీపీ సభ్యుడు గల్లా జయదేవ్, సీపీఎం సభ్యుడు ఎస్.వెంకటేశన్ అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ... 2005లో రూపొందించిన జాతీయ పాఠ్యప్రణాళిక నిర్మితి ప్రకారం ఇంటిభాషనే బోధనా మాధ్యమంగా ఉపయోగించాలని చెప్పారు. అంతేకాగ బాలలకు ఉచిత, తప్పనిసరి విద్యహక్కు చట్టం ప్రకారం సాధ్యమైనంత మేరకు బోధనా మాధ్యమం వారి మాతృభాషలోనే ఉండాలని పోఖ్రియాల్ చెప్పారు. అయితే రాజ్యాంగంలో విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చినందు వల్ల రాష్ట్ర ప్రభుత్వాలే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

### ఇక రాష్ట్రమంతా ఆటోమ్యుటేషన్

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): భూముల రిజిస్ట్రేషన్ అయిన వెంటనే పూర్తిస్థాయి హక్కులు కల్పిస్తూ మ్యుటేషన్ చేసే విధానం రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రాబోతోంది. భూమిని రిజిస్ట్రేషన్ చేశాక, వెంటనే సబ్‌రిజిస్ట్రార్ ప్రొవిజనల్ మ్యుటేషన్ చేయనున్నారు. 15 రోజుల తర్వాత దీన్ని రెవెన్యూశాఖ నిర్ధారించాలి. దీన్నే ఆటోమ్యుటేషన్‌గా పిలుస్తున్నారు. ప్రస్తుతం దీనిని కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. ఫలితాలు బాగున్నాయని, రాష్ట్రమంతా వర్తింపజేయాలని రెవెన్యూ శాఖ నిర్ణయించింది. మంగళవారం ముఖ్యమంత్రి జగన్ క్యాంపు కార్యాలయంలో లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

# రైతును ముంచిన వర్షం

- పంట చేతికొస్తున్న దశలో అకాల వానలు
- మిరప, మినుము, శనగ రైతులకు భారీ నష్టం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులకు భారీ నష్టం కలిగించాయి. సోమవారం దక్షిణకోస్తా జిల్లాల్లో కురిసిన వర్షాలకు చేతికొస్తున్న దశలో ఉన్న పంట తీవ్రంగా దెబ్బ తింది. ముఖ్యంగా మిరప, మినుము, శనగ రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. దక్షిణ తమిళనాడు నుంచి ఒడిసా వరకూ కిలోమీటరున్నర ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనంతో కోస్తాంధ్రలో 3రోజులుగా అకాల వర్షాలు పడుతున్నాయి. ఈ అకాల వర్షం నుంచి కల్లాల్లోని మిర్చిని కాపాడుకునేందుకు గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోని రైతులు ఇబ్బందిపడ్డారు. పట్టాలు కప్పినా చాలాచోట్ల తడిసిపోయింది. పొలాల్లో పగిలిన పత్తి కాయలు తడిసిపోయాయి. గుంటూరు జిల్లాలో సోమవారం తెల్లవారుజాము నుంచే ముసురు మబ్బులు పట్టి జల్లులు పడుతుండడంతో కల్లాల్లో ఆరబెట్టిన మిరపపై టార్పాలిన్ పట్టాలు వేశారు. పట్టాలపై కూడా వర్షపు నీరు చేరింది. దీంతో పట్టాల కింద ఉన్న కాయలో నెమ్ము చేరింది. మరోవైపు, గుంటూరు యార్డులోని మిర్చిటిక్కీలు నీటిలో తడిసిపోయాయి. యార్డులో సుమారు 50 వేల మిర్చి టిక్కీలు ఉండగా... వీటిలో 10వేల టిక్కీల వరకు తడిచినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో మిరపతో పాటు పత్తి, బెంగాల్ గ్రామ్ (మంచిశనగ), రబీలో వేసిన మినుము, పెసర ఇతర పంటలు దెబ్బతిన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, భీమవరం, పాలకొల్లు ప్రాంతాల్లో సోమవారం ఒక మోస్తారు వర్షాలు కురిశాయి. దీంతో ఉప్పు రైతులతోపాటు మామిడి, ఆక్వా రైతులు కలవరపడుతున్నారు. తూరు, ఆగ్నేయ దిశగా తీర ప్రాంతంలో చలిగాలులు వీస్తున్నాయి. మూడు రోజులుగా దక్షిణ కోస్తాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవగా, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. సోమవారం కృష్ణా డెల్టా ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. గుంటూరు జిల్లా రేపల్లెలో గరిష్ఠంగా 5 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

### రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి

ఫిరంగిపురం, ఫిబ్రవరి 10: ముసురుపట్టిన వాతావరణం.. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించంతగా మసక చీకటి.. ఇలాంటి పరిస్థితుల్లో వేగంగా వెళ్తున్న రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తల్లీ, ఇద్దరు పిల్లలు సహా.. ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. సోమవారం ఉదయం గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై ఫిరంగిపురం మండలం రేపూడి వద్ద ఈ విషాదం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భవన నిర్మాణ సామగ్రితో వెళ్తున్న మినీ వ్యాను, నరసరావుపేట నుంచి ఏడుగురు ప్రయాణికులతో వస్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోలోని ఏడుగురు ప్రయాణికుల్లో ఆరుగురు మృతిచెందారు. మృతులను యడ్లపాడు మండలం కొత్తపాలెం (పుట్టకోట)కు చెందిన కాకాని రమాదేవి (35), ఆమె కుమార్తె యశస్విని (11), కుమారుడు బాల మణికంఠ(5)తోపాటు కొండరాతి అశోక్ కుమార్(38), ఆవుల యువరాజ్(22), చిరుమామిళ్ల మరియమ్మ (50)గా గుర్తించారు.



వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో కల్లాలపై కప్పిన పట్టాలపై చేరిన వర్షపు నీటిని తోడుతున్న రైతులు

# చార్జీల షాక్!

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిన గృహ వినియోగదారులపై చార్జీలేవీ పెంచలేదని చైర్మన్ చెప్పారు.

### వెయ్యి కోట్లు వాటిపైనే..

పెంచిన చార్జీల భారం ప్రభుత్వ సంస్థలపై ఎక్కువగా పడనుంది. అందులో రూ. వెయ్యి కోట్లు మునిసిపాలిటీలు, గ్రామ పంచాయితీలు వంటి ప్రభుత్వ సంస్థలపైనే పడుతుందని చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని రెండు విద్యుత్‌సంస్థలు (డిస్కంలు) మొత్తం లోటు రూ.పదివేల అరవై కోట్లుగా కమిషన్ నిర్ధారించింది. దానిని మొత్తం చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని ఆయన తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత గృహ వినియోగదారులకు తక్కువ ధరలకు విద్యుత్ సరఫరా చేయడం వల్ల విద్యుత్ సంస్థలకు రూ.1707 కోట్ల ఆదాయ లోటు వస్తోందని, దీనిని పూర్తిగా ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ముందుకు వచ్చిందని ఆయన చెప్పారు. పెంచిన టారిఫ్‌ను తీసివేయగా తమకు సుమారుగా రూ.13వేల కోట్ల లోటు ఉందని రెండు విద్యుత్ సంస్థలు తమ ప్రతిపాదనల్లో తెలిపాయి. కానీ కమిషన్ వాటి ప్రతిపాదనలను అంగీకరించలేదు. పెంచిన చార్జీలు పోను లోటు రూ.పది వేల కోట్లు మాత్రమేనని నిర్ధారించి ఖరారు చేసింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాకు వచ్చే ఏడాది రూ.8353 కోట్లు అవుతుందని కమిషన్ అంచనా వేసింది. ఇది క్రితం ఏడాది కంటే 18శాతం ఎక్కువ.

### ప్రతి నెలా మారనున్న శ్లాబు

వినియోగదారుల శ్లాబుల నిర్ధారణలో ఈసారి కొత్త విధానం తీసుకొని వచ్చారు. గతంలో ఒక ఏడాది వాడిన దానిని బట్టి శ్లాబును నిర్ణయించేవారు. ఇప్పుడు దానిని తీసివేసి ఏ నెల వాడకాన్ని బట్టి ఆ నెల శ్లాబును నిర్ణయించే విధానాన్ని ప్రవేశపెడుతున్నామని, ఇది వినియోగదారులకు మేలు చేస్తుందని చైర్మన్ తెలిపారు. రైల్వేలకు సరఫరా చేసే విద్యుత్ ధరను పెంచారు. ఇప్పటివరకూ ఇది ఒక యూనిట్‌కు రూ.3.70 ఉండేది. ఇప్పుడు దానిని ఒక యూనిట్‌కు రూ.5.50 చేశారు. దీనివల్ల రైల్వేలపై ఏడాదికి రూ.200కోట్ల భారం పడుతుందని చైర్మన్ వివరించారు. లాభాపేక్షలేని సంస్థలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ విద్యా సంస్థలను ఎల్‌టీలోని వాణిజ్య విభాగం నుంచి హెచ్‌టీలోని సాధారణ కేటగిరీకి మార్చారు. దానివల్ల వాటికి కొంత మేర ధరల ఉపశమనం కలుగుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వాహనాలకు చార్జీల పెంపు ప్రతిపాదనను కమిషన్ ఒప్పుకోలేదు. వాటికి ఒక యూనిట్ రూ.6.70కి విద్యుత్ సరఫరా చేస్తారు. 19- 20 సంవత్సరాల్లో ప్రారంభించిన హెచ్‌టీ పరిశ్రమలకు వినియోగం ఆధారంగా ఇచ్చే ప్రోత్సాహకాన్ని కొనసాగిస్తారు. పరిశ్రమలకు 85 శాతం కనీస విద్యుత్ వినియోగం ఉండాలన్న ప్రతిపాదన పక్కకుపెట్టి, గతంలో ఇస్తున్న రాయితీలను కొనసాగించాలని నిర్ణయించారు. ధాన్యం మిల్లులు, పల్వరైజింగ్ మిల్లులకు ప్రస్తుతం ఉన్న వంద హెచ్‌పీ విద్యుత్ వినియోగం లోడ్ పరిమితిని 150 హెచ్‌పీకి పెంచారు. వాటికి ఎల్‌టీ విభాగంలో బిల్లింగ్ చేస్తారు. పరిశ్రమలకు ప్రస్తుతం ఉన్న అపరాధ రుసుమును సరళతరం చేసి కంట్రాక్ట్ డిమాండ్ కంటే ఎక్కువ నమోదైన వినియోగానికి మాత్రమే ఫైన్‌ను పరిమితం చేస్తారు. రూ.ఐదు కోట్లకు మించిన ఏ పెట్టుబడి ప్రతిపాదనకైనా విద్యుత్ సంస్థలు కమిషన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ భూముల్లో విద్యుత్ లైన్లు వేసేటప్పుడు ఇవ్వాల్సిన పరిహారాన్ని కలెక్టర్లు త్వరగా తేల్చడానికి వీలుగా వారికి అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కమిషన్ నిర్ణయించింది. వినియోగదారుల బిల్లుల వెనుక వారికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వివరాలను ప్రచురించాలని నిశ్చయించింది. చట్టబద్ధమైన ఒప్పందాలు లేకుండా ప్రైవేటు విద్యుత్ సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలుకు కోరిన అనుమతిని కమిషన్ నిరాకరించింది.

#### విద్యుత్ చార్జీల పెంపు..

| కేటగిరి | ప్రస్తుతం... | ఇకముందు... |
|---|---|---|
| ఎల్‌టీ-2, హెచ్-2 ఫంక్షన్‌హాళ్లు | రూ.11.75 | రూ.12.25 |
| ఎల్-2 కమర్షియల్ | 33 కేవీ రూ.6.95, 132 కేవీకి రూ.6.70 | 11 కేవీ రూ.7.65, 33కేవీ రూ.6.95, 132 కేవీ రూ.6.70 |
| ఎల్‌టీ-4 స్థానిక సంస్థలు | రూ.4.00-రూ.7.05 | రూ.7.65 |
| ఎల్‌టీ-4 ప్రార్థనాస్థలాలు | రూ.4.80-రూ.5.00 | రూ.5.00 |
| హెచ్‌టీ-4 కేంద్ర, గ్రామీణ నీటిసరఫరా | రూ.4.85 | రూ.7.65 |
| హెచ్ టీ-4 రైల్వే ట్రాక్షన్ | రూ.3.75 | రూ.5.50 |
| ఎల్‌టీ-5 వ్యవసాయం కార్పొరేట్ రైతులు | రూ.2.50 | ఒకే ధర హెచ్‌పీకి రూ.200నెలకు |
| ఎల్‌టీ-5 హెచరీస్ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్లు | రూ.3.85 | రూ.5.25 |
| హెచ్‌టీ-5 హెచరీస్ ఫీడ్‌మిక్సింగ్ ప్లాంట్లు | రూ.4.85 | రూ.5.25 |
| హెచ్‌టీ-5 ఎత్తిపోతల పథకాలు | రూ.5.80 | 7.15 |
| ఎల్‌టీ 500 యూనిట్లపైన | రూ.9.05 | రూ.9.95 |
| ఎలక్ట్రిక్ వాహనాలు | రూ.12.25 (ప్రతిపాదించింది) | రూ.6.70 (ఖరారు చేసింది) |

### పీపీఏలను పాటించాల్సిందే

విద్యుత్ పీపీఏలు (కొనుగోలు ఒప్పందాలు) ఒకసారి కుదుర్చుకొన్న తర్వాత వాటిని పాటించాల్సిందేనని రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జున రెడ్డి తేల్చి చెప్పారు. "పీపీఏలు అమల్లో ఉన్నంతకాలం వాటిని అనుసరించాల్సిందే. ఇరు పక్షాలు ఆ ఒప్పందాలను పాటించాలి. సౌర పవన విద్యుత్ సంస్థలకు పీపీఏల ప్రకారం బిల్లుల చెల్లింపు అంశం కోర్టు పరిధిలో ఉంది. నేను దానిపై మాట్లాడకూడదు. సగం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. విద్యుత్ సంస్థలు దానిని పాటించాలి. వచ్చే సంవత్సరం చేసే కొనుగోళ్లలో సౌర విద్యుత్‌ను విద్యుత్ సంస్థలు చేర్చలేదు. కానీ కొనాల్సిందే. విద్యుత్ కొనాలి... దానికి బిల్లులు చెల్లించాలి' అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రం విద్యుత్ రంగంలో మిగుల్లో ఉందని, అందువల్ల కొత్త కొనుగోళ్లకు అనుమతి ఇవ్వలేదని ఆయన తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 69వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం ఉంటే, 78వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ లభ్యత ఉందన్నారు.

# నిన్న జాస్తి, నేడు ఏబీ.. రేపెవరో?

(మొదటి పేజీ తరువాయి)

విన్నాం. మన రాష్ట్రంలో ఇంతలా ఉంటుందని ఊహించలేకపోతున్నాం. ఇలాగైతే ఉద్యోగాలు చేయలేం" అని కొందరు ఐపీఎస్ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు నుంచి హెచ్చరిస్తూ వచ్చిన జగన్ ఒక సామాజిక వర్గాన్ని టార్గెట్ చేస్తున్నారన్న అభిప్రాయం ఐపీఎస్ వర్గాల్లో బలపడుతోంది. డీజీపీ ర్యాంకులో ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు నుంచి ఎస్పీ స్థాయి అధికారి కోయ ప్రవీణ్ వరకూ కక్షగట్టి పోస్టింగ్ ఇవ్వకుండా ఎనిమిది నెలలకుపైగా వెయిటింగ్‌లో పెట్టారు. అయితే ఏబీపై ఎక్కువ కక్షగట్టి, ఆయనను ఏదోలా సస్పెండ్ చేయాలని లోతుగా ఆరా తీశారు. ఆయన హయాంలో కొనుగోలు చేసిన పరికరాలలో అక్రమాలు జరిగాయని చివరకు తేల్చారు. అంతటితో ఆగకుండా ఏకంగా దేశ ద్రోహానికి పాల్పడినట్లు ఉన్నత స్థాయిలో లీకులిచ్చి మీడియాలో హైలైట్ అయ్యేలా చేశారు. ఏబీపై లీకుల రూపంలో విడుదలైన ఆరు ఆరోపణలపై ఆయన సన్నిహిత వర్గాలు, కొందరు పోలీసు అధికారులు విస్మయం చెందుతున్నారు. ఇజ్రాయెల్ కంపెనీ నుంచి టెలిఫోన్ ట్యాపింగ్ పరికరాలు కొనుగోలు చేసినట్లు చెబుతున్న వ్యక్తులు వాటిని చూపించగలరా? అసలు కొనుగోలు చేశారని ఆధారాలు చూపగలరా? అని వారు అడుగుతున్నారు. కొనుగోలు ఆర్డర్ ఏ కంపెనీకి ఇచ్చారు? అది ఇజ్రాయెల్ కంపెనీనా? ఏబీ కుమారుడిదా? దేశ రహస్యాలను లీక్ చేశారని చెబుతున్న వాళ్లు బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్‌తో పాటు 25దేశాలు బహిరంగంగా వినియోగిస్తున్న వాటిని ఎలా అనగలరు? అని కూడా వాదిస్తున్నారు. ఈ విషయాన్ని లీకుల్లో కాకుండా నేరుగా పేపర్‌పై ప్రకటన విడుదల చేయగలరా? అని ప్రశ్నిస్తున్నారు. నాసిరకం పరికరాలు కొనబోయారన్న విషయంలోనూ వాస్తవం లేదని, ప్రపంచంలోనే అత్యంత టెన్షన్ ఉండే ఇజ్రాయిల్, గాజా సరిహద్దుల్లో వాడే పరికరాలు నాసిరకంగా ఉంటాయా అని నిలదీస్తున్నాయి. ఐదేళ్ల వారంటీకి సరిపడా నిధులు లేకపోతే వారంటీ ఏడాది చాలని కోరడం నాణ్యత ప్రమాణాలు మార్చడం ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. గ్రేహౌండ్స్ అధిపతి అభ్యంతరాలను పట్టించుకోలేదనడం పూర్తిగా అవాస్తవమని, ఆయన అభ్యంతరాల వల్లే అప్పటి డీజీపీ ఆ కొనుగోళ్లను రద్దు చేశారని వివరిస్తున్నారు. "దేశ భద్రతకు ముప్పు ఏర్పడిందని ఉన్నతస్థాయి లీకులో అంటున్నారు. ఇదే నిజమైతే తక్షణమే అరెస్టు చేస్తారు. ఏదో ఉద్దేశం మనసులో పెట్టుకుని అభాండాలు వేస్తున్నారు" అని ఈ వర్గాలు ఆరోపిస్తున్నాయి. టీడీపీ కార్యకర్తలా వ్యవహరించారని నిందించడం సరికాదనే అభిప్రాయం ఐపీఎస్ వర్గాల్లో వినిపిస్తోంది. "నిఘా వ్యవస్థలో నమ్మకమైన వ్యక్తులను నియమించుకోవడం ఆయా ప్రభుత్వాల ఆనవాయితీ. రాష్ట్రంలో ఎందరో ఉండగా, పొరుగు రాష్ట్రం నుంచి అధికారిని తెచ్చుకోవడానికి ఇదే ప్రభుత్వం ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేసిందికదా" అని ఈ వర్గాలు గుర్తు చేస్తున్నాయి.

### పహారాలో మరింత పదును..

ఓ వైపు మావోయిస్టు దాడులు, మరో వైపు ఎర్రచందనం స్మగ్లింగ్, తునిలో రైలు దహనం, పుష్కరాల్లో విషాదం.. ఇలా గత ప్రభుత్వంలో ఎన్నో ఘటనలు జరిగాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా మెరుగైన టెక్నాలజీ ఏర్పాటు చేసుకోవడానికి పోలీసుశాఖ అప్పట్లో ప్రయత్నించింది. ప్రపంచంలోనే అత్యుత్తమైన సాంకేతికతను సమకూర్చుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే చెబుతుండేవారు. దీంతో అధునాతన పరికరాల కోసం వెతుకులాట ప్రారంభించిన పోలీసులు.. ఇజ్రాయిల్ వైపు వెళ్లారు. గాజా సరిహద్దుల్లో వాడుతున్న పరికరాలను అప్పటి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న ఐఎఫ్‌ఎస్ అధికారి బృందం పరిశీలించింది. శాంపిల్ కోసం ఒక్కొక్క పరికరాన్ని ఆర్డర్ చేయాలని ఈ బృందం నిర్ణయించింది. కచ్చితమైన ధర తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎస్‌టీసీ ద్వారా గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. సింగిల్ బిడ్ రావడంతో మూడుసార్లు టెండర్ రద్దయింది. ఇదే సమయంలో అరకు ఎమ్మెల్యే సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సోములను మావోయిస్టులు హత్య చేశారు. ఈ పరిణామంతో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, నేరుగా ఆర్డర్ ఇచ్చారు. కొనుగోలు కమిటీలో సభ్యులుగా ఉన్న సాంకేతిక అధికారులు అభ్యంతరాలు లేవదీయడంతో అప్పటి డీజీపీ ఆర్పీ ఠాకూర్.. ఆర్డర్ రద్దు చేశారు. ఆర్డర్ ఇవ్వలేదు. చెల్లింపులు జరగలేదు. ఇప్పటికీ ఆ పరికరాలు రాలేదు. అలాంటప్పుడు అక్రమాలు ఎక్కడ? ఏబీ కుటుంబ సభ్యులు ఈ ప్రక్రియలోకి ఎలా వచ్చి చేరారు? అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అప్పటినుంచే టార్గెట్! ఎన్నికల సమయంలో ఏబీని టార్గెట్ చేసి మాట్లాడిన వైసీపీ నేతలు.. అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటిన తరువాత.. జరగని తప్పును భూతంలా చూపించి సీనియర్ ఐపీఎస్‌ను సస్పెండ్ చేయడం సముచితం కాదనేది ఐపీఎస్‌ల వాదన.

## వార్షికోత్సవాల పేరుతో డబ్బు వసూలా?

### ఆ స్కూళ్లపై చర్యలు తీసుకోండి: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వార్షికోత్సవాల పేరుతో విద్యార్థుల నుంచి నగదు వసూలు చేస్తున్నారంటూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. వార్షికోత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై గతంలో తాము ఇచ్చిన తీర్పును సక్రమంగా అమలు చేయాలని అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న పలు విద్యాసంస్థలకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సదరు విద్యా సంస్థలను ఆదేశిస్తూ తదుపరి విచారణను 6 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది. కార్పొరేట్ విద్యాసంస్థలు వివిధ కారణాలను చూపుతూ విద్యార్థుల నుంచి భారీగా నగదు వసూలు చేస్తున్నాయంటూ గుంటూరు జిల్లా సేలంపాలెం ప్రాంతానికి చెందిన న్యాయవాది సైకం రాజశేఖర్ దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. పిటిషనర్ తరపు న్యాయవాది శ్రవణ్‌కుమార్ వాదిస్తూ.. వార్షికోత్సవాల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.1600 వరకు వసూలు చేస్తున్నారని, ఇది తల్లిదండ్రులకు భారంగా పరిణమించిందని తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్లకు, విద్యాశాఖ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయిందని తెలిపారు.

# ఆడిట్ కాకుండా నిధులివ్వం

- పోలవరానికి ఇప్పటి వరకూ రూ.8614 కోట్లు ఇచ్చాం : కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులకు పెట్టిన ఖర్చును కేంద్రం తిరిగి చెల్లిస్తూనే ఉందని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రతన్‌లాల్ కటారియా చెప్పారు. అయితే నిధుల ఖర్చుపై ఆడిట్ పూర్తయ్యాకే తదుపరి నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని ఆర్థికమంత్రిత్వశాఖ 2019 నవంబరు 26వ తేదీనే లేఖ ద్వారా వెల్లడించిందని కటారియా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసే విషయంలో తీవ్ర ఆలస్యం ఎందుకు జరుగుతోందని సోమవారం రాజ్యసభలో బీజేపీ ఎంపీ సుజనాచౌదరి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు జవాబిచ్చారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర జలవనరుల సంఘం సిఫారసు చేసిన అర్హమైన ప్రతిపాదనల ప్రకారం కేంద్రం ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేస్తోందన్నారు. 2020 ఫిబ్రవరిలో విడుదల చేసిన రూ.1850 కోట్ల నిధులతో కలిపి ఇప్పటి వరకూ కేంద్ర సాయంగా మొత్తం రూ.8614.16 కోట్లు విడుదల చేశామని మంత్రి చెప్పారు. 2016లో కేంద్రం రూ.2524.16 కోట్లు విడుదలచేయగా, రూ.1701.45 కోట్లు ఖర్చు పెట్టారని, 2017-18లో రూ.2వేల కోట్లు విడుదల చేయగా, రూ.3830.53 కోట్లు ఖర్చు పెట్టారని, 2018-19లో కేంద్రం రూ.1400 కోట్లు విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం రూ.3047.39 ఖర్చు పెట్టిందని కేంద్ర మంత్రి వెల్లడించారు. వివిధ పనులకు సంబంధించి కాంట్రాక్టు నిర్వహణలో నెలకొన్న సమస్యల వల్లే ఆ ప్రాజెక్టు ఆలస్యమైందన్నారు. 2019 డిసెంబరులో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు... 2021 డిసెంబరులో పూర్తవుతుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ చెబుతోందని కటారియా ప్రకటించారు. కాగా, వచ్చే వర్షాకాలంలోపే పోలవరం ప్రాజెక్టు స్పిల్ చానల్ పనులన్నీ పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కటారియా వెల్లడించారు. రాజ్యసభలో బీజేపీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి ఈ మేరకు జవాబిచ్చారు. వర్షాకాలం ముందే స్పిల్‌వే, స్పిల్ చానల్, గేట్ల ఏర్పాటు పనులన్నీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధమవుతున్నామన్నారు. అలాగే రిజర్వాయర్, గేట్ల నిర్వహణకు సంబంధించిన షెడ్యూలు నిర్ణయిస్తామని, పోలవరం ప్రాజెక్టు పనుల పట్ల కేంద్రం ప్రత్యేక దృష్టి పెడుతుందన్నారు.

## సీఎం ప్రకటన రోజే తరలింపు ప్రారంభమైంది: బొత్స

విశాఖపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మూడు రాజధానులపై శాసనసభలో సీఎం జగన్ ప్రకటన చేసినప్పటి నుంచి విశాఖకు పరిపాలనా రాజధాని తరలింపు ప్రక్రియ ప్రారంభమైందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. విశాఖపట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖకు కొన్ని శాఖల తరలింపు పాక్షికంగా ప్రారంభమైందన్నారు. తమ శాఖ భవనాల నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేస్తామన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేసినందుకు ఉత్తరాంధ్ర వ్యక్తిగా ఆనందపడుతున్నానన్నారు. మూడు రాజధానుల ఏర్పాటు హక్కు జగన్‌కు ఎవరిచ్చారని చంద్రబాబు ప్రశ్నిస్తున్నారని, రాత్రికి రాత్రే హైదరాబాద్‌ను వదిలి వచ్చే హక్కు ఆయనకు ఎవరిచ్చారని బొత్స ప్రశ్నించారు. రాష్ట్రప్రజలు తమకు 151 సీట్లు ఇచ్చిన హక్కుతోనే ప్రజాసంక్షేమం కోసం రాజధానులపై జగన్ నిర్ణయం తీసుకున్నారన్నారు. ల్యాండ్‌పూలింగ్‌లో ఇంత వరకూ ఎలాంటి అక్రమాలకు తావులేకుండా 6,112 ఎకరాలను సేకరించామన్నారు. దీనిపై ఎవరికైనా ఎలాంటి సమాచారం కావాలన్నా సరే తీసుకోవచ్చునన్నారు. తనపేరిట, తన బంధువు చిన్నశ్రీను పేరిట విశాఖలో భూములున్నట్టు ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. నిరూపిస్తే.. వాటిని వారికే రాసిచ్చేస్తానని సవాల్ చేశారు.

## నిధులివ్వడమేనా? ఖర్చు చూడరా?

### 'ఉపాధి'పై కేంద్రాన్ని నిలదీసిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీపథకం కింద రాష్ట్రానికి నిధులు ఇచ్చేసి చేతులు దులుపుకొంటే సరిపోతుందా? ఆ నిధులను రాష్ట్రం ఎలా ఖర్చు చేస్తోంది? తన వాటా నిధులను సమకూర్చిందా? లేదా? అన్నది పరిశీలించకపోతే ఎలా? అంటూ కేంద్ర ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి ఎప్పుడెప్పుడెంత ఇచ్చారు? ఆ నిధులు ఏమేరకు ఖర్చయ్యాయి? పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధి పథకంలో భాగంగా మౌలిక సదుపాయాల కోసం కేంద్రం 3 విడతల్లో విడుదల చేసిన రూ.1,845కోట్లను రాష్ట్రం ఇతర అవసరాల కోసం మళ్లించిందని, ఆ నగదును పంచాయతీలకు బదిలీ చేయించాలని అభ్యర్థిస్తూ కృష్ణా జిల్లా గ్రామ పంచాయతీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎం.రామకృష్ణారెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన ధర్మాసనం.. వివరాలు సమర్పించడంలో కేంద్రం జాప్యం చేయడాన్ని తప్పుబట్టింది.

## మనోవేదనతో మరో రైతు మృతి

తుళ్లూరు, ఫిబ్రవరి 10: రాజధానికి భూములు త్యాగం చేసిన రైతులు నేడు మనోవేదనతో నేలకొరుగుతున్నారు. అమరావతి నుంచి రాజధాని తరలిపోతుందున్న భయంతో మానసిక సంఘర్షణకు గురై తుళ్లూరుకు చెందిన కంచర్ల చంద్రం (42) మెదడులోని నరాలు చిట్లి ఆదివారం రాత్రి మృతి చెందాడు. చంద్రం తనకున్న 30 సెంట్ల భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చేశాడు. పరిహారంగా వచ్చిన ప్లాటుతో పిల్లల భవిష్యత్తు బాగుంటుందని ఆశపడ్డాడు. ఉన్న కాస్త భూమి పూలింగ్‌కు ఇచ్చేసి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే సీఎం మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చిన ప్పటి నుంచి చంద్రం మనోవేదన చెందుతున్నాడని బంధువులు తెలిపారు. రాజధాని ఇక్కడ నుంచి తరలిపోతే తన పిల్లల భవిష్యత్తు ఏమిటనే తీవ్రంగా ఆలోచించడంతో మెదడులోని నరాలు చిట్లి మృతిచెందాడని చెప్పారు.


కంచర్ల చంద్రం

# సైకోలా జగన్ తీరు

- అమరావతికి అనుకూలంగా మాట్లాడిన విద్యార్థులను చితకబాదుతారా?
- సీఎం జగన్, 'నాగార్జున' వర్సిటీ వీసీపై చంద్రబాబు ఆగ్రహం

విజయవాడ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి జగన్ సైకోలా ప్రవర్తిస్తున్నారు. ఆయన ఏం చేస్తున్నారో ఆయనకే తెలియడం లేదు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నా. వీసీ సమక్షంలోనే ఇది జరగడం దుర్మార్గం" అని మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. ఏఎన్‌యూలో జరిగిన ఘటనలో గాయపడి విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు నందా, సురేశ్‌లను సోమవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో కలిసి ఆయన పరామర్శించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మూడు రాజధానులు పెట్టమని ఎవరడిగారని ప్రశ్నించారు. తప్పుడు పనులన్నీ మీరు చేస్తూ తిరిగి మాపై దౌర్జన్యాలకు పాల్పడతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తన ఇష్టానుసారంగా రాజధానిని మారుస్తానంటున్నారని, ప్రజాస్వామ్యవాదులందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతపురం నుంచి కియా మోటార్స్ తరలిపోతుందని అంతర్జాతీయ మీడియా సంస్థ రాయిటర్స్ కథనం రాస్తే... అది కూడా తామే రాయించామని చెబుతున్నారని అన్నారు. ఈ పాలకులు చేతగాని దద్దమ్మ, విధ్వంసకర పరిపాలన చేస్తున్నారని మండిపడ్డారు. "విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రవర్తన చాలా దారుణంగా ఉంది. సీఆర్‌డీఏలో భాగంగా ఉన్న యూనివర్సిటీలోనే మూడు రాజధానులకు అనుకూలంగా సదస్సు నిర్వహించారు. అందులో జగన్ మీడియా ఆధ్వర్యంలో చర్చ పెట్టారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విద్యార్థులు కొందరు అమరావతికి అనుకూలంగా అభిప్రాయాలు చెబుతామని ముందుకు వస్తే వారిని చితకబాదారు. వీసీ తన బాధ్యతలను విస్మరించి యూనివర్సిటీలో కొంత మంది ప్రొఫెసర్లను, విదార్థులను రెచ్చగొట్టి ఇష్టానుసారం ప్రవర్తించడం మంచి పద్ధతి కాదు. ఈ ఘటనపై వాస్తవాలను తెలుసుకునేందుకు నిజనిర్ధరణ కమిటీలు వెళితే కనీసం లోపలికి కూడా అనుమతించ లేదు. అదే వీసీ.. పెద్దఎత్తున అవినీతికి పాల్పడిన, కరడుకగట్టిన నేరస్తుడు జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జగన్ ఫొటోతో యూనివర్సిటీలో ఊరేగింపు నిర్వహించారు. ఇదేనా పద్ధతి? యూనివర్సిటీని ఎక్కడికి తీసుకువెళుతున్నారు?" అని మండిపడ్డారు. రాజధానిని మార్చడం సరి కాదని రాష్ట్రం, దేశం ఘోషిస్తుంటే.. ఏఎన్‌యూ ఉపకులపతి మాత్రం మూడు రాజధానులకు అనుకూలంగా సదస్సు నిర్వహించడం, ప్రభుత్వ మెప్పు కోసం విద్యార్థులపై దౌర్జన్యం చేయడంపై మండిపడ్డ చంద్రబాబు దీనిని ఇంతటితో వదిలిపెట్టమని హెచ్చరించారు.


హెల్ప్ ఆస్పత్రిలో నాగార్జున వర్సిటీ విద్యార్థిని పరామర్శిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు, సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

### వీసీ బండారాన్ని బయటపెడతాం:రామకృష్ణ

"రాష్ట్ర ప్రజలందరూ అమరావతిలోనే రాజధాని కొనసాగాలని కోరుకుంటుంటే ఏఎన్‌యూ వీసీ మూడు రాజధానులకు అనుకూలంగా సదస్సు నిర్వహించడమే సిగ్గుచేటు. ఆ సదస్సులో పాల్గొన్న కొందరు విద్యార్థులు అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలనే అభిప్రాయాన్ని చెప్పిన పాపానికి వారిపై వీసీ ఆధ్వర్యంలో కొంతమంది రౌడీలు, గూండాలు భౌతిక దాడులకు పాల్పడటం సభ్యసమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన ఘటన" అని సీపీఐ రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వీసీ చరిత్ర మొత్తం తమ దగ్గర ఉందన్నారు. ఆ నివేదికలను త్వరలోనే బయటపెడతామని, గవర్నరుకూ అందజేస్తామన్నారు. వీసీ హద్దుల్లో ఉండాలని హెచ్చరించారు.

## డీజీ స్థాయి అధికారి సస్పెన్షన్ చరిత్రలో మొదటిసారి

"డీజీ ర్యాంకులో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేయడం చరిత్రలో ఇదే మొదటిసారి. ఇష్టం లేకపోతే పక్కనబెట్టాలి. అంతేగాని ఇలాంటి విధ్వంసకర కక్ష సాధింపు చర్యలు మంచివి కాదు" అని మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతిభ ఆధారంగా అధికారులతో పని చేయించామన్నారు. ఈరోజు వాళ్లందరినీ పక్కన పెట్టేశారని, 300-400 మందికి జీతాలు చెల్లించడం లేదన్నారు. చాలామందికి పోస్టింగ్‌లు ఇవ్వలేదని తెలిపారు. "ఎప్పుడైనా ఇలాంటి పరిపాలన చూశామా? ఒక సీఎం దగ్గర పని చేసిన అధికారులపై కక్ష సాధింపు చర్యలకు దిగడం నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎప్పుడూ లేదు. ఇలాంటి దుర్మార్గమైన, నీచమైన కార్యక్రమాలను తీవ్రంగా ఖండిస్తున్నా" అని అన్నారు. ఇది మంచి సంప్రదాయం కాద ని స్పష్టం చేశారు. "ఈ ప్రభుత్వం వల్ల నష్టపోతున్న అధికారులందరికీ భరోసా ఇస్తున్నా. తప్పకుండా వారిని ఆదుకుంటాం. ఐదు గంటల వరకు మాత్ర మే పని చేస్తామని చెప్పి అర్ధరాత్రి జీవోలు ఇస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ చాలా ఉత్సాహంగా పనిచేస్తున్నారు. ఎంతమంది అధికారులను సస్పెం డ్ చేస్తారు?" అని నిలదీశారు. "ఈ ప్రభుత్వంలో అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్న అధికారులందరూ తిరిగి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుం ది. ఈ విషయాన్ని ఆలోచించుకుని ప్రవర్తించాలి. అధికారులే కాదు.. పోలీసులనూ హెచ్చరిస్తు_న్నా" అని చంద్రబాబు అన్నారు. ఈరోజు ఏబీ వెంకటేశ్వరరావును చేసిననట్టుగానే రేపు మరొకరి కూడా అలాంటి పరిస్థితే ఎదురవుతుందన్నారు.

## పాలన చేతకాక వ్యవస్థలను దిగజార్చారు

- మేం మాట నిలబెట్టుకున్నాం
- వైసీపీ నమ్మించి మోసం చేసింది
- ప్రజలపై భారం దుర్మార్గం
- విద్యుత్ చార్జీల పెంపుపై చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): "పరిపాలన చేతకాక వ్యవస్థలన్నింటినీ దిగజార్చారు. ఆర్థికంగా కుదేలు చేశారు. ఇప్పుడు ఆ భారాన్ని ప్రజల మీద వేయడం ఎంత దుర్మార్గం! ఆర్టీసీ బస్సు చార్జీలు, పెట్రోలు ధరలు, ఫైబర్‌గ్రిడ్ చార్జీలు.. తాజాగా ఇప్పుడు విద్యుత్ చార్జీలు. ప్రజలపై ఏంటీ భారం? భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచబోమని ఇచ్చిన మాటను మా హయాంలో నిలబెట్టుకున్నాం. కానీ ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచం అని నమ్మించి వైసీపీ మోసం చేసింది" అని మాజీ సీఎం చంద్రబాబు ప్రశ్నించా రు. సోమవారం ట్విటర్‌లో ఆయన స్పందించారు. "ఒక్క చాన్స్ ఇమ్మని కాళ్లు, గడ్డాలు పట్టుకుని అధికారంలోకి వచ్చింది ఇలా ప్రజలపై భారాలు మో పడానికా? ఇది నయవంచన కాదా?" అని ప్రశ్నించారు. విద్యుత్ ఒప్పందాల రద్దు దేనికి అని అడిగితే విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు, ప్రజలపై భా రం తగ్గించేందుకు అని ప్రకటించిన వైసీపీ ప్ర భుత్వం ఇప్పుడు ఎందుకు పెంచింది అని ప్రశ్నించారు. ఇప్పటికే పరిశ్రమలకు రాయితీలను ఇవ్వ డం ఆపేశారని, ఇప్పుడీ విద్యుత్ చార్జీల భారంతో పరిశ్రమలు ఎలా నిలదొక్కుకుంటాయన్నారు. కా గా, ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో రాజధాని రైతులకు మద్దతుగా తరలివచ్చిన రైతులు ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. "మేం అమరావతిని ఆంధ్రుల భవిష్యత్ సంపదగా తీర్చిదిద్దుతుం టే.. జగన్ వచ్చి సర్వనాశనం చేస్తున్నాడు. రూ.2 లక్షల కోట్ల అమరావతి ఆస్తిని నిర్వీర్యం చేసే దు ర్మార్గ చర్యలకు పూనుకోవడం దురదృష్టకరం. ప్ర జల భవిష్యత్‌ను జగన్ మట్టుపెట్టి వికృతానందంపొందుతున్నాడు"అనిఆగ్రహంవ్యక్తం చేశారు.

### జగన్ సంతకమే మాయ: లోకేశ్

"జగన్ తొలి సంతకమే మాయ. మాట మార్చి, మడమ తిప్పి పింఛనుదారులను మోసం చేశారు. నేను విన్నాను, నేను ఉన్నాను.. 3 వేల ఫించను పక్కా అన్న జగన్.. నేను వినలేదు, నేను లేనంటూ రూ.250 పెంచి అవ్వా, తాతలను దగా చేశారని లోకేశ్ విమర్శించారు. పండుటాకులపై జగన్‌కు అంత కక్ష ఎందుకో అర్థం కావడం లేదని సోమవారం ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు.

# 'సెలెక్ట్'కు సర్కార్ బ్రేక్..!

(మొదటి పేజీ తరువాయి)

బిల్లుల పరిశీలనకు సెలక్ట్ కమిటీని వేస్తున్నట్లుగా నోటిఫికేషన్‌ను విడుదల చేయాలంటూ శాసనమండలి చైర్మన్ ఎండీ షరీఫ్ ఇచ్చిన ఆదేశాలను, దానిపై ఆయన రాసిన లేఖను మండలి కార్యదర్శి బాలకృష్ణమాచార్యులు తిరస్కరించారు. నిబంధనల ప్రకారం లేనందున, నోటిఫికేషన్ విడుదల చేయడం కుదరదని కరాఖండీగా చెప్పారు. నోట్ ఫైల్‌ను తిప్పిపంపారు. దీంతో చైర్మన్ ఆదేశాలు దాదాపు నిలిచిపోయినట్లయింది. పైపెచ్చు ఈ బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపుతామని చైర్మన్ షరీఫ్ అధికారికంగా చెప్పినా..అది చెల్లుబాటు కాదని అసెంబ్లీ సెక్రటేరియట్ అంటోంది. చైర్మన్ ఈ ఆదేశాలు జారీ చేసి 14 రోజులు పూర్తయిపోవడమే దీనికి కారణమని, దీనివల్ల రెండు బిల్లులూ పాసైనట్లుగానే భావించాల్సి ఉంటుందని అధికార పక్షం వాదిస్తోంది. చైర్మన్ ఆదేశాలను బేఖాతరు చేసే అధికారం మండలి కార్యదర్శికి ఉండదని, ఆయన వైఖరి మారకపోతే సభాహక్కుల తీర్మానం ప్రవేశపెడతామని శాసనమండలిలో ఎక్కువమంది సభ్యులు కలిగిన తెలుగుదేశం పార్టీ నేతలు హెచ్చరిస్తున్నారు. దీంతో సెలక్ట్ కమిటీ విషయంలో ఇప్పటివరకూ శాసన మండలి వేదికగా జరుగుతున్న యుద్ధం, మండలి కార్యదర్శి నిర్ణయంతో న్యాయపోరాటానికి దారితీస్తున్న వాతావరణం కనిపిస్తోంది.

## ఆ అధ్యాయం ముగిసినట్టే

**చైర్మన్ ఆదేశాలు చెల్లవు : ఉమ్మారెడ్డి**

శాసనసభా వ్యవహారాలకు నిఘంటువులా భావించే కౌల్ అండ్ షక్దర్ పుస్తకంలోని 595 పేజీలోని నిబంధనల మేరకు .. శాసనమండలి చైర్మన్ షరీఫ్ ఇచ్చిన ఆదేశాలు చెల్లవని శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు వెల్లడించారు. 14 రోజులు ముగిసినందున .. ఇక సెలెక్ట్ కమిటీ అధ్యాయం ముగిసినట్లుగానే భావించాలన్నారు. ఈ అంశంపై సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "సహజంగా ఏదైనా బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలనుకుంటే ముందస్తుగా ఆ విషయాన్ని శాసనమండలిలోనే వెల్లడించాలి. తక్షణమే .. డివిజన్ కోరాలి. ఓటింగ్‌ను నిర్వహించాక, సెలక్ట్ కమిటీకి పంపాలి. సభలో మెజారిటీ సభ్యులు ఆమోదిస్తే .. అప్పుడు దానిని కూడా ప్రకటించాలి. అ తర్వాత సెలెక్ట్ కమిటీలో ఎందరుంటారో, ఏయే పార్టీల తరపున ఎందరు సభ్యులు ఉంటారో కూడా వెల్లడించాలి. ఆవెంటనే సెలెక్ట్ కమిటీకి పేర్లను నిర్ణీత గడువులోగా పంపాలని కోరాలి. ఈ పేర్లను పంపాకే, కమిటీని వేస్తున్నట్లుగా గెజిట్ విడుదల చేయాలి. అలాకాకుండా ఏకపక్షంగా సెలెక్ట్ కమిటీకి పంపుతున్నానని చైర్మన్ ప్రకటిం చేస్తే కుదరదు. అది నిబంధనల ప్రకారం చెల్లదు. పైగా తమ పార్టీ అభిప్రాయం గానీ, అనుమతి గానీ లేకుండా మంత్రులు, సభ్యుల పేర్లను కూడా సెలెక్ట్ కమిటీ కింద వేయడం మరో తప్పు. సభ్యులను అడగకుండా .. మండలిలో సభానాయకుడినిగానీ, మండలిలో చీఫ్‌విప్‌ను గానీ సంప్రదించకుండానే కమిటీని వేయడం కుదరదు" అని ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు.

### అసలేం జరిగిందంటే...

శాసనమండలి చైర్మన్ ఆదేశాలను అసెంబ్లీ సెక్రటేరియట్ సహజంగా తూచాతప్పకుండా పాటిస్తుంది. కానీ, రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో .. చైర్మన్ ఆదేశాలను అసెంబ్లీ సెక్రటేరియేట్ పరిగణనలోకి తీసుకోవడం లేదు. శాసనసభలో వైసీపీకి సంపూర్ణ ఆధిక్యత ఉంది. శాసనమండలిలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి మెజారిటీ ఉంది. ఈ నేపథ్యంలో సీఆర్‌డీఏ రద్దు, పాలనా వికేంద్రీకరణ బిల్లులను శాసనసభా శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. శాసనసభలో ఈ బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం లభించగా, శాసనమండలిలో చుక్కెదురైంది. ఈ బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపుతున్నట్లుగా చైర్మన్ షరీఫ్ ప్రకటించి .. సభను నిరవధికంగా వాయిదా వేశారు. చైర్మన్ ఆదేశాల ప్రకారం వైసీపీ మినహా మండలిలోని రాజకీయ పార్టీలు తమ సభ్యుల పేర్లను సెలెక్ట్ కమిటీకి సూచించాయి. వాటిని పరిగణనలోకి తీసుకొన్న చైర్మన్... రెండు కమిటీల చైర్మన్లుగా మంత్రులు బొత్స, బుగ్గన, ఈ కమిటీల్లో వైసీపీ సభ్యులుగా ఇక్బాల్, వెన్నపూస గోపాలరెడ్డి పేర్లను సిఫారసు చేశారు. ఈ మేరకు సెలెక్ట్ కమిటీలను వేస్తూ నోటిఫికేషన్ జారీ చేయాలని మండలి కార్యదర్శికి లేఖ రాశారు. ఈ లేఖను సోమవారం మండలి కార్యదర్శి తిరస్కరించడంతో ఈ వివాదం మరింత క్లిష్టంగా మారింది. నోట్‌ఫైల్‌పై కార్యదర్శి తన అభిప్రాయాన్ని రాసి తిప్పి పంపిన సమాచారం తెలుగుదేశం ఎమ్మెల్సీలకు తెలిసింది. అంతే .. హుటా హుటిన బుద్దా వెంకన్న, అశోక్‌బాబు, బుద్దా నాగ జగదీశ్వరరావు, బచ్చుల అర్జునుడు శాసన మండలికి చేరుకున్నారు. శాసనమండలి కార్యదర్శి బాలకృష్ణమాచార్యులును కలసి .. చైర్మన్ ఆదేశాలను ధిక్కరించే అధికారం అసెంబ్లీ సెక్రటేరియేట్‌కు లేదని వాదించారు. చైర్మన్ ఆదేశాలు పాటించనందున .. సభా హక్కుల ఉల్లంఘన నోటీసును ఇస్తామని హెచ్చరించారు. తాను నిబంధనల మేరకే వ్యవహరించానని వారికి బాలకృష్ణమాచార్యులు సమాధానం ఇచ్చారు. తనపై నోటీసును ఇస్తే .. నిబంధనల మేరకు సమాధానం ఉంటుందని స్పష్టం చేశారు. తన కార్యాలయానికి బుద్దా వెంకన్న తదితరులు వచ్చిన విషయాన్ని మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు బాలకృష్ణమాచార్యులు తెలియజేశారు.

### న్యాయపోరాటం చేస్తాం: టీడీపీ ఎమ్మెల్సీలు

శాసనమండలి చైర్మన్ ఇచ్చిన ఆదేశాలను మండలి కార్యదర్శి పాటించాలని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కోరారు. శాసనమండలి కార్యదర్శిని ప్రభుత్వం బెదిరిస్తోందని విమర్శించారు. ఈ కారణంగానే చైర్మన్ ఆదేశాలను ఆయన పక్కన పెట్టారన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని, ప్రభుత్వం అధికారులను బెదిరిస్తున్న తీరును కేంద్రానికి తెలియజేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏదో రకంగా బిల్లులను పాస్ చేయించుకునే ప్రయత్నం చేస్తోందని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు విమర్శించారు. బిల్లులు సెలెక్ట్ కమిటీకి వెళ్లి తీరతాయని ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు తెలిపారు. శాసనమండలి సెక్రటరీ భయపడుతున్నారని ఎమ్మెల్సీ బుద్దా నాగజగదీశ్వరరావు చెప్పారు.

## చైర్మన్ చెబితే కోర్టులే కాదనవు

- ప్రభుత్వానికేమి అధికారం ఉంటుంది? : యనమల



అమరావతి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : "శాసనమండలి చైర్మన్ ఆదేశాలను కార్యదర్శి పాటించాలి. కానీ అలా పాటించకుండా ప్రభుత్వం ఆయనపై ఒత్తిడి తెస్తోంది" అని మండలిలో విపక్ష నేత యనమల రామకృష్ణుడు ఆరోపించారు. చైర్మన్ ఆదేశాలను ధిక్కరించి వ్యవహరిస్తే ఆయనపై సభాహక్కుల నోటీసు ఇస్తామని, జరుగుతున్న పరిణామాలపై త్వరలో గవర్నర్‌ను కలిసి అన్నీ వివరిస్తామని పేర్కొన్నారు. "మూడు రాజధానులకు వ్యతిరేకంగా ప్రజలు గళమెత్తుతున్నారు. తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. వాటికి ప్రతిబింబంగా శాసనమండలి వ్యవహరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అన్నిచోట్లా దిగువ సభ హడావుడిగా పంపే బిల్లులను ఎగువ సభ బ్రేక్ వేసి...పునరాలోచన చేసేలా చేసే విధానం ఉంది. అదే బాటలో చైర్మన్ సాగారు. సెలెక్ట్ కమిటీకి పేర్లను పంపాలని అన్ని పార్టీలను ఆయన ఆదేశించగా, తెలుగు దేశం, బీజేపీ, పీడీఎఫ్‌లు ఇచ్చాయి. వాటితో కమిటీని ఏర్పాటుచేస్తూ కార్యదర్శి బులెటిన్ ఇవ్వాలి. ఆయన ఎట్టిపరిస్థితుల్లోనూ చైర్మన్ ఆదేశాలను పక్కనపెట్టడానికి లేదు. అయినా, బిల్లులను సెలక్ట్ కమిటీకి పంపితే ప్రభుత్వానికి అంత కంగారెందుకు? ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడానికి మూడునుంచి ఆరునెలల పాటు సమయం పడుతుంది. అంతవరకుమాత్రమే మండలి ఏ బిల్లులను అయినా ఆపగలుగుతుంది. ఆ మాత్రం ఓపిక కూడా లేకుండా ప్రభుత్వం వ్యవహరించడం అప్రజాస్వామికం. పైగా, చైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు ఇస్తామని మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్, మండలిలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు లేఖలు రాశారు. అసలు వారికి తెలిసి మాట్లాడుతున్నారా? తెలియక మాట్లాడుతున్నారా? ఎవరిపై అయినా సభాహక్కుల నోటీసు ఇవ్వాలంటే చైర్మన్‌కు ఇవ్వాలి. అంతే తప్ప చైర్మన్‌పై సభాహక్కుల నోటీసు ఇస్తాం అనడం ఏమిటి? రాజ్యాంగంలోని ఆర్టికల్ 212ప్రకారం సభా వ్యవహారాల్లో సాంకేతిక అంశాల్లో పొరపాట్లు ఉన్నా...ఒకసారి చైర్మన్ నిర్ణయం తీసుకుంటే కోర్టులే జోక్యం చేసుకోలేవు. ఇక ప్రభుత్వానికి ఏం అధికారం ఉంటుంది? ఆరోజు మండలిలో మేం ఓటింగ్ అడిగాం. మంత్రులు, అధికార పక్ష సభ్యులు చైర్మన్‌ను చుట్టుముట్టి రసాభాస చేశారు. ఆ పరిస్థితుల్లో చైర్మన్ తన విచక్షణాధికారాన్ని ఉపయోగించి బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపారు" అని యనమల వివరించారు. ప్రభుత్వం శాసనసభను ప్రోరోగ్ చేస్తుందని అంటున్నారని, అయినా బిల్లులు మురిగిపోవని యనమల స్పష్టం చేశారు.


తాడికొండ అడ్డరోడ్డు వద్ద వర్షంలోనే దీక్షా శిబిరంలో కూర్చున్న మహిళలు, రైతులు

## యువకుల దీక్ష భగ్నం

వెలగపూడిలో యువ రైతులు బొర్రా రవి, తాడికొండ శ్రీకర్ చేపట్టిన 151 గంటల నిరాహార దీక్షను ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పోలీసులు భగ్నం చేశారు. అప్పటికే వారు 113 గంటల పాటు దీక్ష చేశారు. వారికి బీపీ, షుగర్ స్థాయిలు పడిపోయాయని వైద్య పరీక్షల్లో తెలింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి దీక్షను భగ్నం చేశారు. ఈ దశలో పోలీసులను రైతులు, మహిళలు అడ్డుకున్నారు. అయినా పోలీసులు బలవంతంగా యువకులను అంబులెన్స్ ఎక్కించి గుంటూరు ఆసుపత్రికి తరలించారు. వారిని ప్రత్తిపాటి పుల్లారావు, ఆనందబాబు, సుంకర పద్మశ్రీ తదితరులు పరామర్శించారు.

- రాజధాని తరలింపునకు నిరసనగా అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జేఏసీ నేతలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 44 వరోజుకు చేరుకున్నాయి.
- అమరావతిని రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రు గ్రామాల్లో రిలే నిరసన దీక్షలు సోమవారం 55వ రోజుకు చేరాయి. యర్రబాలెంలో మహిళలు, జేఏసీ నేతలు భిక్షాటనతో వినూత్న నిరసన తెలిపారు. తుళ్లూరులో జోరు వానలోనూ నిరసనలు కొనసాగించారు. విజయవాడ సిద్ధార్థనగర్‌కు చెందిన వారు రూ.20 వేలు విరాళం అందజేశారు.
- ఒక్క చాన్స్ పేరుతో జగన్మోహనరెడ్డిని సీఎంను చేసి.. ప్రజలు మరణ శాసనాన్ని రాసుకున్నారని మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా రాజధాని మహిళలు చేస్తున్న నిరసనలకు చరిత్రలో ఒక పేజీ ఉంటుందన్నారు.
- శాంతియుతంగా నిరసనలు చేస్తున్నాం.. కాబట్టే జగన్ ఫ్లెక్సీలు చించకుండా ఉంచామని టీడీపీ అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ అన్నారు.
- తుళ్లూరులో అమరావతి జేఏసీ అధికార ప్రతినిధి కే శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏపీ తగలబడుతుంటే.. బీజేపీ బొగ్గులు ఏరుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఏదో చేస్తారనుకున్న జనసేనాని పవన్ కల్యాణ్ బీజేపీతో చేరి సైలెంట్ అయ్యారని విమర్శించారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ జగన్ ఏజెంట్‌లా మాట్లాడుతున్నారన్నారన్నారు.
- తాడికొండ అడ్డరోడ్డులో మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా మాట్లాడుతూ మాజీ సీఎంచంద్రబాబుపై ఉన్న ద్వేషంతోనే జగన్ రాజధానిని తరలిస్తున్నారని ఆరోపించారు. న్యాయవాది చందోలు శోభారాణి మాట్లాడుతూ రాజధాని రైతులపై త్వరలోనే సినిమా తీయాలని నిర్ణయించుకున్నామన్నారు.


రాజధాని ఉద్యమానికి మద్దతు కోరుతూ రాయపూడి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న మహిళలు



కృష్ణాయపాలెంలో ఆర్టీసీ బస్సును శుభ్రపరచి నిరసన తెలుపుతున్న మహిళలు

# సీజే అయినా వింటారని..!

(మొదటి పేజీ తరువాయి)

తమ ఆవేదనను తెలిపారు. తమకు న్యాయం చేయండంటూ న్యాయమూర్తులకు కనపడేలా ప్లకార్డులను ప్రదర్శించారు. అయితే, న్యాయమూర్తు వెళ్లే మార్గంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తుళ్లూరులో ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. సీజే కాన్వాయ్ వెళ్లిన తర్వాత రైతులు 'జై అమరావతి' నినాదాలు చేశారు. కాగా, అమరావతి కోసం రైతులు చేస్తున్న ఆందోళనలు సోమవారం 55వ రోజుకు చేరాయి. తుళ్లూరు, మందడంలో మహాధర్నాలను కొనసాగించారు. వెలగపూడి, రాయపూడి, కృష్ణాయపాలెం, యర్రబాలెం, గుంటూరు కలెక్టరేట్, తాడికొండ, పెదపరిమి తదితర ప్రాంతాల్లో రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. కృష్ణాయపాలెం శివాలయం సెంటర్‌లో బస్సులు తుడిచి, ప్రయాణికులకు గులాబి పూలు ఇచ్చి నిరసన తెలిపారు. రైతుల దీక్షకు సీతానగరం కృష్ణవేణి స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు.


వెలగపూడి శిబిరంలో మహిళల నినాదాలు

## జగన్ కోసం జైలు సిద్ధం!

- ఎమ్మెల్యే గోరంట్ల వ్యాఖ్య
- అమరావతికి మద్దతుగా రాజమండ్రి నేతల ర్యాలీ

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): 'రూ.కోట్లు దోచుకుని, 14 కేసుల్లో నిందితుడిగా ఉన్న సీఎం జగన్‌కు ఆలస్యంగా నైనా శిక్షణ తప్పదు. ఆయన కోసం రాజమండ్రి సెంట్రల్ జైలును సిద్ధం చేశాం' అని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బుచ్చయ్య అధ్యక్షతన రాజమండ్రి నుంచి టీడీపీ నాయకులు భారీ సంఖ్యలో 60 కార్లలో ర్యాలీగా తరలివచ్చి అమరావతి రైతులకు మద్దతు తెలిపారు. తొలుత మందడం వరకు చేరుకుని అక్కడ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. బుచ్చయ్య మాట్లాడుతూ, రాజధానిని ఎందుకు మారుస్తున్నారో జగన్ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తప్పుడు నిర్ణయాలతో జగన్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారని ఆరోపించారు.


తుళ్లూరులో దీక్షా శిబిరంలో ప్రసంగిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మద్దతుగా నినాదాలు చేస్తున్న మహిళలు

## 'ఆ గ్రామాల' విలీనం చట్ట విరుద్ధం!.. హైకోర్టులో పిటిషన్ దాఖలు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లి మున్సిపాలిటీలో పెనుమాక, ఉండవల్లి, పాతూరు, గుండెమెడ, వడ్డేశ్వరం, ఇప్పట్నం, మల్లెంపూడి, చిర్రావూరు గ్రామాలను విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ గ్రామాలను విలీనం చేస్తూ ప్రభుత్వం ఈ నెల 6న జీవో 97ను జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ గుంటూరుకు చెందిన కళ్లం రాజశేఖర్‌రెడ్డితో పాటు మరికొందరు హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. ల్యాండ్‌పూలింగ్ కింద ఇప్పటికే తాము ఎంతో విలువైన భూమిని కోల్పోయామని, ఆ భూమికి బదులుగా ఇవ్వాల్సిన ప్లాట్లు కూడా ప్రభుత్వం ఇంత వరకు ఇవ్వలేదని పిటిషనర్లు వాపోయారు. ఆ ప్లాట్ల కోసం తాము పోరాటం చేస్తున్నామన్నారు. ఉగాదినాడు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, అయితే, తాడేపల్లి మండల పరిధిలో పంపిణీకి భూమి లభించకపోవడంతో తమ గ్రామాలను ఆ మండలంలో విలీనం చేశారని తెలిపారు. పెనుమాక, ఉండవల్లి గ్రామాలు సీఆర్‌డీఏ చట్ట ప్రకారం రాజధాని పరిధిలోనివని, అందువల్ల వాటిని డీనోటిఫై చేయకుండా మున్సిపాలిటీలో కలపలేరని పేర్కొన్నారు.

## 'మా భూముల్ని అభివృద్ధి చేసివ్వండి'

- హైకోర్టును ఆశ్రయించిన రాజధాని రైతులు

అమరావతి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాజధాని కోసం భూ సమీకరణ కింద తమ భూముల్ని స్వాధీనం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఒప్పందం ప్రకారం తమకు అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇవ్వాల్సి ఉందని, అయితే ఇప్పటి వరకు అది కార్యాచరణ దాల్చనందున ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ రాజధానికి చెందిన రైతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు 7 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి ముందు విచారణ జరిగింది. పిటిషనర్ల తరపున న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదిస్తూ.. రాజధాని ప్రాంతంలో అభివృద్ధి కార్యకార్యక్రమాలను కొనసాగించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని అభ్యర్థించారు. తమ వద్ద తీసుకున్న భూమిని ప్రభుత్వం ఇతరులకు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేపట్టిందని, దీనిని అడ్డుకోవాలన్నారు. సీఆర్‌డీఏ తరపున న్యాయవాది కాసా జగన్మోహన్‌రెడ్డి గడువు కావాలని కోరగా న్యాయమూర్తి.. విచారణను 2 వారాలకు వాయిదా వేశారు.




## ఆస్ట్రేలియా 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్'గా వార్నర్

**మెల్‌బోర్న్:** డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ ఆస్ట్రేలియా క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు దక్కించుకున్నాడు. 2020 అవార్డుల కోసం నిర్వహించిన ఓటింగ్‌లో స్టీవ్ స్మిత్ (193 ఓట్లు)ను వార్నర్ ఒక్క ఓటు తేడాతో ఓడించాడు. అలెన్ బోర్డర్ మెడల్‌ను మూడోసారి దక్కించుకున్నాడు. పురుషుల టీ20 ప్లేయర్ ఆఫ్ ఇయర్ అవార్డును కూడా వార్నర్ సొంతం చేసుకున్నాడు. పురుషుల వన్డే ప్లేయర్ ఆఫ్ ఇయర్‌గా ఆరోన్ ఫించ్, టెస్ట్ ప్లేయర్‌గా లబుషేన్ ఎన్నికయ్యారు. బెస్ట్ ఫిమేల్ క్రికెటర్ ఆఫ్ ఇయర్‌గా నిలిచిన ఎలీస్ పెర్రీకి బెలిండా క్లార్క్ మెడల్ లభించింది.

## పతకమే లక్ష్యం..

- ఫిలిప్పీన్స్ చేరిన భారత జట్టు
- ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

**మనీలా:** కరోనా వైరస్ భయపెడుతున్న నేపథ్యంలో ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు రంగం సిద్ధమైంది. మంగళవారం మొదలయ్యే ఈ టోర్నీలో తలపడేందుకు కిడాంబి శ్రీకాంత్, సాయిప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్, శుభాంకర్ డే, లక్ష్యసేన్‌తో కూడిన భారత జట్టు సోమవారం ఇక్కడకు చేరుకుంది. యువ షట్లరు అస్మిత, మాల్వికతో కూడిన మహిళ జట్టుకూడా తలపడాల్సి ఉన్నా.. కరోనా వైరస్ భయంతో విరమించుకుంది. కాగా.. పతకమే లక్ష్యంగా ఇక్కడకు అడుగుపెట్టిన భారత జట్టు.. తద్వారా ఒలింపిక్ ఏడాదిలో కీలకమైన ర్యాంకింగ్ పాయింట్లు చేజిక్కించుకోవాలని భావిస్తోంది. 2016లో కాంస్య పతకం నెగ్గిన భారత్..వాస్తవంగా ఇండోనేసియా, ఫిలిప్పీన్స్‌తో కలిసి గ్రూప్ 'ఎ'లో ఉంది. కానీ కరోనా కారణంగా చైనా, హాంకాంగ్ జట్లు టోర్నీనుంచి వైదొలగడంతో డ్రాలను మళ్లీ నిర్వహించారు. దాంతో మలేసియా, కజకిస్థాన్‌తో కలిసి గ్రూప్ 'బి'లో భారత్ అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. నాలుగు గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంటాయి. మంగళవారం జరిగే మ్యాచ్‌లో కజకిస్థాన్‌తో, గురువారం మలేసియాతో భారత్ తలపడనుంది.



## 4 నెలల్లో 26 కిలోలు బరువు తగ్గిన సానియా

**న్యూఢిల్లీ:** ఊబకాయంతో సతమతమవుతూ..దానిని తగ్గించుకొనేందుకు ప్రయత్నిస్తున్న యువతులకు వెటరన్ టెన్నిస్ ప్లేయర్ సానియా మీర్జా స్ఫూర్తిగా నిలుస్తోంది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత సానియా శరీర బరువు 89 కిలోలకు చేరింది. మళ్లీ ఆటలో ప్రవేశించాలని నిర్ణయించుకున్న ఆమె.. బరువు తగ్గేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. నాలుగు నెలల్లో 26 కేజీల బరువు తగ్గడమే ఆ టార్గెట్. అందుకు పట్టుదలగా శ్రమించిన సానియా నాలుగు నెలల్లో 63 కిలోలకు చేరుకుంది. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో సోమవారం పోస్ట్ చేసింది. '89 కిలోలనుంచి 63 కిలోలు' అన్న క్యాప్షన్‌తో.. 'మనందరికీ దీర్ఘ కాలిక, రోజువారీ లక్ష్యాలుంటాయి. వాటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి' అని సానియా సూచించింది.

# 'ఓదార్పు' దక్కేనా?

ఇంతలో ఎంత మార్పు.. మౌంట్ మాంగనూలోనే జరిగిన ఐదో టీ20లో భారత్ క్లీన్‌స్వీప్ కోసం బరిలోకి దిగితే.. కివీస్ వైట్‌వాష్ నుంచి తప్పించుకోవాలనుకుంది. కానీ వన్డే ఫార్మాట్‌కు వచ్చేసరికి పరిస్థితి పూర్తి రివర్స్ అయింది.. ఇప్పుడిదే మైదానంలో చివరి మ్యాచ్ జరుగనుండగా ఒత్తిడంతా భారత్‌కు షిఫ్టయింది. ఆతిథ్య జట్టు మాత్రం తమ జోరులో ఎలాంటి తేడా లేకుండా సిరీస్‌ను అజేయంగా ముగించాలనుకుంటోంది. అటు చూస్తే అంచనాలను అందుకోలేక డీలా పడిన కోహ్లీ సేన కనీసం ఓదార్పు విజయమైనా దక్కించుకోవాలనుకుంటోంది. ఇక పోయేదేమీ లేదు కాబట్టి జట్టు రిజర్వ్ బెంచ్‌ను కూడా పరీక్షించే అవకాశం ఉంది.

- పరువు కోసం భారత్
- క్లీన్‌స్వీప్ లక్ష్యంగా కివీస్
- నేడు ఆఖరి వన్డే


రవిశాస్త్రితో బుమ్రా

**ఉదయం 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..**


కోహ్లీ

**మౌంట్ మాంగనూ:** మూడు వన్డేల సిరీస్‌లో భారత జట్టు పరువు కాపాడుకునేందుకు బరిలోకి దిగుతోంది. ఇప్పటికే 0-2తో కివీస్‌కు సిరీస్ కోల్పోగా నేడు (మంగళవారం) జరిగే ఆఖరి మ్యాచ్‌లోనైనా గట్టి పోటీనివ్వాలనుకుంటోంది. ఇప్పటిదాకా భారత జట్టు బౌలింగ్.. బ్యాటింగ్.. రెండింట్లోనూ విఫలమై మూల్యం చెల్లించుకుంది. ఈస్థితిలో మూడో వన్డే కూడా ఓడి వైట్‌వాష్ అయితే పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది కాబట్టి అసలైన ఆటను ప్రదర్శించాలనుకుంటోంది. మరోవైపు టీ20 సిరీస్ పరాభవానికి దెబ్బకు దెబ్బ తీయడమే లక్ష్యంగా ఆతిథ్య జట్టు సిరీస్‌ను 3-0తో ముగించాలన్న పట్టుదలతో ఉంది. కెప్టెన్ విలియమ్సన్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచింది.

**టాపార్డర్ రాణించాల్సిందే..:** హామిల్టన్, ఆక్లాండ్ మ్యాచ్‌ల్లో ఓటముల తర్వాత ఈ ఏడాది వన్డేలకు పెద్దగా ప్రాధాన్యం లేదని కెప్టెన్ కోహ్లీ చెప్పుకొచ్చాడు. 2023 వరకు ఎలాంటి ఐసీసీ టోర్నీ లేకపోవడంతో ఈ ఫార్మాట్‌కు తాము ప్రాముఖ్యం ఇవ్వడం లేదన్నది అతడి ఉద్దేశం. దీంతో చివరిదైన ఈ మ్యాచ్‌కు జట్టులో మార్పులు ఉండబోతున్నాయి. దీంతో రిషబ్ పంత్, మనీశ్ పాండేలలో ఒకరు కచ్చితంగా బరిలోకి దిగవచ్చు. ఇక రెండు మ్యాచ్‌ల్లో 27, 9 పరుగులు చేసిన కేదార్ జాదవ్ స్థానం దాదాపు గల్లంతయినట్టే. సోమవారం ఆప్షనల్ ప్రాక్టీస్ కావడంతో రాహుల్, షా, అయ్యర్, చాహల్ దూరంగా ఉన్నారు. అలాగే అరుదైన అవకాశం దక్కించుకున్న ఓపెనర్లు పృథ్వీ షా, మయాంక్ అగర్వాల్ కూడా ఈ సిరీస్‌లో ప్రభావం చూపలేకపోయారు. సత్తా చూపేందుకు ఈ మ్యాచ్ వారికి చివరి అవకాశం కానుంది. రోహిత్ గాయపడడం జట్టుకు సమస్యగా మారింది. దీంతో భారమంతా కెప్టెన్ కోహ్లీపై పడగా అతడి నుంచి కూడా భారీ స్కోరు రావాల్సి ఉంది. టాపార్డర్ రాణిస్తేనే విజయంపై ఆశలు పెట్టుకోవచ్చు. మిడిలార్డర్‌లో శ్రేయాస్, రాహుల్ ఫామ్‌లోనే ఉండగా లోయరార్డర్‌లో జడేజా, సైనీ విలువైన పరుగులు అందిస్తున్నారు. మరోవైపు బౌలింగ్ విభాగంలో బుమ్రా వరుసగా మూడో వన్డేలోనూ వికెట్ తీయలేకపోవడం ఆందోళనపరిచే విషయం. వన్డేల్లో నెంబర్‌వన్‌గా అతడి స్థాయికి నిజంగా ఇది ఇబ్బందికరమే. ఈ మ్యాచ్‌లో అతడికి విశ్రాంతినిచ్చి షమిని ఆడించే అవకాశం ఉంది. యువ పేసర్ సైనీ అద్భుత బంతులతో కట్టడి చేయగలుగుతున్నాడు.

**విలియమ్సన్ రాక:** తొలి మ్యాచ్‌లో 348 పరుగుల ఛేదనలో బ్యాట్స్‌మెన్ దుమ్ము రేపగా రెండో మ్యాచ్‌లో 273 పరుగుల స్కోరును కూడా తమ బౌలర్ల ప్రతిభతో కివీస్ కాపాడుకోగలిగింది. దీంతో గతేడాది నుంచి భారత్‌పై వరుసగా మూడో విజయం అందుకుంది. నిజానికి ఈ జట్టు బౌలింగ్ విభాగం గాయాల సమస్యతో ఇబ్బందిపడుతోంది. బౌల్ట్, హెన్రీ, ఫెర్గూసన్ ఎవరూ కూడా జట్టులో లేరు. ఇక బ్యాటింగ్‌లోనూ రెగ్యులర్ కెప్టెన్ విలియమ్సన్ తొలి రెండు మ్యాచ్‌లు ఆడలేదు. కుగెలిన్, శాంట్నర్‌తో పాటు సౌతీ కూడా వంద శాతం ఫిట్‌గా లేడు. అయినా పటిష్ఠమైన భారత్‌పై సిరీస్ నెగ్గడం వీరి ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచినట్టయింది. ఇప్పుడు కేన్ రాకతో బ్యాటింగ్ మరింత బలపడింది. అలాగే స్పిన్నర్ ఇష్ సోధీ, పేసర్ టిక్నెర్‌లను ఫైనల్ మ్యాచ్‌కు రప్పించారు. రాస్ టేలర్ భీకర ఫామ్ భారత బౌలర్లకు పీడకలను మిగుల్చుతోంది. గప్టిల్, నికోల్స్, లాథమ్‌లతో పాటు పేసర్ జేమిసన్ ఆల్‌రౌండ్ షో జట్టు క్లీన్‌స్వీప్‌కు ఉపయోగపడుతుందనే భావనలో కివీస్ ఉంది.


కివీస్ ఆటగాళ్లు

**2** ఇక్కడ ఆడిన రెండు వన్డేల్లోనూ భారత్ గెలిచింది. అలాగే కివీస్ మొత్తం 8 మ్యాచ్‌లు ఆడితే మూడు మాత్రమే నెగ్గి ఐదింట్లో ఓడిపోయింది.

**1989లో చివరిసారి వన్డే సిరీస్‌లో భారత జట్టు వైట్‌వాష్ (విండీస్‌పై 0-5తో) అయింది.**

**జట్లు (అంచనా)**

**భారత్:** మయాంక్ అగర్వాల్, పృథ్వీ షా, కోహ్లీ (కెప్టెన్), శ్రేయాస్ అయ్యర్, రాహుల్/పంత్, జడేజా, జాదవ్/పాండే/దూబే, శార్దూల్ ఠాకూర్, చాహల్/కుల్దీప్, సైనీ, షమి/బుమ్రా.
**కివీస్:** గప్టిల్, నికోల్స్, విలియమ్సన్ (కెప్టెన్), టేలర్, లాథమ్, నీషమ్, గ్రాండ్‌హోమ్, సౌథీ, జేమిసన్, సోధీ/శాంట్నర్, బెన్నెట్.

**పిచ్, వాతావరణం**

బే ఓవల్ పిచ్ సహజంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ఇక్కడ వన్డే సగటు స్కోరు 280. కానీ చివరిసారి ఈ రెండు జట్ల మధ్య జరిగిన వన్డేతో పాటు ఇటీవలి టీ20 మ్యాచ్‌లోనూ పిచ్ స్లోగా మారి బౌలర్లకు సహకరించింది. వర్షం నుంచి మ్యాచ్‌కు ఎలాంటి ముప్పు లేదు.

## బంగ్లా జట్టు ప్రవర్తనపై.. ఐసీసీ సీరియస్

**వీడియో ఫుటేజ్ పరిశీలన..ఆపై నిర్ణయం**

**పోచెఫ్‌స్ట్రూమ్:** అండర్-19 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన తర్వాత బంగ్లాదేశ్ కుర్రాళ్లు ప్రవర్తించిన తీరుపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సీరియస్ అయ్యింది. మ్యాచ్ వీడియో ఫుటేజ్‌ను పరిశీలించాక తగు నిర్ణయం తీసుకుంటుందని భారత జట్టు మేనేజర్ అనిల్ పటేల్ సోమవారం తెలిపాడు. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో విజయానికి అవసరమైన సింగిల్ రాగానే బంగ్లా ఆటగాళ్లంతా మైదానంలోకి పరిగెత్తుకొస్తూ భారత క్రికెటర్లను ఎగతాళి చేశారు. ఇది శ్రుతి మించడంతో ఇరు జట్ల ఆటగాళ్ల తోపులాటకు దారితీసింది. వెంటనే



అంపైర్లు జోక్యం చేసుకుని వివాదాన్ని సద్దుమణిగేలా చేశారు. 'బంగ్లా క్రికెటర్ల అనుచిత ప్రవర్తన అందరినీ షాక్‌కు గురిచేసింది. రెఫరీ గ్రేమ్ లాబ్రూ కూడా మా దగ్గరికి వచ్చి విచారం వ్యక్తం చేశాడు. ఐసీసీ ఈ ఘటనపై సీరియస్‌గా ఉంది. వీడియో ఫుటేజ్‌ను పరిశీలించాక ఓ నిర్ణయం తీసుకోనున్నారు' అని పటేల్ వివరించాడు. మరోవైపు తమ ఆటగాళ్ల ప్రవర్తనపై బంగ్లాదేశ్ కెప్టెన్ అక్బర్ అలీ క్షమాపణ చెప్పాడు.

**వారిది చెత్త ప్రవర్తన: గార్గ్**



బంగ్లాదేశ్ క్రికెటర్ల ప్రవర్తన చెత్తగా ఉందని భారత్ కెప్టెన్ ప్రియం గార్గ్ ఘాటుగా వ్యాఖ్యానించాడు. 'మేం సాధారణంగానే ఉన్నాం. ఆటలో గెలుపోటములు సహజం. కొన్నిసార్లు గెలుస్తాం. మరి కొన్ని ఓడిపోతాం. కానీ వారి ప్రవవర్తన మాత్రం అసహ్యంగా ఉంది. అలా ఉండకూడదు' అని గార్గ్ అభిప్రాయపడ్డాడు.

**జట్టుకు పౌరసన్మానం**

తొలిసారి ఐసీసీ ట్రోఫీ సాధించిన తమ జట్టుకు పౌరసన్మానం చేయాలని బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ప్రధాని హసీనా ఆధ్వర్యంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. జట్టు స్వదేశం వచ్చాక సన్మాన తేదీని ఖరారు చేస్తామని బంగ్లాదేశ్ రవాణా మంత్రి ఒబైదుల్లా వెల్లడించారు.

### సోదరి మృతి విషాదాన్ని దిగమింగి..

**ఢాకా:** తననెంతో ప్రేమించే సోదరి మరణంతో గుండెల్లో గూడు కట్టుకున్న విషాదాన్ని దిగమింగి.. బంగ్లాదేశ్ కెప్టెన్ అక్బర్ అలీ తన జట్టుకు ప్రపంచకప్ అందించాడు. భారత్‌తో ఫైనల్లో ఆరు వికెట్లు పడిన దశలోనూ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా.. అజేయంగా 43 పరుగులు చేసిన అలీ.. బంగ్లాదేశ్‌ను విశ్వవిజేతగా నిలిపాడు. కానీ కొద్దిరోజుల కిందట అతడి కుటుంబంలో పెను విషాదం చోటు చేసుకుంది. అక్బర్ అక్క ఖదీజా ఖాతూన్ జనవరి 22న కవలలకు జన్మనిచ్చి మరణించింది. ఈ విషయాన్ని అలీతో చెప్పలేదు. కానీ రెండు రోజుల తర్వాత పాక్‌తో మ్యాచ్ జరిగాక అక్బర్ తన ఇంటికి ఫోన్ చేశాడు. ఆ సందర్భంగా ఖదీజా మరణవార్తను అలీకి తెలిపారు. జనవరి 18న జింబాబ్వేతో జరిగిన బంగ్లాదేశ్ ఆడిన గ్రూప్ 'సి' మ్యాచ్‌ను ఖాతూన్ తిలకించింది.

### ఫుట్‌బాలర్‌కు ఆస్కార్ అవార్డు

**లాస్ ఏంజిల్స్:** అమెరికా మాజీ ఫుట్‌బాలర్ మాథ్యూ చెర్రీ.. ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు గెలుచుకున్నాడు. అతడు దర్శకత్వం వహించిన 'హెయిర్ లవ్' యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్‌కు ఈ అవార్డు దక్కింది. ఇటీవల మరణించిన బాస్కెట్‌బాల్ దిగ్గజం కోబీ బ్రయంట్ తర్వాత అకాడమీ అవార్డు సొంతం చేసుకున్న రెండో క్రీడాకారుడు చెర్రీనే..!


దర్శకుడు చెర్రీతో సహ నిర్మాత టోలీవర్

### ఐసీసీ అండర్-19 జట్టులో యశస్వి


జైస్వాల్

**దుబాయ్:** టోర్నీ ఆద్యంతం అదరగొట్టిన భారత కుర్రాళ్లు యశస్వీ జైస్వాల్, రవి బిష్ణోయ్, కార్తీక్ త్యాగిలకు ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ ఉత్తమ జట్టులో చోటు దక్కింది. 12 మందితో కూడిన ఈ జట్టును సోమవారం ఐసీసీ ఐదుగురు సభ్యుల ప్యానెల్ ప్రకటించింది. యశస్వీ మొత్తం 400 పరుగులతో, స్పిన్నర్ బిష్ణోయ్ 17 వికెట్లతో టోర్నీ టాపర్‌గా నిలిచారు. ఆదివారం జరిగిన ఫైనల్లో భారత్‌ను ఓడించిన బంగ్లాదేశ్ చాంపియన్‌గా నిలిచిన సంగతి తెలిసిందే.

**ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ టోర్నీ జట్టు:** యశస్వీ జైస్వాల్, రవి బిష్ణోయ్, కార్తీక్ త్యాగి (భారత్), అక్బర్ అలీ (కీపర్, కెప్టెన్), మహ్మదుల్ హసన్ జాయ్, షహదాత్ హొస్సేన్ (బంగ్లాదేశ్), షఫీఖుల్లా గఫరి, ఇబ్రహీం జద్రాన్ (అఫ్ఘానిస్థాన్), రవీందు రసంత (శ్రీలంక), నయీమ్ యంగ్, జేడెన్ సీల్స్ (విండీస్). 12వ ఆటగాడు: అఖిల్ కుమార్ (కెనడా).

## రహానె అజేయ శతకం

**న్యూజిలాండ్, భారత్ 'ఎ' టెస్ట్ డ్రా**

**లింకోల్న్:** అజింక్యా రహానె (101 నాటౌట్) అజేయ శతకంతో.. న్యూజిలాండ్-ఎతో రెండో అనధికార టెస్ట్‌ను భారత్-ఎ డ్రాగా ముగించింది. ఓవర్‌నైట్ స్కోరు 234/1తో ఆఖరి, నాలుగో రోజైన సోమవారం ఆటను కొనసాగించిన భారత్-ఎ 467/5 స్కోరు చేసింది. ఆట ముగిసే సమయానికి రహానెతోపాటు అశ్విన్ (1 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. విజయ్ శంకర్ (66), చటేశ్వర్ పుజార (53) అర్ధ శతకాలు సాధించారు. న్యూజిలాండ్-ఎ తొలి ఇన్నింగ్స్‌ను 386/9 వద్ద డిక్లేర్ చేసింది. తొలి అనధికార టెస్ట్ కూడా డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌తో భారత్-ఎ న్యూజిలాండ్ పర్యటన ముగిసింది.

## పాక్ చేతిలో బంగ్లా చిత్తు

- ఇన్నింగ్స్ 44 పరుగులతో ఓటమి

**రావల్పిండి:** స్పిన్నర్ యాసిర్ షా (4/58) తిప్పేయడంతో.. తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్‌ను పాకిస్థాన్ ఇన్నింగ్స్ 44 పరుగుల తేడాతో చిత్తు చేసి మరో రోజు మిగిలుండగానే మ్యాచ్‌ను కైవసం చేసుకొంది. ఫాలో-ఆన్ ఆడుతూ.. ఓవర్‌నైట్ స్కోరు 126/6తో నాలుగోరోజైన సోమవారం ఆటను కొనసాగించిన బంగ్లా రెండో ఇన్నింగ్స్‌లో 168 రన్స్‌కే ఆలౌటైంది. నిన్నటి స్కోరుకు 42 పరుగుల జోడించి మిగతా 4 వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 233, పాకిస్థాన్ 445 పరుగులు చేశాయి. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో పాక్ 1-0తో ఆధిక్యంలో ఉంది.

## దేశవాళీ టోర్నీల సమూల ప్రక్షాళన

- మూడు దశల్లో కొత్త ఫార్మాట్
- బాయ్ నిర్ణయం

**న్యూఢిల్లీ:** దేశవాళీ టోర్నీ రూపురేఖలను భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) సమూలంగా మార్చివేసింది. మొత్తం రెండు కోట్ల రూపాయల భారీ ప్రైజ్‌మనీతో సీనియర్ స్థాయిలో మూడు దశల టోర్నమెంట్లకు రూపకల్పన చేసింది. ఈమేరకు బాయ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. వీటిలో అత్యున్నత లెవెల్-1 టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 25 లక్షలు. ఈ బాయ్ ప్రీమియర్ సూపర్ సిరీస్ టోర్నీకి మెయిన్ డ్రాకు పరిమిత స్థాయిలో ఎంట్రీలుంటాయి. లెవెల్-2లో నాలుగు బాయ్ సూపర్ సిరీస్ టోర్నీలు నిర్వహిస్తారు. వ్యక్తిగత ఈవెంట్లలో రూ. 15 లక్షలు ప్రైజ్‌మనీగా లభిస్తుంది. లెవెల్-3లో సంవత్సరంలో ఆరు బాయ్ సిరీస్ టోర్నమెంట్లు ఉంటాయి. ఒక్కో టోర్నీకి రూ. 10 లక్షల ప్రైజ్‌మనీ అందజేస్తారు. 30 మంది సింగిల్స్ ఆటగాళ్లు, డబుల్స్‌లో 15 జంటలు తలపడతాయి.

### సచిన్ ప్రశంస.. ఎంతో గొప్ప

**సిడ్నీ:** సచిన్ తనను ప్రశంసించడం ఎంతో గొప్పగా భావిస్తున్నానని ఆస్ట్రేలియా క్రికెటర్ లబుషేన్ చెప్పాడు. లబుషేన్ ఆటతీరు తనను పోలివుంటుందని, అతడు వేగంగా ఎదుగుతున్న క్రికెటరని ఇటీవల టెండూల్కర్ కితాబిచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై లబుషేన్ స్పందిస్తూ 'సచిన్ ప్రశంసించడం ఎంతో అద్భుతంగా అనిపిస్తోంది. ఆ స్థాయి ఆటగాడు నన్ను పొగడడం గొప్పగా ఉంది' అని అన్నాడు.

### షఫాలీ కల నెరవేరింది!

**మెల్‌బోర్న్:** టీనేజ్ సంచలనం షఫాలీవర్మ చిన్ననాటి కల నెరవేరింది. దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కర్‌ను ఆమె కలిసింది. ఆస్ట్రేలియా కార్చిచ్చు బాధితుల సహాయార్థం ఆదివారం నిర్వహించిన చారిటీ మ్యాచ్‌లో పాల్గొనేందుకు వచ్చిన సచిన్‌ను 16 ఏళ్ల షఫాలీ కలుసుకుంది. అతడితో దిగిన ఫొటోను ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. 'సచిన్ వల్లే నేను క్రికెట్ ఆటలోకి ప్రవేశించా. మా కుటుంబం మొత్తం ఆయనను ఆరాధిస్తుంది. ఈ రోజు నాకు ఎంతో ప్రత్యేకమైనది. నా చిన్ననాటి హీరో సచిన్‌ను కలుసుకున్నా. నా కల నెరవేరింది' అని ఆమె రాసింది.



## కివీస్ మైదానాలు విభిన్నం

పేసర్ శార్దూల్ ఠాకూర్



**మౌంట్ మాంగనూ:** న్యూజిలాండ్‌లో బౌలర్లు విజయవంతం కావాలంటే ఇక్కడి మైదానాల స్వరూపాన్ని అర్థం చేసుకోవాలని భారత పేసర్ శార్దూల్ ఠాకూర్ అభిప్రాయపడ్డాడు. అలాగే వేగంగా వీచే గాలులు కూడా సవాల్‌గా నిలుస్తాయని చెప్పాడు. 'కివీస్‌లో గ్రౌండ్స్ విభిన్నంగా ఉంటాయి. ఇలాంటి మైదానాలు ఎక్కడా ఉండవు. ఓవైపు బౌండరీ విస్తీర్ణం చాలా తక్కువగా ఉంటుంది. అందుకే ఇక్కడ బౌలింగ్ ఎలా వేయాలో ముందు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు వ్యూహాలను మార్చుకుంటూ బంతులు వేయాలి. ఇప్పుడు మిగతా రెండింటితో పోలిస్తే మౌంట్ మాంగనూలో మైదానం పెద్దగా ఉంటుంది. అలాగే ఇక్కడి పరిస్థితులను ఎదుర్కొని ఆడడం కూడా కష్టమే. ఇక కివీస్ ఆటతీరుకు వస్తే రాస్ టేలర్ అద్భుత బ్యాటింగ్‌తో అదరగొడుతున్నాడు. లెగ్ సైడ్‌కు తానే ఓ దేవుడిలా ఆడేస్తున్నాడు' అని ఠాకూర్ కొనియాడాడు.

## నైట్‌రైడర్స్ ఫీల్డింగ్ కోచ్‌గా ఫాస్టర్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ టీమ్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫీల్డింగ్ కోచ్‌గా ఇంగ్లండ్ మాజీ వికెట్ కీపర్ జేమ్స్ ఫాస్టర్ నియమితుడయ్యాడు. రాబోయే సీజన్ కోసం ఫాస్టర్‌తో ఒప్పందం చేసుకొన్నట్టు నైట్‌రైడర్స్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. 2018లో కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన ఫాస్టర్.. కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్ ఆరంభించాడు. 7 టెస్ట్‌లు, 11 వన్డేలు, 5 టీ20ల్లో ఇంగ్లండ్‌కు ప్రాతినిధ్యం వహించాడు.


*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*